



# విశ్వం వాయిస్

అవినీతిపై- అక్షరసమరం...

తెలుగు దినపత్రిక VISWAMVOICE TELUGU DAILY









SIMULTANEOUSLY PUBLISHED FROM EAST GODAVARI DISTRICT, CERCULATED AT IN WEST GODAVARI, VISAKHAPATNAM, SRIKAKULAM, VIJAYANAGARAM, VIJAYAWADA, HYDERABAD, BANGLORE, CHENNAI, DELHI, MUMBAI, TIRUPATHI, ANANTAPUR, GUNTUR, KADAPA, KHAMMAM, KARIMNAGAR, KURNOOL, NELLORE, NIZAMABAD, ONGOLE

సంపుటి : 9 సంచిక : 193 తూర్పుగోదావరి జిల్లా ఎడిటర్ : కె. సునీల్‌కుమార్ ఆదివారం 05 ఏప్రియల్ 2026 పేజీలు : 12 వెల : 2/-


## 28 జిల్లాలతో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కొత్త చిత్రపటం


### విడుదల చేసిన రాష్ట్ర విపత్తుల నిర్వహణా సంస్థ



**అమరావతి, విశ్వం వాయిస్ న్యూస్ :** ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతిగా రాష్ట్ర సరికొత్త మ్యాప్ను రాష్ట్ర విపత్తు నిర్వహణ సంస్థ శనివారం అధికారికంగా విడుదల చేసింది. గతంలో ఉన్న 26 జిల్లాలకు అదనంగా మార్కాపురం, పోలవరం ప్రాంతాలను కొత్త జిల్లాలుగా గుర్తిస్తూ మిగతా .. 2లో..

## 'సమయం మించిపోతోంది'


### ఇరాన్‌కు ట్రంప్ వార్నింగ్



**విశ్వం వాయిస్ న్యూస్ :** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇరాన్‌కు మరోసారి వార్నింగ్ ఇచ్చారు. తమతో ఒప్పందం చేసుకోవడానికి లేదా హర్మూజ్ జలసంధిని తెరవడానికి ఇరాన్‌కు ఇచ్చిన పది రోజుల గడువు దగ్గర పడిందన్నారు. సమయం మించిపోతోందని, విధ్వంసానికి మిగతా .. 2లో..

## 'కోల్‌కతానూ లక్ష్యంగా చేసుకుంటాం'..

### పాక్ మంత్రి ప్రేలాపనలు



**విశ్వం వాయిస్ న్యూస్ :** భారత్‌ను ఉద్దేశించి పాకిస్థాన్ రక్షణశాఖ మంత్రి ఖవాజా ఆసిఫ్ మరోసారి ప్రేలాపనలు చేశారు. భవిష్యత్తులో భారత్ ఏదైనా దాడులకు పాల్పడితే.. కోల్‌కతానూ లక్ష్యంగా చేసుకుంటామన్నారు. ప్రతిదాడులను ఆ ప్రాంతం వరకూ తీసుకెళ్తామంటూ వ్యాఖ్యానించారు. తన స్వస్థలం మిగతా .. 2లో..

నెదర్లాండ్స్‌లో రూ.250 కోట్లతో


## శ్రీవారి ఆలయ నిర్మాణం



**తిరుమల, విశ్వం వాయిస్ న్యూస్ :** నెదర్లాండ్స్‌లో శ్రీవారి ఆలయ నిర్మాణానికి తితిదే సహకారం అందించనుందని ఛైర్మన్ బీఆర్ నాయుడు తెలిపారు. అక్కడ ఆలయ నిర్మాణం చేపట్టేందుకు ముందుకొచ్చిన శ్రీవసుదైవ కుటుంబం (ఎస్‌వీకే) సంస్థ అధ్యక్షుడు అశోక్‌కుమార్ తరఫున ఆ సంస్థ ప్రతినిధులు శనివారం హైదరాబాద్‌లో బీఆర్ నాయుడిని ఆయన కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఛైర్మన్ మాట్లాడుతూ సీఎం చంద్రబాబు మిగతా .. 2లో..

### లక్ష్యాల మేరకు రాజధాని పనులు

# పూర్తి చేయాలి



- వేగం మరింత పెరగాలి... ఐకానిక్ ముద్ర కనిపించాలి
- నిర్మాణ సంస్థలు కడుతోంది కేవలం బిల్డింగులు కాదు... రాజధాని
- రాజధాని పనులకు గ్రీన్ ఛానెల్ ద్వారా ఇసుక, గ్రావెల్
- ప్రభుత్వ శాఖలు, అధికారులు సమన్వయంతో జాప్యం లేకుండా చూడాలి
- అమరావతి రాజధాని పనులపై సమీక్షలో ముఖ్యమంత్రి చంద్రబాబు
- రాజధానిలో అగ్నిప్రమాదాలపై సీఎం అసంతృప్తి... నిర్మాణ సంస్థలదే బాధ్యతని స్పష్టం

**అమరావతి, విశ్వం వాయిస్ న్యూస్ :** అమరావతి రాజధాని నిర్మాణ పనులను సకాలంలో పూర్తి చేసి తీరాల్సిందేనని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. నిర్దేశించుకున్న సమయానికి పనులు పూర్తి చేసి ప్రధానితో ప్రారంభోత్సవం చేస్తామని.. ఈ మేరకు పనులు వేగంగా చేపట్టి పూర్తి చేసేలా కాంట్రాక్టర్లు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ మేరకు అధికారులు కూడా మిగతా .. 2లో..

ఎల్డీఎఫ్ సర్కారుకు

## కౌంట్‌డౌన్

### కేరళలో మాదే విజయం
### శబరిమల దోషుల్ని శిక్షిస్తాం : మోదీ



**తిరువాల్లా, విశ్వం వాయిస్ న్యూస్ :** కేరళలో లెఫ్ట్ డెమోక్రటిక్ ఫ్రంట్(ఎల్డీఎఫ్) ప్రభుత్వానికి రోజులు దగ్గర పడ్డాయని, భాజపా నేతృత్వంలోని ఎన్డీయే రాష్ట్రంలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయబోతోందని ప్రధాని నరేంద్ర మోదీ ధీమా వ్యక్తంచేశారు. శనివారం పథనంథిట్ట జిల్లా ఎన్నికల ర్యాలీని ఉద్దేశించి మోదీ ప్రసంగిస్తూ.. వామపక్ష పాలనకు వీడ్కోలు పలకాలన్న భావన రాష్ట్ర ప్రజల్లో బలంగా ఉన్నట్టు తమ పార్టీ కార్యకర్తలు చెబుతున్నారన్నారు. ఏడు ఈశాన్య రాష్ట్రాల్లో క్రైస్తవ జనాభా అధికంగా ఉన్న ఆరింటిలో, గోవాలో భాజపా అధికార పగ్గాలు చేపట్టి ఎంతో అభివృద్ధి సాధించిందని.. కేరళలో అధికారానికి వచ్చినా అదేవిధంగా మిగతా .. 2లో..

గాయపడ్డా..

## అందుకే రాటుదేలా

### 'దురంధర్' డైలాగుతో ఆప్‌నకు రాఘవ్ చడ్డా కౌంటర్



**ఢిల్లీ, విశ్వం వాయిస్ న్యూస్ :** ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్)కి, ఆ పార్టీ రాజ్యసభ సభ్యుడు రాఘవ్ చడ్డాకు నడుమ కొనసాగుతున్న వివాదం శనివారం మరింత తీవ్రమైంది. తనపై ఆప్ నేతలు చేసిన ఆరోపణలన్నీ అబద్ధాలుగా పేర్కొన్న రాఘవ్ చడ్డా అన్నీ బట్టబయలు అవుతాయన్నారు. ప్రజల పన్ను డబ్బులతో నడిచే పార్లమెంటుకు ఆ ప్రజల సమస్యలు లేవనెత్తడానికే తాను వెళతానని, గొడవలు పెట్టుకోడానికి కాదని చెప్పారు. ఈ మేరకు తన వివరణతో 'ఎక్స్' ద్వారా ఓ వీడియో విడుదల చేస్తూ 'దురంధర్' మిగతా .. 2లో..

## కర్ణాటక సంస్కృతి, సంప్రదాయం గొప్పది

- సైనికుల ప్రాణత్యాగాలు మనం ఎప్పటికీ మర్చిపోకూడదు
- పెద్దపెద్ద కలలు కని వాటి సాకారానికి కృషిచేయాలి
- చంద్రబాబుని అక్రమంగా నిర్బంధించినప్పుడు అండగా నిలిచారు
- మా కుటుంబం జీవితాంతం మీకు రుణపడి ఉంటుంది
- రాష్ట్రాల మధ్య పోటీ ఉంటేనే కసి ఉంటుంది
- కుమార స్వామి విశాఖ ఉక్కును కాపాడారు
- కుమారస్వామికి ఎప్పుడూ అండగా నిలవాలి
- సింధనూరులో శ్రీకృష్ణదేవరాయ సైనిక్ స్కూల్ ప్రారంభోత్సవంలో మంత్రి లోకేష్

**సింధనూరు, విశ్వం వాయిస్ న్యూస్ :** తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబునాయుడుని అక్రమంగా అరెస్ట్ చేసినప్పుడు ఇక్కడున్న తెలుగువారు అండగా నిలిచారు. మా కుటుంబం జీవితాంతం మీకు రుణపడి ఉంటుందని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. కర్ణాటకలోని రాయచూర్ జిల్లా సింధనూరు హోసళ్లీ క్యాంప్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన శ్రీకృష్ణదేవరాయ సైనిక్ స్కూల్‌ను కేంద్ర ఉక్కుశాఖ మంత్రి హెచ్.డీ కుమారస్వామి, కేంద్ర రక్షణశాఖ సహాయ మంత్రి సంజయ్ సేథ్‌తో కలిసి మంత్రి లోకేష్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన బహిరంగ సభలో మంత్రి నారా లోకేష్ ప్రసంగిస్తూ... ఎల్లారిగు నమస్కారా.



నిమ్మ ప్రీతిగే ధన్యవాదగలు అంటూ కన్నడలో పలకరించారు. కర్ణాటక కర్ణాటక పవిత్ర భూమి. కర్ణాటక సంస్కృతి, సంప్రదాయం గొప్పది. కన్నడ, మిగతా .. 2లో..

ప్రముఖ ఆలయాల పరిసరాల్లో...

## 'తిరుమల' నిబంధనలు

### రాజకీయ కార్యకలాపాలను అనుమతించొద్దు - విశాలమైన రోడ్లు, పచ్చదనం పరిఢవిల్లేలా అభివృద్ధి
### బాసరపై సమీక్షలో సీఎం రేవంత్‌రెడ్డి




**హైదరాబాద్, విశ్వం వాయిస్ న్యూస్ :** రాష్ట్రంలోని ప్రముఖ ఆలయాల పరిసరాల్లో తిరుమల తరహా నిబంధనల్ని అమలు చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దేవాదాయ శాఖను ఆదేశించారు. దేవాలయాల వద్ద రాజకీయ సభలు, జెండాలు, ప్రదర్శనలను పూర్తిగా నిషేధిస్తూ ఆధ్యాత్మిక వాతావరణానికి పెద్దపీట వేయాలని సూచించారు. బాసరలోని జ్ఞాన సరస్వతి ఆలయ అభివృద్ధి పనులపై శనివారం హైదరాబాద్‌లో నిర్వహించిన సమీక్ష సందర్భంగా సీఎం ఈ నిర్ణయాన్ని వెల్లడించారు. బాసర ఆలయాన్ని సంప్రదాయాలకు అనుగుణంగా అభివృద్ధి చేయాలన్నారు. తొలుత దేవాదాయశాఖ అధికారులు బాసర ఆలయ అభివృద్ధికి సంబంధించిన మాస్టర్ ప్లాన్‌ను పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ద్వారా సీఎంకు వివరించారు. ఆలయ అభివృద్ధి పనులకు రూ.225 కోట్ల వ్యయం అవుతుందని తెలిపారు. మాస్టర్ ప్లాన్‌ను పరిశీలిం చిన ముఖ్యమంత్రి.. పలు మార్పులు సూచించారు. భవిష్యత్ అవసరాలు, భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకొని విశాలమైన రోడ్లు నిర్మించాలని ఆదేశించారు. 'ఎంతటి మిగతా .. 2లో..

భౌగోళిక సవాళ్లను

## అధిగమించేశాం

### విదేశీ వ్యవహారాల మంత్రి జైశంకర్ వ్యాఖ్య



**రాయ్‌పుర్, విశ్వం వాయిస్ న్యూస్ :** 'ఇటీవలి అంతర్జాతీయ కుదుపులు భారత సామర్థ్యానికి పరీక్షగా నిలిచాయి, దేశం వాటిని విజయవంతంగా అధిగమించింది' అని విదేశీ వ్యవహారాల మంత్రి ఎస్.జైశంకర్ శనివారం వ్యాఖ్యానించారు. రాయ్‌పుర్‌లోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ 15వ స్నాతకోత్సవ సభలో ప్రసంగిస్తూ ఆయన ఈ మాటలన్నారు. దేశీయంగా, అంతర్జాతీయంగా తలెత్తిన సవాళ్లను భారత్ విజయవంతంగా ఎదుర్కొందని జైశంకర్ అన్నారు. పశ్చిమాసియా సంక్షోభ నేపథ్యంలో తలెత్తిన ఇంధన మిగతా .. 2లో..

రాజధానిపై

## జగన్‌ది గంటకో మాట

### పెనుకొండలో రూ.40 లక్షల అభివృద్ధి పనులకు భూమిపూజ
### పూల మార్కెట్ ప్రారంభించిన రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత



**పెనుకొండ/శ్రీసత్యసాయి, విశ్వం వాయిస్ న్యూస్ :** 'దేశం మొత్తం ఏపీ రాజధాని అమరావతి అని అంటుంటే... జగన్ మాత్రం గంటకో మాట మాట్లాడుతున్నాడు. ఒకసారి అమరావతే రాజధాని అంటారు.. మరోసారి మూడు రాజధానులంటారు... ఇంకోసారి మావిగన్ అంటారు... తాను ఉంటున్న లోటస్ పాండ్ ప్యాలెస్ కూడా రాజధానే అని అంటున్నారు... జగన్ కు మంచి వైద్యం అందించాలని స్వయాన వైసీపీ నాయకులు గొణుక్కుంటున్నారు ' అని రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత మరియు జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత అన్నారు. తన పార్టీ ఉనికి కోసమే జగన్ చేస్తున్న వ్యాఖ్యలను ప్రజలు పట్టించుకోవడంలేదన్నారు. శ్రీసత్యసాయి జిల్లా పెనుకొండ పట్టణంలో మిగతా .. 2లో..

మైనారిటీ వ్యతిరేక శక్తులతో

## ఎల్‌డీఎఫ్ కుమ్మక్కు

### రాహుల్‌గాంధీ ఆరోపణ



**అలప్పుళ, విశ్వం వాయిస్ న్యూస్ :** కేరళ ఎన్నికల ప్రచారంలో భాగంగా కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఎల్‌డీఎఫ్, భాజపాలపై తీవ్రంగా విరుచుకుపడ్డారు. దేశంలోని ఇతర ప్రదేశాల్లో మైనారిటీలపై దాడులకు పాల్పడే శక్తులతో కేరళ ముఖ్యమంత్రి, ఎల్‌డీఎఫ్ నేత పినరయి విజయన్‌కు సంబంధాలు ఉన్నాయని ఆయన ఆరోపించారు. భాజపా, ఎల్‌డీఎఫ్‌ల మధ్య రహస్య ఒడంబడిక ఉందని పునరుద్ఘాటిస్తూ, ప్రధాని మోదీ తన ఎన్నికల ప్రచార సభల్లో శబరిమల బంగారు తాపడం వివాదాన్ని ప్రస్తావించడం లేదని ఎత్తి చూపారు. "ఎల్‌డీఎఫ్‌కు ఒక అదృశ్య హస్తం పథనిర్దేశం చేస్తోంది. ఆ అదృశ్య హస్తానిది మతతత్వం. అది భారత రాజ్యాంగాన్ని అంగీకరించదు, ప్రజల్ని విభజించి ద్వేషాన్ని పెంచడం దాని నైజం" అని రాహుల్ పరోక్షంగా ఎల్‌డీఎఫ్, భాజపాల మధ్య అనుబంధం ఉందని చెప్పారు. అసెంబ్లీ ఎన్నికల మిగతా .. 2లో..

## గజ్వేల్‌లో ఉద్రిక్తత....

### కేసీఆర్ క్యాంపు కార్యాలయంలో సీఎం రేవంత్‌రెడ్డి ఫొటో పెట్టిన కాంగ్రెస్ నేతలు
### ఆ పార్టీ శ్రేణులు దాడికి పాల్పడ్డాయంటూ ఠాణాలో ఫిర్యాదు చేసిన భారాస నాయకులు



**గజ్వేల్, విశ్వం వాయిస్ న్యూస్ :** గజ్వేల్ పట్టణంలోని ఎమ్మెల్యే కేసీఆర్ క్యాంపు కార్యాలయాన్ని శనివారం కాంగ్రెస్ శ్రేణులు ముట్టడించాయి. సమావేశ మందిరంలో సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటాన్ని పెట్టాయి. ఈ పరిణామాలు తీవ్ర ఉద్రిక్తతలకు దారితీశాయి. సిద్దిపేట డీసీసీ అధ్యక్షురాలు తూంకుంట ఆంక్షారెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఉదయం 11 గంటల సమయంలో మొట్రాజుపల్లి కూడలి నుంచి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయానికి ర్యాలీగా చేరుకున్నారు. గమనించిన క్యాంపు కార్యాలయ సిబ్బంది గేటుకు తాళం వేశారు. పలువురు కార్యకర్తలు గేటుపైకి ఎక్కి లోపలికి ప్రవేశించారు. కార్యకర్తలు వాగ్వాదానికి దిగగా సిబ్బంది గేటు తీయడంతో ఆంక్షారెడ్డి కార్యకర్తలతో కలిసి లోనికి వెళ్లి గోడకు సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటాన్ని పెట్టారు. ఒక్కసారిగా కార్యకర్తలు లోనికి రావడంతో ప్రధాన ద్వారం వైపు అద్దాలు పగిలిపోయాయి. ఇదంతా జరిగిన కొంత సేపటికి ఎఫ్‌డీసీ మాజీ ఛైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి, భారాస కార్యకర్తలు క్యాంపు కార్యాలయానికి చేరుకున్నారు. సీఎం ఫొటోను మిగతా .. 2లో..

(మొదటిపేజీ తరువాయి)

## లక్ష్యాల మేరకు రాజధాని పనులు పూర్తి చేయాలి

పనుల్ని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని ఆదేశించారు. రాజధాని నిర్మాణ పనులను ఓ కాంట్రాక్ట్ వర్క్ అన్నట్టుగా భావించవద్దని... చరిత్రలో భాగస్వాములు అవుతున్నట్టుగా భావించాలన్నారు. శనివారం క్యాంప్ కార్యాలయంలో రాజధానిలో నిర్మాణ పనులు చేపట్టిన వివిధ కాంట్రాక్టు సంస్థలతో ముఖ్యమంత్రి చంద్రబాబు సమావేశమయ్యారు. ప్రస్తుతం రాజధానిలో వివిధ దశల్లో రూ.57,821 కోట్ల విలవైన పనులు ఉండగా... వాటిల్లో రూ. 50, 943 కోట్ల పనులు గ్రౌండ్ అయ్యాయని అధికారులు సీఎంకు వివరించారు. హౌసింగ్, రోడ్లు, ట్రంక్ ఇన్ఫ్రాస్ట్రక్చర్, ఎల్పీఎస్ మౌళిక సదుపాయలతో పాటు అసెంబ్లీ, హైకోర్టు, సచివాలయం వంటి ఐకానిక్ భవనాల నిర్మాణ పనుల పురోగతిని సీఎం సమీక్షించారు. ప్రస్తుతం రాజధాని నిర్మాణ పనుల్లో మొత్తంగా 20 వేల మంది కార్మికులు, నిపుణులు పని చేస్తున్నారని అధికారులు తెలిపారు. అలాగే ఏ నిర్మాణ సంస్థ ఎంత మేర పనులు చేసింది...లక్ష్యాన్ని ఎంత మేరకు చేరుకున్నారనే విషయంలో పనుల వారీగా సీఎం చర్చించారు. పనుల్లో జాప్యం చేస్తున్న కాంట్రాక్ట్ సంస్థల తీరు పట్ల సీఎం అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ క్రమంలో నిర్మాణ పనులకు అవసరమైన మ్యాన్ పవర్ విషయంలో కొన్ని ఇబ్బందులు ఉన్నాయని కాంట్రాక్టర్లు సీఎం దృష్టికి తెచ్చారు. వివిధ రాష్ట్రాల్లో ఎన్నికలు జరుగుతున్న దృష్ట్యా చాలా మంది కార్మికులు వెళ్లారని నిర్మాణ సంస్థ ప్రతినిధులు చెప్పారు. స్థానికంగా నైపుణ్యమున్న మ్యాన్ పవర్ ఎంత వరకు అందుబాటులో ఉంటుందో చూసి వినియోగించుకోవాలని సీఎం సూచించారు. రాజధాని పనుల్లో ఎంత మెషినరీని వినియోగిస్తున్నారనే అంశం పైనా సీఎం ఆరా తీశారు. రాజధాని పనుల్లో 5,580 మెషినరీ అవసరముండగా... ప్రస్తుతం 3767 మెషనరీ ఉందని అధికారులు వివరించారు. ఇవి కాకుండా హాట్ మిక్స్ 16, వెట్ మిక్స్ మెషిన్లు 36, ఆర్ఎంసీ మిషన్లు 34 ఉన్నాయని తెలిపారు. వారం, నెల వారీగా టార్గెట్‌లు పెట్టుకుని రాజధాని పనులు చేపట్టాలని సీఎం ఆదేశించారు. ప్రస్తుతం జరుగుతున్న పనులను... నిర్దేశించుకున్న టార్గెట్లను విశ్లేషిస్తే... వారానికి రూ. 941 కోట్ల విలువైన పనులు పూర్తి కావాల్సి ఉందని ముఖ్యమంత్రి అన్నారు. వచ్చే వర్షా కాలంలో పనులకు ఆటంకం కలిగే అవకాశం ఉంది కాబట్టి... ఆలోగానే చేపట్టాల్సిన పనులను జాప్యం లేకుండా పూర్తి చేయాలని సీఎం ఆదేశించారు. ఎక్కువ ప్రాజెక్టులను చేపడుతున్న నిర్మాణ సంస్థలు మరింతగా దృష్టిని కేంద్రీకరించి పనులు చేయాలన్నారు. రాజధాని నిర్మాణానికి నిధుల కొరత లేదని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ..."రాజధాని నిర్మాణమనేది కేవలం ఒక కాంట్రాక్ట్ వర్క్‌గా చూడొద్దు... ఇప్పుడు పనులు చేపట్టే వారంతా చరిత్రలో భాగస్వాములువుతున్నట్టే. నిర్మాణ సంస్థలుగా ఎన్నో ప్రాజెక్టులు చేసి ఉంటారు. కానీ రాజధాని నగరాన్ని నిర్మించే అవకాశం అందరికీ దక్కదు. రాజధానిని అద్భుతంగా, వినూత్నంగా నిర్మించేందుకు అపార అవకాశాలున్నాయి. అమరావతిని ఫ్యూచర్ సిటీగా నిర్మించాలనే ప్రభుత్వ ఆలోచనను క్షేత్రస్థాయిలో అమలు చేసి చూపాలి. నాణ్యతతో నిర్మాణాలు ఉండాలి... కాస్ట్ ఎఫెక్టివ్ చర్యలు తీసుకోవాలి. గ్రీన్ ఎనర్జీ, టెక్నాలజీ వంటి వాటిని వినియోగించుకోవాలి. రాజధాని ప్రతిష్టను పెంచేలా ఎవరికైనా ఆలోచనలు వస్తే వాటిని ప్రభుత్వంతో పంచుకోవచ్చు. ప్రభుత్వం నిర్ధేశించిన సమయానికి నిర్మాణం పూర్తి చేసి తీరాల్సిందే.. ఈ విషయంలో ఏ మాత్రం రాజీ ఉండదు. మ్యాన్ పవర్ ఇంకా పెంచుకోవాల్సిన అవసరం ఉంది... ప్రతీ నిర్మాణం సకాలంలో పూర్తి చేసి ప్రారంభించుకోవాలి" అని ముఖ్యమంత్రి చెప్పారు.

### నిర్మాణ సామాగ్రికి రక్షణ కల్పించడంలో నిర్లక్ష్యమెందుకు...?

సమీక్ష సందర్భంగా ఇటీవల రాజధాని ప్రాంతంలో జరిగిన అగ్ని ప్రమాదాల ఘటన ప్రస్తావనకు వచ్చింది. నిర్మాణ సామాగ్రికి రక్షణ కల్పించాల్సిన బాధ్యత కాంట్రాక్టు సంస్థలకు లేదా అంటూ సీఎం ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంట్రాక్ట్ సంస్థల నిర్లక్ష్యం వల్ల ప్రభుత్వంపై విమర్శలు వస్తున్నాయన్నారు. ఘటన జరిగిన తర్వాత కాంట్రాక్టు సంస్థలు కానీ... అధికారులు కానీ తగిన రీతిలో స్పందించలేదని సీఎం అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రతీ అంశాన్ని వక్రీకరించేలా కొందరు రాజకీయం చేస్తున్నారని... ఇలాంటి పరిస్థితుల్లో అప్రమత్తంగా ఉండాలన్నారు. జరగరాని ఘటనలు జరిగితే వెంటనే అలెర్ట్ చేయాలని ఆదేశించారు. ఏ మాత్రం ఏమరుపాటుగా ఉన్నా... ప్రభుత్వానికి చెడ్డ పేరు తెచ్చేందుకు.. బురద జల్లేందుకు, కుట్రలు పన్నేందుకు కొందరు సిద్దంగా ఉన్నారని ముఖ్యమంత్రి హెచ్చరించారు. ఆయా నిర్మాణ సంస్థలు కూడా ప్రాజెక్టు మేనేజర్లుగా సమర్థులను నియమించుకోవాలని సూచించారు. సరైన వాళ్లని నియమించుకోకుంటే... ఆ ప్రభావం ప్రభుత్వంపై పడుతుందని.. దీన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ తాను అనుమతించనని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు.

### గుంటూరు, ఎన్టీఆర్, కృష్ణా కలెక్టర్లకు ఆదేశాలు

రాజధాని పనులకు అవసరమైన ఇసుక, గ్రావెల్ సరఫరా విషయంలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. ఇసుక, గ్రావెల్ కొరత కారణంగా నిర్మాణ పనుల్లో జాప్యం జరిగే పరిస్థితి రాకూడదని సీఎం స్పష్టం చేశారు. కృష్ణా జిల్లాలో ఫారెస్ట్ అధికారుల కారణంగా గ్రావెల్ సరఫరాలో కొంత ఇబ్బంది ఉందని.. జిల్లా కలెక్టర్ పరిస్థితిని అర్థం చేసుకుంటున్నా... ఫారెస్ట్ అధికారులతోనే అసలు సమస్య వస్తోందనే విషయం సమావేశంలో సీఎం దృష్టికి వచ్చింది. దీనిపై సీఎం ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజధాని నిర్మాణ పనులకు అవసరమైన ఇసుక, గ్రావెల్ వంటివి గ్రీన్ ఛానెల్ ద్వారా వెళ్లాలని.. ఎవరి ఒత్తిళ్లకూ గురి కావాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. ఈ విషయంలో ఎవరైనా ఇబ్బంది పెట్టే ప్రయత్నం చేస్తే కఠినంగా చర్యలు తీసుకోవాలని అధికారులను ముఖ్యమంత్రి ఆదేశించారు. ఈ మేరకు కృష్ణా, గుంటూరు, ఎన్టీఆర్ జిల్లాల కలెక్టర్లతో మాట్లాడాలని ఉన్నతాధికారులకు ముఖ్యమంత్రి సూచించారు. ఈ సమీక్షా సమావేశంలో మంత్రి నారాయణ, సీఆర్డీఏ, ఏడీసీ విభాగాల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## 'కోల్‌కతానూ లక్ష్యంగా చేసుకుంటాం'..

సియాల్‌కోట్‌లో ఆయన ఈ మేరకు మీడియాతో మాట్లాడారు. ఎక్కడైనా కొంతమంది మృతదేహాలను పడేసి.. వారు ఉగ్రవాదులేనని నమ్మించేలా భారత్ బూటకపు ఆపరేషన్ రూపొందించినట్లు నివేదికలు ఉన్నాయంటూ అక్కసు వెళ్లగక్కారు. అయితే, తన వాదనలకు బలం చేకూర్చేలా ఎటువంటి ఆధారాలూ ఇవ్వకపోవడం గమనార్హం. ఇరాన్ యుద్ధాన్ని అవకాశంగా తీసుకొని పొరుగు దేశం ఏదైనా దుస్సాహసానికి పాల్పడితే ప్రతిస్పందన తీవ్రంగా ఉంటుందని ఇటీవల రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ హెచ్చరించిన విషయం తెలిసిందే. ఉరి సెక్టార్ దాడి తర్వాత జరిపిన సర్జికల్ స్ట్రైక్స్, పుల్వామా తర్వాత చేపట్టిన వైమానిక దాడులు, పహల్గాం దాడుల అనంతరం చేపట్టిన 'ఆపరేషన్ సిందూర్'లను గుర్తు చేశారు. ఈ హెచ్చరికలపై ఖవాజా ఇప్పటికే తన అక్కసు వెళ్లగక్కారు. పహల్గాం ఘటన జరిగి ఏడాది కావస్తున్న నేపథ్యంలో భారత్ బెదిరింపులకు పాల్పడుతోందని ఆరోపించారు. తమపై జరిగే దాడులను తిప్పికొడతామన్నారు.

## 'సమయం మించిపోతోంది'

48 గంటల సమయమే ఉందన్నారు. అంతా భగవంతుడి దయ! అంటూ ట్రూత్ సోషల్‌లో పోస్టు చేశారు. మరోవైపు అమెరికాకు చెందిన ఎఫ్-15 యుద్ధవిమానాన్ని ఇరాన్ కూల్చివేసిన విషయం తెలిసిందే. అయితే ఇందుకోసం అత్యాధునిక గగనతల రక్షణ వ్యవస్థలను ఉపయోగించినట్లు ఇరాన్ వెల్లడించింది. తమ గగనతలంపై పూర్తి నియంత్రణ ఉందని ఇరాన్ సైన్యం పేర్కొంది.

### చర్చలను తిరస్కరించలేదు..

మరోవైపు, పాకిస్థాన్‌లో చర్చలను తాము ఎన్నడూ తిరస్కరించలేదని ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాగ్చి పేర్కొన్నారు. ఈ విషయంలో టెహ్రాన్ వైఖరిని అమెరికన్ మీడియా తప్పుగా చిత్రీకరిస్తోందని ఆరోపించారు. అయితే, ఎటువంటి చర్చలైనా.. యుద్ధానికి శాశ్వత ముగింపు పలికేలా ఉండాలని స్పష్టం చేశారు. అమెరికా షరతులు పెడుతుండటమే ఆందోళనకర అంశమని అబ్బాస్ అరాగ్చి పేర్కొన్నారు.

## 28 జిల్లాలతో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కొత్త చిత్రపటం

మొత్తం 28 జిల్లాలతో కూడిన మ్యాప్ను రూపొందించారు. పరిపాలన సౌలభ్యం, ప్రజలకు పాలనను మరింత చేరువ చేయడం, అభివృద్ధి వికేంద్రీకరణే లక్ష్యంగా ఈ మార్పులు చోటుచేసుకున్నాయి. ప్రకాశం జిల్లా నుంచి మార్కాపురం, పశ్చిమ గోదావరి, ఏలూరు జిల్లాల నుంచి కొన్ని ప్రాంతాలను కలిపి పోలవరం జిల్లాలుగా ఏర్పాటు చేసినట్లు ఈ మ్యాప్ ద్వారా స్పష్టమవుతోంది. రాజధాని అమరావతిని కేంద్ర బిందువుగా చూపిస్తూ రూపొందించిన ఈ మ్యాప్, రాష్ట్ర భౌగోళిక సరిహద్దుల్లో వచ్చిన మార్పులను స్పష్టంగా తెలియజేస్తుంది. ఈ కొత్త జిల్లాల ఏర్పాటుతో ఆయా ప్రాంతాల్లో పాలన మరింత వేగవంతం కానుందని ప్రచారంలో ఉంది.

నెదర్లాండ్స్‌లో రూ.250 కోట్లతో

## శ్రీవారి ఆలయ నిర్మాణం

ఆదేశాలతో ప్రపంచవ్యాప్తంగా శ్రీవారి ఆలయాలు నిర్మించనున్నట్లు పేర్కొన్నారు. నెదర్లాండ్స్‌లో శ్రీవారి ఆలయ నిర్మాణానికి ఇప్పటికే 33.5 ఎకరాల భూమిని ఎస్‌వీకే సంస్థకు అక్కడి ప్రభుత్వం అందజేయగా, రూ.250 కోట్లతో ఆలయ నిర్మాణం చేపట్టనున్నట్లు వెల్లడించారు. గోపురాలు, ప్రాకారాలతో పాటు శిల్పకళా సౌందర్యం ఉట్టిపడేలా ఆలయాన్ని నిర్మించేందుకు తితిదే నుంచి స్థపతి సహకారం అందించాలని వారు విన్నవించగా తితిదే ఛైర్మన్ సానుకూలంగా స్పందించారు.

## గాయపడ్డా.. అందుకే రాటుదేలా

చిత్రంలోని డైలాగు "క్యోంకీ మై ఘాయల్ హూ, ఇస్‌లియే ఘాతక్ హూ" (నేను గాయపడ్డాను, అందుకే రాటుదేలాను)తో కౌంటర్ ఇచ్చారు. తనను లక్ష్యంగా చేసుకొని ఓ పథకం ప్రకారం దుష్ప్రచారం చేస్తున్నారని తెలిపారు. రాజ్యసభలో పార్టీ ఉప నేత పదవి నుంచి రాఘవ్ చడ్డాను ఆప్ ఇటీవల తొలగించింది. అంతేకాదు.. పలువురు ఆప్ నేతలు ఆయన పనితీరుపై విమర్శలు గుప్పించారు. ప్రతిపక్షాలు సభ నుంచి వాకౌట్ చేసినప్పుడల్లా రాఘవ్ చడ్డా అక్కడే కూర్చుంటున్నారని.. ప్రధాన ఎన్నికల కమిషనరుపై అభిశంసన తీర్మానం పెట్టినపుడు సంతకం చేయడానికి నిరాకరించారని.. సభలో ప్రధానికి వ్యతిరేకంగా గళమెత్తడానికి వెనుకాడుతున్నారని ఆయనపై ఆప్ నేతలు ఆరోపణలు చేశారు. రాఘవ్ చడ్డా వీటన్నింటినీ ఖండించారు.

## భౌగోళిక సవాళ్లను అధిగమించేశాం

సమస్యను భారత్ అధిగమించిందని ఆయన పరోక్షంగా పేర్కొన్నారు. "ఇప్పుడు మన ఆర్థికవ్యవస్థ ప్రపంచంలో ఐదో స్థానంలో నిలిచింది. ఇటీవలి భౌగోళిక కుదుపుల నుంచి విజయవంతంగా బయటపడ్డాం" అని ఆయన అన్నారు.

## ఎల్డీఎఫ్ సర్కారుకు కౌంట్‌డౌన్

రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడుపుతుందని తెలిపారు. అభివృద్ధికి ఎంతో అవకాశం ఉన్నా, కేరళ ఇతర రాష్ట్రాలకన్నా వెనుకబడి ఉందని విచారం వ్యక్తం చేశారు. రాష్ట్రంలోని వామపక్ష ప్రభుత్వం శబరి రైలు ప్రాజెక్టును ఆలస్యం చేసిన కారణంగా తిరువాల్లా ప్రజలు ఎంతో నష్టపోయారన్నారు. "ఎన్నికలు వస్తాయి, పోతాయి. కేరళకు చెందిన నా సోదర సోదరీమణులు గల్ఫ్‌లో సురక్షితంగా ఉండటమే నాకు ముఖ్యం" అన్నారు. ఎల్‌డీఎఫ్, యూడీఎఫ్‌లు రెండూ తమ ఎదుటి పక్షాన్ని భాజపాకు 'బి' టీమ్‌గా విమర్శిస్తున్నాయని, ఎందుకంటే కేరళలో భాజపాయే 'ఎ' టీం అన్నది ఆ రెండు కూటములకూ తెలుసని ఛలోక్తి విసిరారు. శబరిమల యాత్రను అప్రదిష్ఠపాలు చేసేందుకు కృషి చేసిన ఎల్డీఎఫ్, యూడీఎఫ్‌లు ఆలయాన్ని తమ దోపిడీకి కేంద్రంగా మార్చుకున్నాయని ఆరోపించారు. రాష్ట్రంలో ఎన్డీయే అధికారంలోకి వస్తే శబరిమలలో చేసిన నేరాలకు వారిని శిక్షిస్తుందని అన్నారు.

### దక్షిణాది లోక్‌సభ స్థానాలు తగ్గవు

దక్షిణాది రాష్ట్రాల లోక్‌సభ స్థానాలు తగ్గబోవని ప్రధాని హామీ ఇచ్చారు. జనాభా నియంత్రణ కారణంగా ఓటర్ల సంఖ్య తగ్గి దక్షిణాదిలో లోక్‌సభ స్థానాలు తగ్గుతాయంటూ జరుగుతున్న ప్రచారాన్ని ఆయన తోసిపుచ్చారు. చట్ట సభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు ఈనెల 16న పార్లమెంటు సమావేశం నిర్వహించనున్నామని మోదీ తెలిపారు.

### మోదీ రోడ్‌షో

కేరళ రాజధాని తిరువనంతపురంలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ నిర్వహించిన 'రోడ్ షో'కు భారీగా జనం తరలివచ్చారు. తిరువనంతపురంలోని కిల్లిపాలం నుంచి ప్రారంభమైన ప్రధాని రోడ్ షో 1.5 కిలోమీటర్లు సాగింది. వేలాది మంది పార్టీ కార్యకర్తలు, మద్దతు దారులు రహదారికి ఇరువైపులా భాజపా జెండాలు ఊపుతూ ఆయనకు స్వాగతం పలికారు.

## కర్ణాటక సంస్కృతి, సంప్రదాయం గొప్పది

తెలుగు తుంబా సేమ్. నమ్మ సంస్కృతి కూడా సేమ్. ఆంధ్రా, కర్ణాటక అన్నా తమ్మన తారా

### సైనికుల ప్రాణత్యాగాలు మనం ఎప్పటికీ మర్చిపోకూడదు

శ్రీకృష్ణదేవరాయ సైనిక్ స్కూల్ ప్రారంభోత్సవం సందర్భంగా మీ అందరినీ కలవడం ఆనందంగా ఉంది. నేను ఏపీ విద్యాశాఖ మంత్రిగా ఇక్కడకు రాలేదు. భారతీయ పౌరుడిగా వచ్చాను. ఇక్కడున్న విద్యార్థుల్లో ఎంతమంది డాక్టర్లు, ఐఏఎస్, ఐపీఎస్, ఇంజనీర్లు, టీచర్లు, పొలిటీషియన్స్ కావాలనుకుంటున్నారు? రాజకీయ నాయకులు కావాలనుకునే వారు తక్కువగా ఉన్నారు. మీలో ఎంతమంది సైనికులు కావాలనుకుంటున్నారు? ఇక్కడ మనం ప్రశాంతంగా సమావేశం అయ్యామంటే కారణం సరిహద్దుల్లోని సైనికులు. సైనికుల ప్రాణత్యాగాలు మనం ఎప్పుడూ మర్చిపోకూడదు. ఎక్కడైనా సైనికులు కనపడితే సెల్యూట్ చేయండి.

### మురళీ నాయక్ కుటుంబానికి దేశం మొత్తం అండగా నిలిచింది

ఉగ్రవాదులు పెహల్గాంపై దాడి చేశారు. అమాయకులను చంపేశారు. అప్పుడు మన ప్రధాని నరేంద్ర మోదీ గారు ఆపరేషన్ సిందూర్ తో పాకిస్థాన్ కు తగిన గుణపాఠం చెప్పారు. కానీ ఆ పోరాటంలో మురళీ నాయక్ అనే ఒక జవాన్ చనిపోయాడు. అతనిది అనంతపురం జిల్లా పుట్టపర్తి నియోజకవర్గం. ఆ తల్లిదండ్రులకు ఒక్కడే కొడుకు. మురళీ నాయక్ కి చిన్నప్పటి నుంచి దేశభక్తి ఎక్కువ. ఆర్మీకి వెళ్తాను అంటే ముందు అతని తల్లిదండ్రులు ఒప్పుకోలేదు. అప్పుడు మురళీ నాయక్ ఒక్కటే చెప్పాడు. నేను దేశం కోసం చనిపోతే దేశం మొత్తం మీకు అండగా ఉంటుంది అని. అదే జరిగింది. మురళీ నాయక్ ని పాకిస్థాన్ ఆర్మీ చంపేసింది. దేశం మొత్తం ఆ కుటుంబానికి అండగా నిలబడింది.

### మార్కులు తక్కువగా వచ్చాయని, ఎదురుదెబ్బలు తగిలాయని అధైర్యపడకూడదు

ఎన్టీఆర్ మనవడు, చంద్రబాబు గారి కొడుకు, బాలయ్య బాబు అల్లుడిని. లోకేష్ కు ఏంటి గోల్డెన్ స్పూన్ అనుకుంటారు. కానీ నాకు ఇది అంత ఈజీగా రాలేదు. నేను తెలుగుదేశం పార్టీ 1985 నుంచి గెలవని మంగళగిరి నియోజకవర్గంలో 2019లో పోటీచేసి ఓడిపోయాను. జీవితంలో ఓటమి అనేది సహజమే. కానీ ఆ ఓటమి ద్వారా పాఠాలు నేర్చుకోవాలి. ఆ తర్వాత ఐదేళ్లు కష్టపడ్డాను. 2024 ఎన్నికల్లో రాష్ట్రంలోనే మూడో అత్యధిక మెజార్టీ 91వేల ఓట్ల మెజార్టీతో గెలిచాను. నేటి పిల్లలు చాలా సెన్సిటివ్ గా మారిపోయారు. ఒక్క ఎగ్జామ్ లో ఫెయిల్ అయితే ఏకంగా ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. మార్కులు తక్కువగా వచ్చాయని, జీవితంలో ఎదురుదెబ్బలు తగిలాయని అధైర్యపడకూడదు. ఆ ఎదురుదెబ్బే మనలో కసి పెంచాలి. అహర్నిశలు కష్టపడాలి. అనుకున్నది సాధించాలి. ఫెయిల్ అంటే ఫస్ట్ ఎటెమ్ట్ ఇన్ లెర్నింగ్. కర్ణాటక విద్యార్థులు చాలా తెలివైన వారు, క్రమశిక్షణ కలిగి ఉంటారు. మీ భవిష్యత్ ఉజ్వలంగా ఉంటుంది. మీరు దేశ భవిష్యత్. పెద్దపెద్ద కలలు కని వాటి సాకారానికి కృషిచేయాలి.

### కుమారస్వామికి ఎప్పుడూ అండగా నిలవాలి

కుమారస్వామికి ఎమోషన్స్ చాలా ఎక్కువ. మనసులో ఉంది చేసేస్తారు. అందరూ అది బలహీనత అంటారు. అది మన కుమారస్వామి బలం అని తెలియజేస్తున్నా. మనందరం కలిసికట్టుగా కుమారస్వామికి అండగా నిలబడాలి. మనకు ఎప్పుడు కష్టం వచ్చినా ఆయన అండగా నిలిచారు. కాబట్టి నాడు, నేడు, ఎప్పుడూ కుమారస్వామి గారికి మనందరం అండగా నిలవాలి. శ్రీకృష్ణదేవరాయ సైనిక్ స్కూల్ కు నా హృదయపూర్వక శుభాకాంక్షలు. దేశంలో ఉత్తమ సైనిక స్కూల్స్‌లో ఒకటిగా నిలవాలని కోరుకుంటున్నాను. ఎలాంటి సపోర్ట్ కావాలన్నా నేను అండగా ఉంటాను. నేను కూడా ఈ దేశ పౌరుడినే. నేను కర్ణాటక చిన్న తమ్ముడిని. అన్నివేళలా అండగా ఉంటాను. ఎన్నో ఏళ్లుగా ఈ పాఠశాలను విజయవంతంగా నిర్వహిస్తున్న యాజమాన్యానికి, ఉపాధ్యాయులకు నా అభినందనలు. కర్ణాటక కేవలం ఒక రాష్ట్రం మాత్రమే కాదని, మనదేశానికి బలమని మంత్రి పేర్కొన్నారు. ఘనస్వాగతం పలికిన తెలుగువారందరికీ హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేశారు. దీనిని జీవితాంతం గుర్తుపెట్టుకుంటానని.. మీకు జీవితాంతం రుణపడి ఉంటానని మంత్రి చెప్పారు. ఈ కార్యక్రమంలో కేంద్ర ఉక్కుశాఖ మంత్రి హెచ్.డీ కుమారస్వామి, కేంద్ర రక్షణశాఖ సహాయమంత్రి సంజయ్ సేథ్ తో పాటు విశాఖ ఎంపీ శ్రీ భరత్, కర్ణాటక వైద్య విద్య, నైపుణ్యాభివృద్ధి శాఖ మంత్రి శరణ్ ప్రకాష్ పాటిల్, కర్ణాటక కన్నడ, సాంస్కృతిక శాఖ మంత్రి శివరాజ్ ఎస్. తంగడగి, కర్ణాటక చిన్న నీటిపారుదల శాఖ మంత్రి ఎన్.ఎస్ బోసురాజు, కొప్పళ మాజీ ఎంపీ కే.విరూపాక్షప్ప, కర్ణాటక మాజీ మంత్రి, కేవోఎఫ్(బెంగళూరు) ప్రెసిడెంట్ వెంకటరావు నాడగౌడ, కర్ణాటక మాజీ ఎమ్మెల్సీ బసనగౌడ బాదర్లీ, కొప్పళ ఎంపీ కే.రాజశేఖర్ బసవరాజ్ హిట్నాల్, రాయచూర్ ఎంపీ జి.కుమార్ నాయక్, సింధనూరు ఎమ్మెల్యే హంపనగౌడ బాదర్లీ, ఎమ్మెల్సీ బసవగౌడ బాదర్లీ, అమృత కన్ స్ట్రక్షన్ ప్రైవేట్ లిమిటెడ్(బెంగళూరు) వ్యవస్థాపకులు పీవీ రావు, శ్రీకృష్ణదేవరాయ ఎడ్యుకేషనల్ సొసైటీ ప్రెసిడెంట్ బి.వెంకటరావు, డైరెక్టర్లు, సింధనూరు స్థానిక తెలుగు ప్రజానీకం పెద్దఎత్తున పాల్గొన్నారు.

## ప్రముఖ ఆలయాల పరిసరాల్లో... 'తిరుమల' బంధనలు

ప్రముఖుల వాహనాలైనా ఆలయ ప్రాంగణానికి బయటే నిలిచిపోవాలి. ఆలయ ప్రాంగణంలోకి కేవలం ఎలక్ట్రిక్ వాహనా(ఈవీ)ల ద్వారానే చేరుకునేలా చర్యలు తీసుకోవాలి' అని సీఎం అధికారుల్ని ఆదేశించారు. 'ఇందుకు అవసరమైన ప్రణాళికలు రూపొందించాలి. వాహనాల పార్కింగ్ ప్రదేశంలో సోలార్ రూఫ్‌టాప్ ఏర్పాటు చేయాలి. ఆలయ ప్రాంగణం భవిష్యత్‌లో భారీ వృక్షాలతో పరిఢవిల్లేలా అవసరమైన మొక్కలు నాటాలి. ఆలయం సమీపంలో హెల్త్ సెంటర్ నిర్మించాలి. పుష్కరాలు, ఇతర ఉత్సవాల రోజుల్లో అక్కడ వైద్యులు, వైద్య సిబ్బంది ఉండాలి. అభివృద్ధి పనుల సమయంలో ఆలయ పవిత్రతకు ఎటువంటి భంగం కలగకుండా జాగ్రత్త పడాలి' అని రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. అభివృద్ధి పనుల నాణ్యత విషయంలో అలసత్వం వహిస్తే సహించేది లేదని హెచ్చరించారు. సమీక్షలో దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ, ప్రభుత్వ సలహాదారు సుదర్శన్‌రెడ్డి, ఎంపీ వేం నరేందర్‌రెడ్డి, సీఎస్ రామకృష్ణారావు, సీఎం ముఖ్యకార్యదర్శి శ్రీనివాసరాజు, ఆ శాఖ ముఖ్యకార్యదర్శి శైలజా రామయ్యర్, కమిషనర్ హనుమంతరావు పాల్గొన్నారు.

## రాజధానిపై జగన్‌ది గంటకో మాట

పలు అభివృద్ధి పనులకు భూమి పూజతో పాటు రూ.6 లక్షలతో నిర్మించిన ఆంజనేయస్వామి దేవాలయం వద్ద ఘనగిరి పూల మార్కెట్ ను శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, పెనుకొండ పట్టణంలో అభివృద్ధి కార్యక్రమాలు వేగంగా కొనసాగుతున్నాయన్నారు. పూల వ్యాపారులను ప్రోత్సహించేలా పూల మార్కెట్ ను ఏర్పాటు చేశామన్నారు. ప్రజలకు మెరుగైన పారిశుధ్య సౌకర్యాలు కల్పించేందుకు రూ.50 లక్షలతో శానిటేషన్ సెంటర్లను నిర్మిస్తున్నామన్నారు. ఇప్పటికే రూ.5 కోట్లతో చేపట్టిన పనులు త్వరలో పూర్తి కానున్నాయన్నారు. ఎన్టీఆర్ సర్కిల్ నుంచి మడకశిర రోడ్ వరకు కూడా సెంటర్ లైటింగ్ ను ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు.

### ఆ 11 సీట్లు కూడా రావు

విలేకరులకు అడిగిన ప్రశ్నకు మంత్రి సవిత స్పందిస్తూ... గంటకో మాట మార్చే వ్యక్తి జగన్ అని మండిపడ్డారు. దేశం మొత్తం ఏపీ రాజధాని అమరావతి అని అంటుంటే జగన్ మాత్రం గంటకో మాట మాట్లాడుతున్నారని విమర్శించారు. ఒకసారి అమరావతే రాజధాని అంటారని, మరోసారి మూడు రాజధానులని, ఇంకోసారి మావిగన్ అని, తాను ఉంటున్న లోటస్ పాండ్ ప్యాలెస్ కూడా రాజధానే అని అంటున్నారని అన్నారు. ఇలా రాజధానిపై గంటకో మాట మాట్లాడే జగన్ కు మంచి వైద్యం అందించాలని స్వయాన వైసీపీ నాయకులు గొణుక్కుంటున్నారని మంత్రి సవిత అన్నారు. అమరావతి రైతులు, మహిళలను ఇబ్బందులకు గురిచేయడం వల్లే వైసీపీకి ప్రజల్లో వ్యతిరేకత పెరిగిందన్నారు. వచ్చే ఎన్నికల్లో గతంలో వచ్చిన సీట్లు కూడా రావని వ్యాఖ్యానించారు. గెలిచినప్పుడు ఒకలా, ఓడినప్పుడు మరోలా వ్యవహరించే వ్యక్తి జగన్ అని మంత్రి సవిత విమర్శించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

## ఎల్‌డీఎఫ్ కుమ్మక్కు

సందర్భంగా కేరళలోని అలప్పుళ, కట్టప్పనా, కొచ్చిన్‌లలో శనివారం జరిగిన ప్రచార సభల్లో ఆయన ప్రసంగించారు. "భాజపా-ఎల్‌డీఎఫ్ మధ్య రహస్య అనుబంధం ఉంది. కేరళ అసెంబ్లీ ఎన్నికల తర్వాత ఎల్‌డీఎఫ్‌లో ఎవరూ మిగిలి ఉండరు. ఎల్‌డీఎఫ్ తీరులో ఏదో మార్పు జరగడం వల్లే సీపీఎం మాజీ నేత జి.సుధాకరన్ మాతో కలిసి ఈ వేదికపై నిలుచున్నారు. భాజపా, ఆరెస్సెస్, సీపీఎంల మధ్య ఉన్న సంబంధం కేరళలోని ప్రతి ఒక్కరికి తెలుసు. నాపై, కాంగ్రెస్‌పై నిరంతరం మాటల దాడి చేసే మోదీ.. అవినీతికి పాల్పడిన ఎల్‌డీఎఫ్ ప్రభుత్వానికి, పినరయి విజయన్‌కు వ్యతిరేకంగా ఎందుకు మాట్లాడరు? తన పిల్లలను కాపాడుకోడానికే విజయన్ మోదీకి భయపడుతున్నారు. వామపక్షాలతో అనుబంధం లేని యువత ఉద్యోగాల కోసం విదేశాలకు వెళ్లక తప్పడం లేదు" అని రాహుల్ వ్యాఖ్యానించారు.

## గజ్వేల్‌లో ఉద్రిక్తత....

అక్కడ నుంచి తీసివేశారు. పోలీసులు వారించినా ఫలితంలేకపోయింది. ఏసీపీ నర్సింలు అక్కడికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. కాంగ్రెస్ పార్టీ శ్రేణులు క్యాంపు కార్యాలయంపై దాడి చేశాయంటూ భారాస నాయకులు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. మధ్యాహ్నం 3 గంటల వరకు ఉద్రిక్తత కొనసాగింది.

### పనిచేయని ఎమ్మెల్యే మాకొద్దు: ఆంక్షారెడ్డి

ప్రజలకు అందుబాటులో ఉండని.. పనిచేయని ఎమ్మెల్యే తమకు అక్కర్లేదని డీసీసీ అధ్యక్షురాలు ఆంక్షారెడ్డి అన్నారు. క్యాంపు కార్యాలయం వద్ద మీడియాతో మాట్లాడారు. "కేసీఆర్ అసెంబ్లీకి వెళ్లి ప్రజల సమస్యలను ప్రస్తావించడం లేదు. ఆయన ఎమ్మెల్యే సభ్యత్వాన్ని రద్దు చేయాలి. ఆయన స్థానికంగా ప్రజలకు అందుబాటులో ఉండకపోవడంతో కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు పెండింగ్‌లో పడిపోయాయి. ఇప్పటిదాకా ఊరుకున్నాం.. ఇక ఊరుకునే ప్రసక్తే లేదు" అని అన్నారు.

### ఇది ముమ్మాటికీ రేవంత్‌రెడ్డి ఆదేశాలతో జరిగిన దాడే: హరీశ్‌రావు

శాసనసభలో విపక్ష నేత, గజ్వేల్ ఎమ్మెల్యే, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ క్యాంపు కార్యాలయంపై కాంగ్రెస్ శ్రేణుల దాడి అత్యంత హేయమైనదని సిద్దిపేట ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీశ్‌రావు అన్నారు. ఈ మేరకు ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. "ఇది ముమ్మాటికీ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశాలతో జరిగిన దాడే. కాంగ్రెస్ నాయకులు బిహార్ గ్యాంగ్‌లను తలపిస్తూ వీరంగం సృష్టించడం ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయడమే. ఏకంగా ప్రజాప్రతినిధుల కార్యాలయాలపైనే దాడులు జరుగుతున్నాయంటే రాష్ట్రంలో శాంతిభద్రతలు ఉన్నాయనే అనుకోవాలా? పోలీసు యంత్రాంగం కాంగ్రెస్ పార్టీకి ప్రైవేట్ సైన్యంలా మారింది. ఒకవైపు హేట్ స్పీచ్ బిల్లు పేరుతో ప్రతిపక్షాల నోళ్లు మూయిస్తూ మరోవైపు దాడులు చేయించడమేనా ఇందిరమ్మ రాజ్యమంటే? ప్రతిపక్ష ఎమ్మెల్యేల కార్యాలయాలపై దాడులకు ఫ్రీ హ్యాండ్ ఇచ్చి ఎమర్జెన్సీ పాలనను గుర్తుకు తెస్తున్నారు. కాంగ్రెస్ తాటాకు చప్పుళ్లకు భారాస భయపడదు. ప్రజాక్షేత్రంలో అడుగడుగునా నిలదీస్తాం" అని పేర్కొన్నారు. తక్షణమే నిందితులను అరెస్ట్ చేయాలని డీజీపీని డిమాండ్ చేశారు. 'లేనిపక్షంలో ప్రజలే వీధుల్లోకి వస్తారు. తస్మాత్ జాగ్రత్త' అని ఆయన హెచ్చరించారు.

### 44 మందిపై కేసు నమోదు

భారాస నాయకులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు 44 మంది కాంగ్రెస్ నాయకులు, ఇతరులపై కేసు నమోదు చేసినట్లు సీఐ రవికుమార్ శనివారం రాత్రి తెలిపారు.

# ఎడిటర్ వాయిస్

## అమరావతికి రాళ్ళెత్తిన కూలీలు.. చరిత్ర కారులు!

అమరావతి రాజధాని నిర్మాణ పనులపై ఉండవల్లిలోని క్యాంప్ కార్యాలయంలో చంద్రబాబు ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. ఏపీ రాజధాని అమరావతి విషయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు కాలాన్ని కలలను కలిపి కొలుస్తూ ముందుకు సాగుతున్నారు. ప్రతీ క్షణం కూడా ఎంతో విలువైనది అన్నది ఆయనకు బాగా తెలుసు. ఇదిలా ఉంటే అమరావతికి చట్టబద్ధత వచ్చింది. దాంతో ఇక అడ్డనుకు అన్నీ అధిగమించినట్లే అన్నది సైతం బాబు స్వయంగా చెప్పారు. దాంతో అమరావతి నిర్మాణాన్ని చూడాలని ఒక రూపు ఒక షేపుకి తీసుకుని వస్తే ఆనందించాలని కోట్లాది మంది ఏపీ జనాలలో మరింత ఎక్కువగా ఉంటుంది. దాంతో ప్రజల ఆలోచనలను ఆశలను గమనంలోకి తీసుకున్న చంద్రబాబు ఏ మాత్రం ఆలస్యం లేకుండా ఫీల్డ్ లోకి వెంటనే దిగిపోయారు.

**ఉన్నత స్థాయి సమీక్షతో :** అమరావతి రాజధాని నిర్మాణ పనులపై ఉండవల్లిలోని క్యాంప్ కార్యాలయంలో చంద్రబాబు ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. మంత్రి నారాయణ, సీఆర్డీఏ, ఏడీసీ ఉన్నతాధికారులు, రాజధాని నిర్మాణ పనులు చేస్తోన్న సంస్థల ప్రతినిధులు హాజరైన నేపథ్యంలో బాబు వారందరికీ దిశా నిర్దేశం చేశారు.ఈ సమీక్షలో బాబు అమరావతి పనుల విషయంలో ఏ టూ జెడ్ వివరాలను అన్నింటికీ అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఏ ఒక్క విషయం వదిలిపెట్టకుండా అన్నీ వాకబు చేశారు. ఇక ఈ సమీక్షకు ఇక అమరావతి రాజధానిలో ప్రస్తుతం వివిధ దశలలో సాగుతోన్న 57,821 కోట్ల రూపాయల విలువైన పనులు గురించి బాబు పూర్తి స్థాయిలో సమీక్ష నిర్వహించారు.

**చరిత్రాత్మక ఘట్టంలో భాగం :** అమరావతి రాజధాని అన్నది ఒక చరిత్ర. రానున్న కొన్ని వందల ఏళ్ళకు ఈ రోజున పునాది పడుతోంది. అందుకే చంద్రబాబు ఈ నిర్మాణంలో భాగస్వాములు అయిన సంస్థలకు అలాగే ఈ పనులలో పాలుపంచుకుంటున్న వారికి ఒకటే చెప్పారు. అమరావతి నిర్మాణం అన్నది ఒక గొప్ప కార్యక్రమం. రాజధాని నిర్మాణమనేది కేవలం ఒక కాంట్రాక్ట్ వర్క్ గా చూడొద్దు అని ఆయన హితవు చెప్పారు. ఈ రోజున పనులు చేపట్టే వారంతా చరిత్రలో భాగస్వాములువుతున్నట్టే అని బాబు స్పష్టం చేశారు. నిర్మాణ సంస్థలుగా అంతా ఎన్నో ప్రాజెక్టులు చేసి ఉంటారు కానీ రాజధాని నగరాన్ని నిర్మించే అవకాశం అందరికీ దక్కదని బాబు వారికి చెప్పారు. అమరావతి రాజధానిని అద్భుతంగా వినూత్నంగా నిర్మించేందుకు అపార అవకాశాలున్నాయని ఆయన అన్నారు. అమరావతిని ఫ్యూచర్ సిటీగా నిర్మించాలనే ప్రభుత్వ ఆలోచనను క్షేత్రస్థాయిలో అమలు చేసి చూపించాల్సింది మీరే అంటూ న్రిమాణ సంథలను కోరారు ప్రస్తుతం రాజధానిలో పనులు చేస్తున్న వారుకీ 20 వేల మంది కార్మికులు నిపుణులు ఉన్నారని చెబుతున్నారు.

**టార్గెట్లు పెట్టుకోవాలి :** అమరావతి రాజధాని నిర్మాణ పనులలో టార్గెట్లు పెట్టుకుని మరీ పనిచేయాలని బాబు కోరారు. వారానికి ఎంత అయింది నెల రోజులకు ఎంత అయింది అన్నది ఎప్పటికపుడు మధింపు చేయాలని ఆయన సూచించారు. వారం నెల టార్గెట్ పెట్టుకుని పనులు పూర్తి చేయాలని దిశా నిర్దేశం చేశారు. వర్షాకాలం వచ్చే సమయానికి పూర్తి చేయాల్సిన పనులపై స్పష్టత ఉండాలని కోరారు. అంతే కాదు నాణ్యతతో నిర్మాణాలు ఉండాలని, కాస్ట్ ఎఫెక్టివ్ చర్యలు తీసుకోవాలని, గ్రీన్ ఎనర్జీ, టెక్నాలజీ వంటి వాటిని వినియోగించుకోవాలని బాబు సూచించారు అదే సమయంలో రాజధాని ప్రతిష్టను పెంచేలా ఎవరికైనా ఆలోచనలు వస్తే వాటిని ప్రభుత్వంతో పంచుకోవచ్చునని బాబు చెప్పారు.

**ఐకానిక్ భవనాల నిర్మాణం :** ఇంకో వైపు చూస్తే హౌసింగ్, రోడ్లు, ట్రంక్ ఇన్ఫ్రాస్ట్రక్చర్, ఎల్పిఎస్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ తో పాటు అసెంబ్లీ, హైకోర్టు, సచివాలయం వంటి ఐకానిక్ భవనాల నిర్మాణం పనులు అమరావతిలో ప్రస్తుతం పెద్ద ఎత్తున సాగుతున్నాయి. ఏ నిర్మాణ సంస్థ ఎంత మేర పనులు చేసింది అన్నది బాబు ఆరా తీశారు, అదే విధంగా ఎంత మంది కార్మికులు పని చేయాలి ఎంత మంది పనిచేస్తున్నారుం ఎంత మిషనరీ ఉపయోగించాలి, ఎంత ఉపయోగిస్తున్నారు అనే విషయంపై



చబ్బబాబ్య్ సమగ్రంగా చర్చించారు. ప్రభుత్వం నిర్దేశించిన సమయానికి నిర్మాణం పూర్తి చేసి తీరాల్సిందే అని ఆయన కోరారు ఈ విషయంలో ఏమాత్రం రాజీ ఉండదని స్పష్టం చేశారు. అలాగే మ్యాన్ పవర్ పెంచుకోవాల్సిన అవసరం ఉందని, ప్రతి నిర్మాణం సకాలంలో పూర్తి చేసి ప్రారంభించుకోవాలబు బాబు గట్టిగా కోరారు.

ఎడిటర్ : కె.సునీల్‌కుమార్

# క్రైం వాయిస్

## చౌడేశ్వరిని అప్పగించింది పోలీసు అధికారే

### డబ్బు తీసుకుని.. దారుణానికి సహకరించిన వైనం



**నరసరావుపేట, విశ్వం వాయిస్ న్యూస్ :** మాచర్ల పరువు హత్య ఘటనలో ఓ పోలీసు అధికారి సహకారం ఉన్నట్లు తెలుస్తోంది. ప్రేమపెళ్లి చేసుకుందని చౌడేశ్వరి(23)ని ఆమె తండ్రే హత్య చేసిన విషయం తెలిసిందే. నిందితుల విచారణలో... ఆమె ఆచూకీ కనిపెట్టి, తండ్రికి అప్పగించింది ఓ పోలీసు అధికారేనని తేలింది. కుమార్తె ఆచూకీ కనిపెట్టి అప్పగిస్తే సదరు పోలీసుకు భారీ మొత్తం ఇచ్చేలా ఒప్పందం కుదుర్చుకున్నట్లు.. రెండు విడతలుగా నగదు ఇచ్చినట్లు ప్రధాన నిందితుడు అంగీకరించాడని సమాచారం.

**ఎలా చేశారంటే..**

ప్రేమపెళ్లి చేసుకున్న నాగరాజు, చౌడేశ్వరి జంట నరసరావుపేట మండలం పెదతురకపాలేనికి చెందిన ఖాజా సాయంతో నరసరావుపేటలో ఓ ఇల్లు అద్దెకు తీసుకుని ఉంటున్నారు. ఖాజాను నరసరావుపేట రూరల్ పోలీసులు పట్టుకుని విచారించగా కొత్తజంట ఆచూకీ చెప్పాడు. మాచర్ల పోలీసులు వారిద్దరినీ తీసుకెళ్లారు. తాను మేజర్‌నని, నాగరాజుతోనే ఉంటానని చౌడేశ్వరి చెప్పినా.. ఆ అధికారి ఆమెను తల్లిదండ్రులకు అప్పగించారు. ఆమెను చంపినరోజు ఆ అధికారి సెలవులో ఉన్నారు. పోస్టుమార్టం రిపోర్టును తారుమారు చేయాలనుకున్నా ఆ ప్రయత్నాలు ఫలించకపోవడంతో హత్యోదంతం బయటపడింది.


## ఇన్ఫోసిస్ పేరు చెప్పి.. రూ.6.3 కోట్లకు వంచన

### సీఎస్ఆర్ విరాళాలు ఇస్తామంటూ ఎర్నెస్ట్ మనీ వసూలు

**మైసూరు, విశ్వం వాయిస్ న్యూస్ :** ఇన్ఫోసిస్ సంస్థ సీనియర్ అధికారులమంటూ ఫోన్లు చేసి మైసూరులోని మర్కంటైల్ కంపెనీ యాజమాన్యాన్ని కొందరు మోసగాళ్లు నిలువునా వంచించారు. రూ.6.3 కోట్లు అడ్డంగా దోచుకున్నారు. మర్కంటైల్ సంస్థ యాజమాన్య ప్రతినిధుల ఫిర్యాదుతో గగన్, నీలాద్రి, ప్రసాద్ మిశ్రా, జె.హర్ష అనే వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు మైసూరు సైబర్ ఠాణా పోలీసులు శుక్రవారం తెలిపారు. మొదట గగన్ అనే వ్యక్తి గతేడాది మర్కంటైల్ కంపెనీకి ఫోన్ చేసి, తాను ఇన్ఫోసిస్‌లో కార్పొరేట్ సామాజిక బాధ్యత (సీఎస్ఆర్)ల విభాగం ప్రాంతీయ అధికారినని పరిచయం చేసుకున్నాడు. మీరు నిర్వహించే 'హెగ్గుంజె రాజీవ్‌శెట్టి ఛారిటబుల్ ట్రస్టు'కు రూ.కోట్ల నిధులు విరాళంగా ఇప్పిస్తామని చెప్పాడు. మీరు మంగళూరు, ఉడుపి తదితర ప్రాంతాల్లో నిర్వహిస్తున్న ట్రస్టు కార్యకలాపాలను పరిశీలించాలని నమ్మబలికాడు. పరిశీలనకు కొందరు నిపుణులను పంపిస్తున్నానని చెప్పి, తన అనుచరులను పంపించాడు. మీరు నిర్వహించే ట్రస్టులు, ఆరోగ్య కేంద్రాలకు రూ.178 కోట్ల సొమ్ము విడుదల చేస్తామని, అంతకుముందు 'ఎర్నెస్ట్ మనీ' డిపాజిట్ చేయాలని సూచించాడు. ఈ మేరకు ఇన్ఫోసిస్ పేరిట గతేడాది అక్టోబరులో ఒక ఆర్డర్ కాపీని సృష్టించాడు. ఆ పత్రం నిజమని నమ్మిన మర్కంటైల్ ప్రతినిధులు దశల వారీగా డీడీలు, నగదు రూపేణా రూ.6.3 కోట్లను నిందితులు చెప్పిన అనితా వెంచర్స్, ఏఎన్ఎస్ ఇంజినీరింగ్స్ తదితర కంపెనీల ఖాతాల్లో వేశారు. ఏడాది గడిచినా సీఎస్ఆర్ విరాళాలు మర్కంటైల్ సంస్థ ఖాతాలోకి జమ కాలేదు. దీంతో ఆ సంస్థ తాము మోసపోయామని గుర్తించి సైబర్ ఠాణాలో ఫిర్యాదు చేయగా, పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## భారత్‌ను ఇస్లామిక్ రాజ్యంగా మార్చడమే లక్ష్యం

### కస్టడీలో వెల్లడించిన ఉగ్ర కేసులున్న నిందితులు



**అమరావతి, విశ్వం వాయిస్ న్యూస్ :** భారత్‌ను ఇస్లామిక్ రాజ్యంగా మార్చాలనే లక్ష్యంతోనే జిహాదీ భావజాలానికి ఆకర్షితులయ్యామని, దీనికి మద్దతుగా సామాజిక మాధ్యమాల్లో పోస్టులు పెట్టామని ఉగ్ర కేసులున్న నిందితులు విచారణలో వెల్లడించారు. ఐదు రోజుల కస్టడీలో భాగంగా ఈ కేసులో నిందితులైన రహంతుల్లా షరీఫ్, మహ్మద్ డానిష్, మీర్జా సొహైల్ బేగ్, సైదా బేగం, అబ్దుల్ సలాంలను ఎన్ఐఏ, ఐబీ, సీఐ సెల్, నగర పోలీసులు విచారించారు. మూడో రోజైన శుక్రవారం నగరంలోని టాస్క్‌ఫోర్స్ కార్యాలయంలో వీరి విచారణ సాగింది. విదేశాల్లోని హ్యాండ్లర్ల ఆదేశాల మేరకు గజ్వా-ఏ-హింద్ కోసం పనిచేసినట్లు వెల్లడించారు.

**అంతా సామాజిక మాధ్యమాల్లోనే..**

విదేశీ హ్యాండ్లర్ అయిన షకూర్.. సామాజిక మాధ్యమాల ద్వారానే పరిచయమయ్యాడని విజయవాడకు చెందిన రహంతుల్లా(ఏ1) చెప్పినట్లు తెలిసింది. అతని ఆదేశాలతోనే ఏక్యూఐఎస్‌తో సంబంధాలున్న షాద్‌మన్ దిల్‌ఖుష్, సైదా బేగం కలిసినట్లు చెప్పాడు. బెన్ఎక్స్ గ్రూపునకు చెందిన అజ్మానుల్లా ఖాన్, లక్కీ అహ్మద్, ఆసిఫ్ అలీ, జీషాన్, అబ్దుల్ సలామ్ పరిచయం అయ్యారని వివరించాడు. ఇప్పటి వరకు పోలీసులు అరెస్టు చేసిన 12 మంది ఆన్‌లైన్‌లో తప్ప.. బయట ఎక్కడా కలవలేదని నిందితులు చెప్పారు. పాలస్తీనాపై ఇజ్రాయెల్ దాడుల నేపథ్యంలో వీటికి ఆకర్షితులమైనట్లు, అందుకే జిహాదీగా మారాలని నిర్ణయించుకున్నట్లు విచారణలో వెల్లడించారు. ఇస్లామిక్ దేశాలకు చెందిన ఉగ్రవాదుల ఇన్‌స్టాగ్రామ్ ఐడీలను ఫాలో అవుతున్నట్లు నిందితులు ఎన్ఐఏ, ఐబీ అధికారులకు చెప్పారు. ఒక్కొక్కరు ఐదు, ఆరు ఐడీలను ఎందుకు క్రియేట్ చేసుకున్నారు? మీ ప్రణాళిక ఏమిటి? ఈ ఐడీలు మీవేనా? ఎవరైనా తెరిచారా? అని అధికారులు నిందితులను లోతుగా ప్రశ్నించారు. కొన్ని కీలకమైన ప్రశ్నలకు వీరి నుంచి సమాధానాలు రాలేదని సమాచారం. తన పేరుతో ఉన్న పలు ఐడీలను తాను తెరవలేదని హైదరాబాద్‌కు చెందిన సైదాబేగం వెల్లడించినట్లు తెలిసింది.

### డబ్బులు పంచుకుంటుండగా..

## లారీ ఢీకొట్టింది

### ఇద్దరు విద్యార్థుల దుర్మరణం.. మరో ముగ్గురికి తీవ్రగాయాలు

### క్యాటరింగ్ పనికి వెళ్లి వస్తుండగా దుర్ఘటన



**తిరువూరు, విశ్వం వాయిస్ న్యూస్ :** వారందరూ ఇటీవలే ఇంటర్ ద్వితీయ పరీక్షలు రాశారు. ఫలితాలు వచ్చాక మంచి కళాశాలల్లో చేరాలని, బాగా చదివి ఉన్నతంగా స్థిరపడాలని ఆశించారు. అప్పటిదాకా ఏదో ఒక పనికి వెళ్తే కొంత నగదు పొదుపు చేసుకోవచ్చని భావించారు. అలా క్యాటరింగ్ పనికి వెళ్లివస్తున్నవారిని ఊహించని రోడ్డు ప్రమాదం బలితీసుకుంది. ఎన్టీఆర్ జిల్లాలో చోటుచేసుకున్న ఈ విషాద ఘటనలో ఇద్దరు విద్యార్థులు దుర్మరణం చెందగా, మరో ముగ్గురు గాయపడ్డారు. తిరువూరు పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదివిన సన్నీ, ఈశ్వర్, వెంకటేశ్వరరావు, రామ్‌చరణ్ పరీక్షలు పూర్తికావడంతో క్యాటరింగ్ పనులకు వెళ్తున్నారు. ఈ క్రమంలో గురువారం రాత్రి కూడా మరో స్నేహితుడు చరణ్‌తేజతో కలిసి ఏలూరు జిల్లా నూజివీడులో జరిగిన ఒక వేడుకలో క్యాటరింగ్‌కు వెళ్లారు. ఆ పని పూర్తయ్యాక శుక్రవారం వేకువజామున 3 గంటలకు తిరుగు ప్రయాణంలో ద్విచక్ర వాహనంపై ఇద్దరు, ఆటోలో ముగ్గురు తిరువూరు మండలం లక్ష్మీపురం వద్దకు చేరుకున్నారు. అక్కడే రోడ్డు పక్కన నిల్చుని డబ్బులను పంచుకుంటున్నారు. ఆ సమయంలో గుర్తు తెలియని లారీ వీరిని ఢీకొట్టడంతో గంపలగూడెం మండలం దుందిరాలపాడుకు చెందిన మోదుగు సన్నీ(17), తిరువూరు పట్టణంలోని బెస్తాల బజార్‌కు చెందిన నక్కా ఈశ్వర్ సత్యసాయి(16) అక్కడికక్కడే చనిపోయారు. తిరువూరులోని తోకపల్లికి చెందిన ధారావత్ రామ్‌చరణ్, లక్ష్మీపురానికి చెందిన దైదా వెంకటేశ్వరరావు, బాలమర్తి చరణ్‌తేజ తీవ్రంగా గాయపడ్డారు. రక్తపు మడుగులో ఛిద్రమైన శరీర భాగాలతో ఘటనా స్థలం హృదయ విదారకంగా మారింది. ఈ ప్రమాదాన్ని క్షతగాత్రుల్లో ఒకరైన వెంకటేశ్వరరావు తండ్రి గోపయ్య గమనించి గ్రామస్థులకు, పోలీసులకు సమాచారం అందించారు. గాయపడిన వారిని తొలుత తిరువూరు ప్రభుత్వాసుపత్రికి, అనంతరం విజయవాడకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సైలు గౌరీశ్వరి, కె.రాజు తెలిపారు.

## కవల కుమార్తెలను కడతేర్చాడు

### బావిలో తోసేసి ఘాతుకం

### కరీంనగర్ జిల్లాలో దారుణం



**కరీంనగర్ కొత్తపల్లి, విశ్వం వాయిస్ న్యూస్ :** అభంశుభం తెలియని కవలలైన తన కుమార్తెలనే ఓ కసాయి తండ్రి బావిలో తోసి కడతేర్చిన హృదయ విదారక ఘటన కరీంనగర్ జిల్లాలో చోటుచేసుకుంది. సీఐ నిరంజన్‌రెడ్డి తెలిపిన ప్రకారం... కరీంనగర్ రూరల్ మండలం జూబ్లీనగర్‌కు చెందిన కచ్చు శ్రీశైలంతో మానకొండూరు మండలం లక్ష్మీపూర్‌కు చెందిన మౌనికకు ఏడేళ్ల కిందట వివాహమైంది. వీరికి గీతాన్‌శ్రీ(4), గీతాన్విక(4) కవలలు జన్మించారు. కుమార్తెలు జన్మించారని శ్రీశైలం భార్య మౌనికతో తరచూ గొడవపడేవాడు. ఇదే విషయమై విడాకులు కావాలని 3 నెలల క్రితం గ్రామంలో పెద్దమనుషుల సమక్షంలో పంచాయితీ జరిగింది. వారు సర్దిచెప్పడంతో తిరిగి కలిసిపోయారు. ఈ నేపథ్యంలో శుక్రవారం మధ్యాహ్నం శ్రీశైలం పిల్లలను తీసుకుని వ్యవసాయ బావి వద్దకు వెళ్తున్నట్లు ఇంట్లో చెప్పి వెళ్లాడు. తర్వాత కుమార్తెలను బావిలో తోసేసి తానూ దూకాడు. ఎంతసేపటికి వెళ్లిన వారు రాకపోవడంతో భార్య మౌనిక వచ్చి చూడగా భర్త బావిలో కనిపించాడు. పిల్లలు ఎక్కడున్నారని అడగగా.. ఆడుకుంటూ బావిలో పడిపోయారని, వెతుకుతున్నట్లు చెప్పాడు. ఈ విషయం తెలుసుకున్న గ్రామస్థులు పిల్లలను శ్రీశైలమే బావిలో తోసేశాడని దేహశుద్ధి చేశారు. అనంతరం పోలీసులు అతనిని అదుపులోకి తీసుకున్నారు. 5 గంటలపాటు గజ ఈతగాళ్లతో వెతకగా రాత్రి 9 గంటలకు మృతదేహాలను బయటకుతీశారు.

# భక్తి వాయిస్

## 700 ఏళ్లుగా వెలుగుతూనే ఉన్న దీపం..

### కాకతీయుల నాటి ఈ గుడి ప్రత్యేకత మీకు తెలుసా?


ఆ గ్రామంలో ఓ పురాతన ఆయలం ఉంది. శీతారాములుకొలువై ఉన్న ఈ ఆలయంలో ఉన్న దీపం నిరంతరం వెలుగుతూనే ఉంది. దాన్ని వెలిగించి దాదాపు 700 ఏళ్లు దాటిన ఇంకా ఆ దీపం కొండెక్కలేదు.. ఆ నాటి నుంచి నేటి వరకు చెక్కుచెదరకుండా ప్రకాశిస్తూనే ఉంది. ఇంతకు ఆ ఆలయం ఎక్కడుందనేగా మీ డౌట్.. అది తెలుసుకోవాలంటే ఈ స్టోరీ చదవాల్సిందే. అది రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేటలోని శ్రీ సీతారామాలయం.. ఈ ఆలంలో స్వామి వారి ముందు ఉన్న నందా అనే దీపం సుమారు 700 ఏళ్లుగా ఆరని దివ్య జ్యోతిగా భక్తులను ఆకట్టుకుంటోంది. ఈ దీపం కేవలం ఒక వెలుగు కాదు, శతాబ్దాల విశ్వాసానికి నిలువెత్తు ప్రతీకగా అక్కడి భక్తుల నమ్మకం. ఇదే ఆ గ్రామానికి ఆధ్యాత్మిక గుర్తింపుగా నిలిచింది. వివరాల్లోకి వెళ్తే.. క్రీస్తు పూర్వం.. 1,314వ సంవత్సంలో కాకతీయుల కాలంలో ఈ ఆలయాన్ని నిర్మించినట్టు గుడిలోని శాసనాల ద్వారా తెలుస్తోంది.

**700 ఏళ్లుగా వెలుగుతున్న దీపం**

ఈ ఆలయ ప్రత్యేకత ఏమిటంటే మూల విగ్రహాల ప్రతిష్ఠకు ముందే ఇక్కడ నందా దీపాన్ని ప్రతిష్ఠించారట. అప్పటి నుంచి నేటి వరకు ఈ దీపం ఆరకుండా ప్రకాశిస్తూనే ఉందట. ఆలయానికి వచ్చిన భక్తులు ఈ దీపానికి నూనెను సమర్పిస్తూ దాని జ్వాలను ఆరిపోకుండా చూసుకుంటున్నారట.తరతరాలుగా ఈ సంప్రదాయం కొనసాగుతోందట. గ్రామస్థుల విశ్వాసం ప్రకారం ఈ జ్యోతి వెలుగుతుండటం వల్ల గ్రామంలో ఐశ్వర్యం, పంటలు, శాంతి నిలుస్తాయట. ఇది దైవ అనుగ్రహానికి ప్రత్యక్ష రూపంగా గ్రామస్తులు భావిస్తారు.

**కాకతీయుల కళా వైభవం**

ఈ ఆలయం నిర్మాణం కేవలం భక్తి కట్టడం మాత్రమే కాదు. శిల్పకళకు కూడా మహోన్నతికి ప్రతీకగా నిలుస్తోంది. ఈ ఆలయంలో 16, 18 రాతి స్తంభాలతో అద్భుత మండపాలు, చతురస్రాకార



నిర్మాణ శైలి. శిల్పాల్లో కనిపించే నిగూఢమైన నైపుణ్యం. ఈ నిర్మాణం కాకతీయుల కాలపు కళాత్మక ప్రతిభను ప్రతిబింబిస్తూ, చరిత్రను జీవంతంగా నిలబెడుతోంది. ప్రతి సంవత్సరం శ్రీరామనవమి సందర్భంగా ఈ ఆలయం భక్తులతో కిటకిటలాడుతుంది. 9 రోజుల పాటు నవాహ్నిక బ్రహ్మోత్సవాలు సీతారామ కళ్యాణం.. భద్రాచలం తరహాలో ఘనంగా అశ్వ, గజ, గరుడ, హనుమాన్, శేష వాహన సేవలు.. రథోత్సవం, ఏకాంత సేవ వంటికి జరుపుతారు. ఈ ఉత్సవాలకు భక్తులు భారీగా హాజరవుతారు.

**అన్నదాన కార్యక్రమాలు**

ఈ ఉత్సవాల సమయంలో దాతల సహకారంతో నిర్వహించే అన్నదానం ఈ ఆలయ ప్రత్యేకత. గ్రామస్థులు సమిష్టిగా భాగస్వామ్యం వహిస్తూ ప్రతి భక్తునికి సేవ చేయడం ఈ క్షేత్ర ఆధ్యాత్మికతను మరింత పెంచుతోంది. గత కొన్నేళ్లుగా గ్రామ ప్రజల సహకారంతో ఆలయ పునర్నిర్మాణ పనులు చేపట్టడం ద్వారా ఆలయం మరింత శోభాయమానంగా మారింది.

## ఆంజనేయస్వామి విగ్రహం లేని ఏకైక రామాలయం..


### ఒంటిమిట్ట అసలు కథ ఇది..

శ్రీరాముడు ఎక్కడ ఉంటే అక్కడ హనుమంతుడు ఉంటాడన్నది జగమెరిగిన సత్యం. కానీ, కడప జిల్లాలోని ఒంటిమిట్ట కోదండరామ స్వామి ఆలయంలో మాత్రం సీతారామలక్ష్మణులు ఉన్నా, వారి పక్కన ఆంజనేయుడు కనిపించడు. దేశంలో మరెక్కడా లేని విధంగా ఈ వింత ఇక్కడ ఎందుకు ఉంది? దీని వెనుక ఉన్న పురాణ గాథలు ఏమిటి? అన్నది ప్రతి ఒక్కరినీ ఆశ్చర్యపరిచే అంశం. ఒంటిమిట్ట కేవలం ఒక గుడి మాత్రమే కాదు, అది ఒక శిల్పకళా ప్రదర్శనశాల. విజయనగర చక్రవర్తుల కాలంలో నిర్మితమైన ఈ ఆలయం 'ఏకశిలా నగరం'గా పిలవబడుతోంది. ఇక్కడ ఒకే శిలపై సీత, రామ, లక్ష్మణుల విగ్రహాలు చెక్కబడి ఉండటం విశేషం. అయితే, రామాయణ మహాకావ్యంలో కీలకమైన హనుమంతుడి పాత్ర ఇక్కడ ఎందుకు లోపించిందో తెలుసుకోవాలంటే మనం త్రేతాయుగపు కాల గమనంలోకి వెళ్లాల్సిందే.

**1. కిష్కింధకు ముందు కథ:** పురాణాల ప్రకారం, శ్రీరాముడు అరణ్యవాసంలో ఉన్నప్పుడు సీతమ్మను వెతుకుతూ దక్షిణాపథానికి వచ్చిన సమయం అది. ఇంకా ఆయనకు హనుమంతుడితో పరిచయం ఏర్పడలేదు. అంటే, రామాయణంలోని 'కిష్కింధ కాండ' కంటే ముందు జరిగిన ఘట్టానికి ఈ ఆలయం ప్రతీక. అందుకే ఇక్కడ కేవలం సీతారామలక్ష్మణులు మాత్రమే కొలువై ఉన్నారు. హనుమంతుడితో స్నేహం కలగకముందు రాముడు ఎలా ఉన్నాడో, ఇక్కడ అలాగే దర్శనమిస్తాడు.

**2. ఏకశిలపై ముగ్గురు మూర్తులు:** సాధారణంగా ఆలయాల్లో విగ్రహాలను విడివిడిగా ప్రతిష్ఠిస్తారు. కానీ ఒంటిమిట్టలో సీత, రామ, లక్ష్మణుల విగ్రహాలు ఒకే శిలపై చెక్కబడి ఉంటాయి. అందుకే దీనిని ఏకశిలా క్షేత్రం అంటారు. విగ్రహాల కింద హనుమంతుడు లేకపోవడం అనేది ఈ ఆలయ ప్రాచీనతకు, ఆ ఘట్టం యొక్క విశిష్టతకు నిదర్శనం.

**3. భక్త పోతన పరవశం:** మహాకవి బమ్మెర పోతన తన 'శ్రీమదాంధ్ర భాగవతం' ఇక్కడే రాసి, స్వామివారికి అంకితం ఇచ్చారని





ప్రతీతి. "రామభద్రుని కంటే దైవము లేదని" నమ్మిన పోతన, ఈ క్షేత్రంలోని స్వామివారి అందానికి ముగ్ధుడై తన కావ్యాన్ని ఇక్కడే పూర్తి చేశారు. ఫ్రెంచ్ యాత్రికుడు టావెర్నియర్ సైతం 1652లో ఈ ఆలయాన్ని సందర్శించి, "భారతదేశంలో ఉన్న అత్యంత సుందరమైన ఆలయాలలో ఇది ఒకటి" అని తన గ్రంథంలో రాశారు.

**4. చంద్రుడి కోరిక - వెన్నెల కల్యాణం:** మరో ఆసక్తికరమైన విషయం ఏమిటంటే, ఇక్కడ శ్రీరామనవమి రోజు కల్యాణం జరగదు. చైత్ర శుద్ధ పౌర్ణమి నాడే కల్యాణం జరుగుతుంది. రాముడు జన్మించింది సూర్యవంశంలో కాబట్టి, సూర్యుడు వెలుతురులో కల్యాణం చూడాలని అందరూ భావిస్తారు. కానీ, తన వంశంలో పుట్టిన రాముడి కల్యాణాన్ని తాను కూడా చూడాలని చంద్రుడు కోరగా.. ఆయన కోరిక మేరకు నిండు పౌర్ణమి నాటి వెన్నెల వెలుగుల్లో ఇక్కడ కల్యాణం జరిపిస్తారని పురాణాలు చెబుతున్నాయి. ఒంటిమిట్ట రామాలయం కేవలం ఒక మతపరమైన క్షేత్రం మాత్రమే కాదు, అది భారతీయ సంస్కృతికి, చరిత్రకు సజీవ సాక్ష్యం. హనుమంతుడు లేని ఈ విలక్షణ రామాలయం, రామాయణంలోని ఒక అరుదైన ఘట్టాన్ని మన కళ్లముందు ఉంచుతుంది. ఈ వేసవిలో వెన్నెల వెలుగుల కల్యాణాన్ని వీక్షించడం ప్రతి ఒక్కరి జీవితంలో ఒక మధుర జ్ఞాపకం.

# విశ్వం వాయిస్

అవినీతిపై- అక్షరసమరం...



కాకినాడ తూర్పు గోదావరి డా బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ

ఆదివారం, 05 ఏప్రియల్ 2026

www.viswam voice.com




# జీవో 629 శెట్టిబలిజల ఆత్మగౌరవానికి ప్రతీక

**- దొమ్మేటి వెంకటరెడ్డి జయంతి అధికారిక వేడుకలు శెట్టిబలిజలకు గర్వకారణం**
**- రానున్న రోజుల్లో ప్రతి పార్లమెంట్లోనూ చంద్రబాబు అభినందన సభలు ఏర్పాటు**
**- రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ చైర్మన్ కుడుపూడి సత్తిబాబు**



**కాకినాడ, విశ్వం వాయిస్ న్యూస్ :** శెట్టిబలిజ సమాజాన్ని రాజకీయంగా ప్రోత్సహిస్తూ, ఆర్థికంగా బలోపేతం చేసిన చరిత్ర తెలుగుదేశం పార్టీదేనని రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ చైర్మన్ కుడిపూడి సత్తిబాబు పేర్కొన్నారు. శనివారం ఉదయం కాకినాడలోని స్థానిక సినిమా రోడ్డులోని జయ రెసిడెన్సి నందు నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, జీవో 629 ద్వారా శెట్టిబలిజ సంఘ వ్యవస్థాపకులు, ఆరాధ్యులు కీశే దొమ్మేటి వెంకటరెడ్డి జయంతిని అధికారికంగా నిర్వహించే అవకాశం కల్పించిన ముఖ్యమంత్రి చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రతిపక్షంలో ఉన్న సమయంలో బీసీ సెల్ అధ్యక్షుడిగా ఉన్న కొల్లు రవీంద్ర, యువగళం పాదయాత్రలో ఉన్న నారా లోకేష్ దృష్టికి ఈ అంశాన్ని తీసుకెళ్లారని గుర్తుచేశారు. అనంతరం అధికారంలోకి వచ్చిన తరువాత శెట్టిబలిజల మనోభావాలను గౌరవించి ఇచ్చిన మాట నిలబెట్టుకున్న నారా లోకేష్ గారి గొప్ప మనసును ఆయన కొనియాడారు. ఈ విషయంలో అప్పటి టిడిపి రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెంనాయుడు గారు అందించిన సహకారం మరువలేనిదని తెలిపారు. అలాగే రాష్ట్ర బీసీ శాఖ మంత్రి ఎస్.సవిత ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ గారితో, రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ గారితో, జిల్లా ఇన్‌చార్జి మంత్రి నిమ్మల రామానాయుడుతో సమన్వయం కొనసాగించి ఈ జీవో కొరకు సహకరించారని వివరించారు. ఈ జీవో రావడానికి సహకరించిన శెట్టిబలిజ నాయకులు, బీసీ సోదరులందరికీ కార్పొరేషన్ తరఫున కృతజ్ఞతలు తెలిపారు. రానున్న రోజుల్లో ప్రతి పార్లమెంటు పరిధిలోను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గారికి అభినందన సభలు ఏర్పాటు చేసి శెట్టిబలిజ సమాజం గర్వపడేలా కూటమి ప్రభుత్వం ఇచ్చిన జీవో పై రాష్ట్రవ్యాప్తంగా అవగాహన కల్పించాల్సిన బాధ్యత శెట్టిబలిజ కార్పొరేషన్ తరఫున తమపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేషన్ డైరెక్టర్లు డా. చప్పిడి వెంకటేశ్వరరావు, టేకుముడి లక్ష్మణరావు, జగదీశ్, కదలి వెంకటేశ్వరరావు, కేతా శ్రీను, గన్నవరం పెదబాబు, రామలింగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. అలాగే పార్టీ పెదపూడి మండల అధ్యక్షుడు జిత్తుక కృష్ణ, పప్పుర బుజ్జి, వాసంశెట్టి అంజిబాబు తదితర నాయకులు, పెద్ద సంఖ్యలో శెట్టిబలిజ సోదరులు హాజరై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గారికి, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌కి, మంత్రి నారా లోకేష్‌కి కృతజ్ఞతలు తెలుపుతూ మిఠాయిలు పంచుకుని ఆనందం వ్యక్తం చేశారు. ఈ తీర్మానాన్ని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వద్దకు తీసుకువెళ్లిన మాజీ మంత్రి, ఆచంట నియోజకవర్గం ఎమ్మెల్యే పితాని సత్యనారాయణకి, ఉప ముఖ్య మంత్రి పవన్ కళ్యాణ్ వద్దకు తీసుకువెళ్లిన మంత్రివర్యులు వాసంశెట్టి సుభాష్‌కి, బీసీ కార్పొరేషన్ పెద్దల మద్దతు కోసం కృషి చేసిన మాజీ శాసన మండలి డిప్యూటీ చైర్మన్ రెడ్డి సుబ్రమణ్యంకి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

# ముఖ్యమంత్రిని కలిసి కృతజ్ఞతలు తెలిపిన కుడుపూడి సత్తిబాబు



## దొమ్మేటి వెంకటరెడ్డి జయంతిని అధికారికంగా ప్రకటించడంపై హర్షం..

**అమరావతి, విశ్వం వాయిస్ న్యూస్ :** ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు, సామాజిక సంస్కర్త దొమ్మేటి వెంకటరెడ్డి జయంతి వేడుకలను ప్రభుత్వం తరఫున అధికారికంగా నిర్వహించాలని నిర్ణయించినందుకు గాను ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకి ధన్యవాదాలు వ్యక్తమయ్యాయి. ఈ మేరకు రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ చైర్మన్ కుడుపూడి సత్తిబాబు ముఖ్యమంత్రిని మర్యాద పూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. వెనుకబడిన వర్గాల అభ్యున్నతికి, స్వాతంత్ర్య పోరాటంలో దొమ్మేటి వెంకటరెడ్డి చేసిన కృషిని గుర్తించి, వారి జయంతిని రాష్ట్ర పండుగగా నిర్వహించాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడం పట్ల సత్తిబాబు హర్షం వ్యక్తం చేశారు. సచివాలయంలో ముఖ్యమంత్రిని కలిసిన ఆయన, శెట్టిబలిజ సామాజిక వర్గం తరఫున ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తూ శాలువాతో సత్కరించి,పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ నిర్ణయం ద్వారా బడుగు, బలహీన వర్గాల నాయకులకు తగిన గౌరవం లభించిందని, ఇది ఆ సామాజిక వర్గాల్లో కొత్త ఉత్సాహాన్ని నింపిందని ఈ సందర్భంగా పేర్కొన్నారు. మహనీయుల త్యాగాలను స్మరించుకుంటూ, వారి ఆశయాలను భావితరాలకు అందించడంలో భాగంగా ప్రభుత్వం తీసుకున్న ఈ చర్యను పలువురు సామాజిక నాయకులు సానుకూలంగా స్పందిస్తున్నారు.

# స్త్రీ శక్తికి దన్నుగా పది సూత్రాల ప్రణాళిక

**మాతా, శిశు ఆరోగ్య పరిరక్షణ కవచం, పితృ భాగస్వామ్యం, పనిచోట్ల సంరక్షణ కేంద్రాలు, వర్కింగ్ ఉమెన్స్ హాస్టళ్లు**
**శ్రమ శక్తిలో మహిళల ఇతోధిక భాగస్వామ్యంతో సాధికారత - వైద్యారోగ్య శాఖా మంత్రి శ్రీ సత్యకుమార్ యాదవ్ వెల్లడి**

**విశ్వం వాయిస్ న్యూస్ :** పలు సామాజిక, ఆర్థిక పరిమితులతో వివక్షకు గురవుతున్న మహిళలకు సాధికారిత(ఎంపవర్మెంట్) ద్వారా రాష్ట్ర ప్రగతిలో వారికి భాగస్వామ్యం కల్పించడానికి రాష్ట్ర ప్రభుత్వం పది సూత్రాల ప్రణాళికను రూపొందించింది. సుదీర్ఘ కాలంపాటు రాష్ట్ర సమగ్ర ప్రగతికి బాటల వేసే దిశగా ప్రభుత్వం రూపొందించిన నూతన 'జనాభా స్థిరికరణ' విధానంలో భాగంగా మహిళా సాధికారత కోసం ఈ 10 సూత్రాల ప్రణాళికను ప్రతిపాదించినట్లు వైద్యారోగ్య శాఖా మంత్రి శ్రీ సత్యకుమార్ యాదవ్ శనివారంనాడొక పత్రికా ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ప్రగతికి కీలకమైన నూతన జనాభా నిర్వహణలో మహిళల కీలక పాత్రను గుర్తించిన కూటమి ప్రభుత్వం పక్కా విధానాన్ని రూపొందించినట్లు మంత్రి వివరించారు. గర్భధారణ మరియు శిశు సంరక్షలను మహిళా హక్కుగా గుర్తించిన రాష్ట్ర ప్రభుత్వం వారి జీవన అన్ని దశల్లోనూ అండగా ఉండి, అనుకూల వాతావరణాన్ని కల్పించి, లింగ వివక్షకు తెరదించివ సమాజా వికాసంలో మహిళా శక్తికి తమ పాత్రను పూర్తి స్థాయిలో నిర్వహించేలా చూసేందుకు కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తుందని మంత్రి తెలిపారు.

**స్త్రీ శక్తి ఆవిష్కరణకు పది సూత్రాలు**

మహిళల జీవనంలోని అన్ని దశల్లోనూ నాణ్యమైన సేవల్ని అందుబాటులో ఉంచి వారికి సమగ్ర ఆరోగ్య రక్షణ కల్పించడం, సంతాన ప్రాప్తి హక్కును సరైన విధానంలో సాకారం చేయడం, ఆర్థిక స్వావలంబనకు వారికి ఎదురవుతున్న ఆటంకాలను తొలగించడం, శిశు సంరక్షణలో పురుషుల్ని భాగస్వాములు చేయడం ఈ పది సూత్రాల ప్రణాళిక ముఖ్య ఉద్దేశమని మంత్రి శ్రీ సత్యకుమార్ యావ్ వివరించారు.

**స్త్రీ అనుకూల పని వాతావరణ కల్పన**

పురుషులతో పాటు సమానంగా మహిళలు ఆర్థిక ఉత్పాదక శక్తిగా ఆవిర్భవించేందకు ఎదురవుతున్న ఆటంకాలను తొలగించేందుకు ప్రభుత్వం సమాయత్తమైంది. ఇందులో భాగంగా...ఆరేళ్ల వయసు వరకు శిశువుల సంరక్షణ కోసం 50 మందికి పైగా ఉద్యోగులుండే ప్రతి చోటా శిశు పాలనా కేంద్రాల్ని (క్రెష్‌లు) ఏర్పాటు చేయాల్సిన అవసరాన్ని గుర్తించి ఆ దిశగా చర్యల్ని ప్రతిపాదించిందని మంత్రి శ్రీ సత్యకుమార్ యాదవ్ తెలిపారు. వాటితో పాటు...ప్రతి లక్ష జనాభాకు ఒకటి చొప్పున 'వర్కింగ్ ఉమెన్స్ హాస్టల్' ను పట్టణ ప్రాంతాల్లో ఏర్పాటు చేసే దిశగా చర్యలు తీసుకోబడతాయి. ప్రస్తుతం...శిశు పాలనా కేంద్రాల బాధ్యత ప్రధానంగా మహిళలపైనే ఉంటోంది. ఈ పరిస్థితిని మార్చేందుకు ప్రస్తుత సామాజిక విలువల్లో తగు చైతన్య కార్యక్రమాల ద్వారా మార్పు తెచ్చి 'శిశు పాలనలో సమాజ బాధ్యత' అన్న నినాదం ద్వారా పురుషుల భాగస్వామ్యాన్ని పెంపొందిస్తూ మార్పు తేవాల్సి ఉంటుందని మంత్రి అన్నారు. ఈ దిశగా ప్రస్తుతం అమలులో ఉన్న 180 రోజుల ప్రసూతి సెలవులను(మెటర్నటీ లీవ్) 12 నెలల పేరెంట్ హుడ్ లీవ్ గా తల్లిదండ్రులిద్దరూ సమానంగా వాడుకునే వీలు కల్పిస్తామని మంత్రి శ్రీ సత్యకుమార్ యాదవ్ తెలిపారు.

**సంతాన ప్రాప్తి హక్కు గుర్తింపు**

సంతాన ప్రాప్తి హక్కు ప్రతి జంట ఆకాంక్ష. హక్కు అని, అయితే రాష్ట్రంలో దాదాపు 12 లక్షల కుటుంబాలు సంతాన వైఫల్యంతో పలు సమస్యలకు గురవుతున్నారని, ఈ సమస్యకు పరిష్కారంగా అట్టి కుటుంబాలకు సంతానోత్పత్తి సేవల్ని ఉచితంగా అందజేయాలని ప్రభుత్వం నిర్ణయించిందని మంత్రి తెలిపారు. సాలీనా 50,000 కుటుంబాలకు ఈ సేవల్ని ఉచితంగా అందజేసే విధంగా ప్రభుత్వం తగు చర్యల్ని తసుకుంటుందని ఆయన అన్నారు. దేశంలో రాష్ట్రంలోనే తొలిసారిగా ఈ సేవలకు శ్రీకారం చుడతామని మంత్రి తెలిపారు. ఇందు నిమిత్తం దేశంలో తొలిసారిగా 'మాతృత్వ' పథకం కింద 'సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఇన్ రిప్రొడిక్టివ్ హెల్త్‌ను ఏర్పాటు చేస్తామన్నారు. దీంతో పాటు ఈ సేవలకు సంబంధించి 6 నెలల డిప్లొమా కోర్సు, సంవత్సరం పాటు సాగే అడ్వాన్స్‌డ్ కోర్సులను ప్రారంభిస్తామని మంత్రి వివరించారు. రాష్ట్రంలో సాలీనా దాదాపు నాలుగు వేల మంది ప్రసూతి వైద్యులు పట్టాలు పుచ్చుకుంటున్నారని, వారికి సంతానోత్పత్తి సేవలందించడంలో నైపుణ్యాన్ని కల్పించే దిశగా చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు

**మాతా, శిశు ఆరోగ్య సంరక్షణ**

పిన్న వయసులో గర్భధారణ, పౌష్టికాహార లోపం, అధిక సంఖ్యలో సిజేరియన్ జననాలు, భారీ స్థాయిలో మహిళలకు కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు, తరచుగా ప్రసవాల కారణంగా మాతృమూర్తులు అనారోగ్యానికి గురవడాన్ని గుర్తించిన ప్రభుత్వం పరిష్కార లక్ష్యాలను నిర్దేశించినట్లు మంత్రి శ్రీ సత్యకుమార్ యాదవ్ తెలిపారు. ముఖ్యంగా... గర్భధారణకు ముందు, అనంతర చర్యల పట్ల మహిళలకు తగు కౌన్సిలింగ్ చేయాల్సిన అవసరముందన్నారు. ప్రస్తుతం మహిళలకు 70 శాతం వరకు జరుగుతున్న కుటుంబ నియంత్రణ ఆపరేషన్లను ఐదేళ్లలో 50 శాతానికి తగ్గించాలన్నారు. మహిళల జనానాంగాల్లో వాడే గర్భ నిరోధక పరికరాలు, ఇంజెక్షన్ల ద్వారా గర్భ నిరోధక మందులు, మాత్రల వినియోగాన్ని పెంచడం, సరైన అవగాహనతో శిశు జననాల మధ్య తగు వ్యవధి ఉండేలా చూడడంపై దృష్టి పెట్టాలన్నారు. ప్రైవేట్ ఆసుపత్రుల్లో 68 శాతం వరకు సిజేరియన్లు జరుగుతున్నాయని, తగు చర్యల ద్వారా వీటిని ఐదేళ్లలో 40 శాతానికి తగ్గించాల్సిన అవసరముందని మంత్రి శ్రీ సత్యకుమార్ యాదవ్ నొక్కి వక్కాణించారు. రాష్ట్రంలో పిన్న వయసులో గర్భ ధారణ దాదాపు 9 శాతంగా నమోదవుతోందని, దీన్ని 3 శాతానికి తగ్గించడాన్ని లక్ష్యంగా పెట్టుకున్నామని మంత్రి తెలిపారు.

**టీటీడీ చైర్మన్ పదవి నుంచి**

# బిఆర్ నాయుడిని తొలగించండి..

## వైఎస్ఆర్‌సిపి వివిధ విభాగాల నాయకుల డిమాండ్



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** హిందువుల అత్యంత పవిత్ర పుణ్యక్షేత్రమైన తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) చైర్మన్ పదవి విషయంలో ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై రాజకీయ సామాజిక వర్గాల్లో తీవ్ర దుమారం లేపిన తరుణంలో అవినీతి ఆరోపణలు, మచ్చలేని వ్యక్తులను మాత్రమే ఆ పవిత్ర బాధ్యతలు అప్పగించాలని వైఎస్ఆర్ సిపి వివిధ విభాగాల నాయకులు డిమాండ్ చేసారు. వైసిపి అధినేత, మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పిలుపు మేరకు మాజీ ఎంపీ, వైసిపి జాతీయ అధికార ప్రతినిధి మార్గాని భరత్ రామ్ ఆదేశాల మేరకు మాజీ కార్పొ రేటర్, వైసిపి సీనియర్ నాయకుడు వాసంశెట్టి గంగాధరరావు ఆధ్వర్యంలో స్థానిక కంబాల చెరువు సమీపంలో ఉన్న శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయం లో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్థానిక గాంధీ విగ్రహం వద్ద వైసిపి నాయకులు ప్రభుత్వ తీరును నిరసిస్తూ ప్లకార్డులతో ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వాసంశెట్టి గంగాధరరావు మాట్లాడుతూ టీటీడీ చైర్మన్ బిఆర్ నాయుడు ఒక మహిళతో అసభ్యకరంగా వ్యవహరించిన తీరు చాలా అభ్యంతరకరమన్నారు. అలాంటి ఆరోపణలు ఎదుర్కొంటున్న వ్యక్తిని ఇంతకాలం పదవిలో కొనసాగించడం శోచనీయమన్నారు. కోట్లాది మంది భక్తుల మనోభావాలతో ముడిపడి వున్న తిరుమల తిరుపతి దేవస్థానం చైర్మన్ పదవిలో ఆయనను ఇంకా కొనసాగించడంపై అనేక అనుమానాలు కలుగుతున్నాయన్నారు. ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన తిరుమల పవిత్రలను కాపాడాల్సింది పోయి అటువంటి వ్యక్తిపై విచారణ చేయాలని, వాస్తవ విషయాలు ప్రజలకు తెలియచెప్పాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. చైర్మన్ పదవిలో ఉన్న బిఆర్ నాయుడుని తక్షణమే తొలగించాలని, ఆధ్యాత్మిక కేంద్రమైన టీటీడీ బోర్డులో నైతిక విలువలు ఉన్న వారికే చోటు కల్పించాలని డిమాండ్ చేసారు. భక్తుల మనోభావాలు గౌరవించని పక్షంలో ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. వివాదాస్పద ఆరోపణలు ఎదుర్కొంటున్న బిఆర్ నాయుడిని తక్షణమే చైర్మన్ పదవి నుంచి భర్తరఫ్ చేయాలని, ఆయన వ్యవహారాలు, వ్యాపారాలపై విచారణ చేయాలని డిమాండ్ చేసారు. రాజకీయ ప్రయోజనాల కోసం కాకుండా భక్తి భావం కలిగిన వ్యక్తులకే ఈ పీఠం అప్పగించి, సామాజిక మాధ్యమాల్లో వస్తున్న విషయాలు, ఆధారాలపై స్పష్టమైన వివరణ ఇవ్వాలన్నారు. వైయస్సార్సీపి రాష్ట్ర కార్యదర్శి గుర్రం గౌతమ్, మాజీ కార్పొరేటర్, వైఎసఆర్సిపి మహిళా అధ్యక్షురాలు పోలు విజయలక్ష్మి, యువజన విభాగం సిటీ అధ్యక్షులు బిల్డర్ చిన్న, రాష్ట్ర యువజన విభాగం కార్యదర్శి ఆరే చిన్ని, వైయస్సార్ టి యు సి జిల్లా అధ్యక్షుడు సప్పా ఆదినారాయణ, రాష్ట్ర ప్రచార కమిటీ కార్యదర్శి వట్టికూటి కృష్ణవేణి, రాష్ట్ర ఎస్సీ నాయకులు దాసి వెంకట్రావు, డివిజన్ ఇన్‌చార్జ్ నల్లమిల్లి సత్తిరెడ్డి, రాష్ట్ర ఎస్సీ అధికార ప్రతినిధి కాటం రజనీకాంత్, వైఎస్ఆర్టియుసి సిటీ ప్రెసిడెంట్ డి.గౌరీ శంకర్, మున్సిపల్ కార్పొరేషన్ అధ్యక్షుడు మజ్జి అప్పారావు, బీసీ నాయకులు మార్గాని సురేష్, వార్డు ప్రెసిడెంట్ ఎస్.సత్తిరాజు, రేగుళ్ళబళ్ళ శ్రీధర్, చవ్వాకుల రంగనాథ్, మైనార్టీ సెల్ నాయకులు గౌస్, ఖాన్, కటకం చిన్న, వంగల మహాలక్ష్మి, కట్టా వెంకటేష్, తిరగాటి దుర్గ తదితరులు పాల్గొన్నారు.

# రాజమండ్రిలో కార్మిక భవనం పూర్తి చేయండి మహా ప్రభో..

**నిలువ నీడ లేక కార్మికులు ఎండల్లో సమావేశాలు జరుపుకునే దుస్తితి**
**అధికారులు,ప్రజా ప్రతినిధులు తక్షణమే భవనం పూర్తి చెయ్యాలి - బొజ్జా రామకృష్ణ ఆవేదన**



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** భవన నిర్మాణ కార్మిక సంఘాల సమైక్య ఆధ్వర్యంలో శనివారం ఉదయం స్థానిక క్వారీ మార్కెట్ అన్న క్యాంటీన్ వెనుక శ్రామిక భవనంలో భవన నిర్మాణం కార్మిక సంఘాల సమైక్య నాయకులు శ్రామిక భవనం వద్ద అర్ధనగ్న ప్రదర్శనతో ప్ల కార్డులు పట్టుకొని కార్మికులందరూ పెద్ద ఎత్తున నిరసన తెలియజేశారు. భవన నిర్మాణ కార్మిక సంఘాల సమైక్య నాయకులు బొజ్జా రామకృష్ణ మాట్లాడుతూ నగరపాలక సంస్థ కమిషనర్ ,ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వీరుగాని అనేకసార్లు ఫిర్యాదు చేసిన స్లాబ్ అనేది పడలేదు, దీని నిమిత్తం అనేకసార్లు గ్రీవెన్స్ లో ఫిర్యాదులు చేశాం,అయినప్పటికీ నగరపాలక సంస్థగాని ప్రభుత్వం గానీ కార్మికుల పట్ల అవలంబిస్తున్న తీరు అత్యంత బాధాకరమని, కార్మికులకు ఎండలో మీటింగ్లు పెట్టుకుని దుస్థితి తయారైనదని ఆవేదన వ్యక్తం చేశారు. రాజమండ్రి ప్లంబర్స్ వర్కర్స్ ట్రేడ్ యూనియన్ కొండపల్లి నాగేశ్వరావు మాట్లాడుతూ, గతంలో రాజమండ్రి శాసనసభ్యులు ఆదిరెడ్డి శ్రీనివాస్ శ్రామిక భవనం వద్దకు వచ్చి పరిస్థితి చూసి త్వరలో స్లాబు వేస్తామని తెలియజేసినారు కానీ రోజులు గడుస్తున్న కార్మికులకు నీడ అనేది ఇంతవరకు లేదు ఇప్పటికైనా నగరపాలక సంస్థ కమిషనర్ ప్రత్యేక చొరవ తీసుకొని మాకు నీడ కల్పించాలని అన్నారు. రాజమహేంద్రవరం రాజరాజ నరేంద్ర పెయింటర్స్ వర్కర్స్ ట్రేడ్ యూనియన్ కూరపాటి రాజన్న మాట్లాడుతూ ఎంతోమందికి మా కార్మికులు గృహాలు కడుతున్నారు కానీ కార్మికుడన్న వాడికి గృహమనే కళ నెరవేర్చాలా లేదా అనే సందేహం కలుగుతుందని ఇదే కనుక జరిగితే రానున్న రోజుల్లో మా యొక్క నిరసన కార్యక్రమాలు మొదలుపెట్టే పరిస్థితి వస్తుందని సందర్భంగా తెలిపారు. ఈ


మా 'విశ్వం వాయిస్' వాట్సాప్ ఛానల్‌లో జాయిన్ అవ్వండి!

నిజాయితీ గల వార్తలు.. నిరంతర అప్‌డేట్స్!

- ⚡ బ్రేకింగ్ న్యూస్ అప్‌డేట్స్
- రోజువారీ తెలుగు దినపత్రిక PDF
- 🌎 అంతర్జాతీయ, జాతీయ వార్తలు
- 📊 విశ్లేషణాత్మక కథనాలు

VISWAM VOICE BREAKING NEWS
WhatsApp channel

మీ ఫోన్ కెమెరాతో స్కాన్ చేసి గ్రూపులో చేరండి

JOIN NOW

లింక్ ద్వారా కూడా జాయిన్ అవ్వండి:
https://whatsapp.com/channel/0029Va7zLL1E50Uhr9gpAR1E

మాతో పాటు మరిన్ని వార్తలు మరియు తాజా అప్‌డేట్స్ తెలుసుకోండి.

### కోనసీమ వాసుల కల నెరవేరిన వేళ

# ఎమ్మెల్యే బండారును అభినందించిన మంత్రి వాసంశెట్టి



**కొత్తపేట, విశ్వం వాయిస్ న్యూస్ :** లొల్ల లాకుల ఆధునీకరణ బండారు పేరు చరిత్రలో నిలిచిపోతుంది లొల్లలాకులు ఆధునీకరణకు 74.20 కోట్లు నిధులు మంజూరుకు కృషి చేసిన బండారు సత్యానందరావును కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ ప్రశంసించారు. క్యాంపు కార్యాలయానికి విచ్చేసి సత్యానందరావుకు అభినందనలు తెలిపారు. ఎమ్మెల్యే బండారు సత్యానందరావుతో పాటు నియోజకవర్గంలో సహకరిస్తున్న జనసేన పార్టీ ఇన్చార్జ్ బండారు శ్రీనివాసును ఇరువురిని సన్మానించారు. రైతు పక్షాన కూటమి ప్రభుత్వం పని చేస్తుందని సంక్షేమంతో పాటు అభివృద్ధిని ప్రజలకు అందిస్తుందని మంత్రి అన్నారు. లొల్ల లాకులు అధునికరించడం వలన కోనసీమ ప్రాంతంలోని ఐదు నియోజ కవర్గాల రైతులకు ఎంతో మేలు జరుగు తుందని రైతులకు వరం కానున్నందుని కోనసీమ ప్రాంత వాసిగా ఆయన సంతోషం వ్యక్తం చేశారు. లొల్ల లాకులు ఆధునికరంకు కృషిచేసిన ఎమ్మెల్యేను అభినందించాలని ప్రత్యేకంగా రావుల పాలెం విచ్చేసినట్లు మంత్రి సుభాష్ తెలిపారు.

**ఎమ్మెల్యే కృషి అభినందనీయం గుబ్బల మూర్తి**

లొల్లలాకులు అభివృద్ధి కొరకు అసెంబ్లీలో గళం విప్పి పోరాడి నిధులు మంజూరు చేయించిన ఎమ్మెల్యే బండారు సత్యానందరావు కృషి అభినందనీయం. చరిత్రలో నిలిచిపోతుంది. 100 సంవత్సరాల పైబడిన బ్రిటిష్ వారు నిర్మించారని ఇప్పటికీ ఎలా అయితే చెప్పుకుంటున్నామో కూటమి ప్రభుత్వంలో ఎమ్మెల్యే సత్యానందరావు నిర్మించారని చరిత్రలో చెప్పుకుంటారని గుబ్బల మూర్తి తెలిపారు. బండారుకు అభినందనలు వెల్లువ లొల్ల లాకులు ఆధునీకరణకు కృషి చేసిన బండారు ను అభినందనలతో ముంచేత్తారు. కూటమి నాయకులు కార్యకర్తలు అభిమానులు ఘనంగా సత్కరించారు. గజమాలవేసి శాలువ కప్పి సత్కరించారు.రావులపాలెం కళా వెంకట్రావు సెంటర్ నందు బాణా సంచా పేల్చి తమ అభిమానాన్ని చాటుకున్నారు.పేలుళ్లతో హోరెత్తించారు.

# జాయింట్ కలెక్టర్ నిశాంతికి ఘన వీడ్కోలు






**విశ్వం వాయిస్ న్యూస్ జిల్లా ప్రతినిధి**

జిల్లా జాయింట్ కలెక్టర్గా టి.నిశాంతి బాధ్యతలు స్వీకరించిన నాటి నుంచి తనదైన శైలిలో పలు కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించి, "యోగాంధ్ర" ద్వారా వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డులో స్థానం సంపాదించడం, "ఈ ఆఫీస్", "మీకోసం" వంటి కార్యక్రమాలను రాష్ట్ర స్థాయిలో ముందంజలో నిలిపి జిల్లాపై చెరగని ముద్ర వేశారని జిల్లా కలెక్టర్ ఆర్. మహేష్ కుమార్ తెలిపారు. శనివారం స్థానిక కలెక్టరేట్లో టి.నిశాంతి జిల్లా కలెక్టర్గా పదోన్నతి పొంది అల్లూరి సీతారామరాజు జిల్లాకు బదిలీ అవుతున్న సందర్భంగా జిల్లా యంత్రాంగం వీడ్కోలు సభ నిర్వహించింది. ఈ సందర్భంగా ఆమె జిల్లాకు అందించిన విశేష సేవలను పలువురు అధికారులు ప్రశంసించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రెవెన్యూ, భూ సమస్యల పరిష్కారం, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో నిశాంతి చూపిన చొరవ అమోఘమన్నారు. క్లిష్ట పరిస్థితుల్లో కూడా శాంతియుతంగా వ్యవహరిస్తూ అన్ని శాఖలను సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగడం ఆమె ప్రత్యేకత అని పేర్కొన్నారు. అధికారుల పట్ల గౌరవం, సిబ్బందికి ఇచ్చే మార్గదర్శకత్వం ఆదర్శనీయమన్నారు. సుమారు 21 నెలల పాటు జాయింట్ కలెక్టర్గా పనిచేసి జిల్లా అభివృద్ధిలో కీలక పాత్ర పోషించారని, ముఖ్యంగా రెవెన్యూ పరిపాలన, భూ సమస్యల పరిష్కారం, సంక్షేమ పథకాల అమలులో విశేష కృషి చేశారని తెలిపారు. రెవెన్యూ క్రీడలు, క్విజ్ పోటీలు, రెవెన్యూ కేర్, ఓపెన్ హౌస్ కార్యక్రమాలను ప్రారంభించి తనదైన ముద్ర వేశారని పేర్కొన్నారు. తీర ప్రాంతాల్లో వాతావరణ పరిస్థితులను అంచనా వేసేందుకు రాడార్ వ్యవస్థ ఏర్పాటుకు కృషి చేసినట్లు, త్వరలో రాడార్ కేంద్రం ఏర్పడనున్నట్లు తెలిపారు. క్షేత్రస్థాయిలో సమస్యలను స్వయంగా పరిష్కరించడం ద్వారా ప్రజల్లో విశ్వాసం సంపాదించారని అన్నారు. జిల్లా ఎస్పీ రాహుల్ మీనా మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేని విధంగా వినూత్న కార్యక్రమాలు చేపట్టి ప్రజల మన్ననలు పొందారని అన్నారు. రెవెన్యూ, పౌర సరఫరాలు, ధాన్యం కొనుగోలు వంటి అంశాల్లో అంకితభావంతో పనిచేసి జిల్లాను రాష్ట్రంలో ముందంజలో నిలిపారని తెలిపారు. ఇతర అధికారులు మాట్లాడుతూ "యోగాంధ్ర" కార్యక్రమం ద్వారా వరల్డ్ రికార్డు సాధించడంలో ఆమె కీలక పాత్ర పోషించారని, రెవెన్యూ ఉద్యోగుల సమస్యలపై ప్రత్యేక దృష్టి పెట్టారని పేర్కొన్నారు. టీమ్ వర్క్తో అన్ని శాఖలను సమన్వయం చేసి సమర్థవంతంగా ముందుకు నడిపారని అభినందించారు. పదోన్నతి సందర్భంగా టి.నిశాంతి మాట్లాడుతూ జిల్లా ప్రజలు, అధికారులు తనకు కుటుంబ సభ్యుల్లా సహకరించారని తెలిపారు. తాను తీసుకున్న ప్రతి నిర్ణయంలో జిల్లా కలెక్టర్ నుంచి పూర్తి సహకారం లభించిందని పేర్కొన్నారు. జిల్లాలో సాధించిన విజయాలు అన్నీ టీమ్ వర్క్ ఫలితమని అన్నారు. రీ-సర్వే పనులు, భూ సమస్యల పరిష్కారం, ఇళ్ల పట్టాల పంపిణీ వంటి కార్యక్రమాల్లో క్షేత్రస్థాయి సిబ్బంది చూపిన కృషి విశేషమని కొనియాడారు. ప్రజలకు సేవ చేయడం కంటే గొప్ప సంతృప్తి లేదని, ఎక్కడ పనిచేసినా ప్రజల శ్రేయస్సే తన లక్ష్యమని స్పష్టం చేశారు. జిల్లాను విడిచి వెళ్తున్నప్పటికీ ఇక్కడి జ్ఞాపకాలను తనతో తీసుకెళ్తున్నానని, భవిష్యత్తులో కూడా ఇదే స్ఫూర్తితో ప్రజా సేవలో కొనసాగుతానని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవోలు జి.మమ్మీ, భాగ్యవతి, జిల్లా స్థాయి అధికారులు, డీఎస్ఓ ఉదయ భాస్కర్, ఆర్టీవో శ్రీనివాసరావు, ఏవో కాశీ విశ్వేశ్వరరావు, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

### కొత్తపేట నియోజకవర్గంలో

# ఘనంగా ప్రజాప్రతినిధుల అభినందన సన్మానం

**జిల్లా అధ్యక్షులు చిర్ల జగ్గిరెడ్డి ఆధ్వర్యంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ నేతలకు గౌరవ వేదిక**

**జడ్పీటీసీ, ఎంపీపీ,సర్పంచ్, ఎంపీటీసీ, వార్డ్ మెంబర్లకు సన్మానం**

**భారీగా తరలివచ్చిన ముఖ్య నాయకులు, కార్యకర్తలు**



**రావులపాలెం, విశ్వం వాయిస్ న్యూస్ :** డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చిర్ల జగ్గిరెడ్డి ఆధ్వర్యంలో ఈ రోజు ఉదయం రావులపాలెం సి.ఆర్.సి ఫంక్షన్ హాల్లో ప్రజాప్రతినిధుల అభినందన సన్మాన కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా రాజ్యసభ సభ్యులు పిల్లి సుభాష్ చంద్రబోస్, అమలాపురం పార్లమెంట్ పరిశీలకురాలు జక్కంపూడి విజయలక్ష్మి, మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యరావు, నరసాపురం పార్లమెంట్ పరిశీలకులు మురళి కృష్ణం రాజు గారు పాల్గొన్నారు.గత వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ కాలంలో కొత్తపేట నియోజకవర్గం నుండి జడ్పిటిసి సభ్యులుగా, ఎంపీపీ సభ్యులుగా, సర్పంచులుగా, ఎంపీటీసీలుగా, వార్డ్ మెంబర్లుగా, సొసైటీ అధ్యక్షులుగా వివిధ పదవుల్లో ప్రజల విశ్వాసంతో గెలుపొందిన ప్రజాప్రతినిధులందరికీ ఈ సందర్భంగా ఘన సన్మానం నిర్వహించారు. ఈ సందర్భంగా చిర్ల జగ్గిరెడ్డి మాట్లాడుతూ ప్రజల సేవే ముఖ్య లక్ష్యమని, భవిష్యత్తులో కూడా ప్రజలకు మరింత సేవ చేయడానికి అందరూ కలిసి పనిచేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమానికి పెద్ద ఎత్తున నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు మరియు చిర్ల అభిమానులు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# తిరుమల పవిత్రతను కాపాడాలి


**బిఆర్ నాయుడిని తిరుమల తిరుపతి దేవస్థానం చైర్మన్గా తొలగించాలి**

**కొత్తపేట నియోజకవర్గంలో నిరసన కార్యక్రమం చేపట్టిన జిల్లా అధ్యక్షులు చిర్ల జగ్గిరెడ్డి**




**రావులపాలెం, విశ్వం వాయిస్ న్యూస్ :** టీటీడీ చైర్మన్ బి.ఆర్. నాయుడు రాజీనామా డిమాండ్తో శాంతియుతంగా నిరసన తెలుపుతున్న వైఎస్సార్సీపీ మహిళా నేతలపై జరిగిన అమానుష దాడిని తీవ్రంగా ఖండించిన డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చిర్ల జగ్గిరెడ్డి. ఈ కార్యక్రమం డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా రావులపాలెం మండలం రావులపాలెం వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ క్యాంపు కార్యాలయం వద్ద ఉన్న ఆంజనేయస్వామి గుడి దగ్గర ప్రత్యేక పూజలు నిర్వహించి నిరసన తెలియజేశారు. దాడికి పాల్పడటమే కాకుండా,బాధితులైన మహిళా నేతలపైనే తప్పుడు కేసులు పెట్టడం ప్రభుత్వ నిరంకుశత్వానికి నిదర్శనం అని బి.ఆర్ నాయుడు చైర్మన్ అయిన తర్వాత తిరుమల తిరుపతి దేవస్థానంలో తొక్కిసలాటలు జరగరాని అనర్థాలు అన్ని జరుగుతున్నాయని ఆయన వెనుక ఉండి కాపాడుతున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గారు తెలుసుకొని ఆయన్ని వెంటనే చైర్మన్ పదవి నుండి తొలగించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా అమలాపురం పార్లమెంట్ పరిశీలకురాలు జక్కంపూడి విజయలక్ష్మి, మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యరావు పాల్గొన్నారు. అలాగే ఈ కార్యక్రమంలో ముఖ్య నాయకులు ప్రజాప్రతినిధులు కార్యకర్తలు పాల్గొన్నారు.


# ఈతకోటలో చలివేంద్రం ఏర్పాటు వివి వినాయక సేవా సమితి



**రావులపాలెం, విశ్వం వాయిస్ న్యూస్ :** ఈతకోట గ్రామంలో స్థానిక గ్రామ పంచాయతీ వీధిలోని కమ్యూనిటీ హాల్ శ్రీ రామాలయం వద్ద వివి వినాయక్ సేవా యూత్ సర్కిల్ అధ్యక్షులు గంద్రోతు దుర్గాసురేష్ ఆధ్వర్యంలో మట్టికుండతో ఏర్పాటు చేసిన చలివేంద్ర కార్యక్రమంను అభినందించిన గ్రామస్తులు పలువురు నాయకులు సేవా కార్యక్రమాలను నిర్వహిస్తూ గ్రామంలో వినాయక్ సేవా యూత్ సర్కిల్ అధ్యక్షులు దుర్గాసురేష్. వీరగోవిందరావులు అందిస్తున్న సేవలను అభినందించిన గ్రామస్తులు పలువురు నాయకులు మండలం పరిధిలోని ఈతకోట గ్రామంలో సమాజంలో మానవత్వం సాటుకుంటూ వివి వినాయక్ సేవా యూత్ సర్కిల్ ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న వినాయక్ యూత్ సర్కిల్ అధ్యక్షులు గంద్రోతు దుర్గాసురేష్.గంద్రోతు వీరగోవిందరావును పలువురు అభినందించారు మండుతున్న వేసవి తాపాన్ని దృష్టిలో పెట్టుకుని గ్రామంలోని స్థానిక గ్రామ పంచాయతీ వీధిలో ఉన్న కమ్యూనిటీ హాల్ శ్రీ రామాలయం వద్ద వివి వినాయక్ సేవా యూత్ సర్కిల్ ఆధ్వర్యంలో మట్టికుండలో చల్లటి త్రాగునీరు ఏర్పాటు చేశారు శనివారం నాడు బాటసారులకు చలివేంద్రాన్ని ఏర్పాటు చేసి పలువురికి స్వయంగా మంచినీరును అందజేశారు దాహార్తిని తీర్చేందుకు కుండలో నీటిని ఏర్పాటు చేయడం మంచి సేవా కార్యక్రమంమని నిర్వాహకులు. వినాయక్ యూత్ సర్కిల్ అధ్యక్షులు దుర్గాసురేష్. వీరగోవిందరావును వారు చేస్తున్న సేవా కార్యక్రమాలను గ్రామంలో అందిస్తున్న సేవలను ఈ సందర్భంగా రావులపాలెంకు చెందిన జానపద కళాకారుడు ఉగాది పురస్కార గ్రహీత వీర్నాల రమణబాబు పలువురు గ్రామస్తులు పెద్దలు నాయకులు అభినందించారు

### పరువు హత్యకు కారణమైన

# సీఐపై సస్పెన్షన్ వేటు



**నరసరావుపేట, విశ్వం వాయిస్ న్యూస్ :** పల్నాడు జిల్లా మాచర్ల పట్టణ సీఐ వెంకటరమణపై సస్పెన్షన్ వేటు పడింది. చౌడేశ్వరి తల్లిదండ్రుల వద్ద డబ్బులు తీసుకొని ఆమెను బలవంతంగా అప్పగించి, పరువు హత్యకు కారణమైనట్లు సీఐపై ఆరోపణలు ఉన్నాయి. చౌడేశ్వరి పరువు హత్యలో తల్లిదండ్రులతో పాటు వెంకటరమణ పాత్ర ఉందని తేలడంతో ఉన్నతాధికారులు చర్యలు చేపట్టారు. సీఐని సస్పెండ్ చేస్తూ జిల్లా ఎస్పీ కృష్ణారావు ఉత్తర్వులు జారీ చేశారు. ప్రేమ వివాహం చేసుకున్న చౌడేశ్వరినీ బలవంతంగా తల్లిదండ్రులకు వెంకటరమణ అప్పగించారు. అందుకోసం చౌడేశ్వరి తల్లిదండ్రుల నుంచి భారీ మొత్తంలో సొమ్ము తీసుకున్నట్లు నిర్ధారణ అయ్యింది.

# ఘనంగా గుడ్ ఫ్రై డే

**చైర్మన్, రెవ.డామియన్ ఇశ్రాయేలు సమీరా ఆధ్వర్యంలో**



**కొత్తపేట, విశ్వం వాయిస్ న్యూస్ :** రావులపాలెం అంబేద్కర్ కోనసీమ జిల్లా రావులపాలెంలోని లిటిల్ ఫ్లాక్ లూథరన్ దేవాలయం చైర్మన్, రెవ.డామియన్ ఇశ్రాయేలు సమీరా ఆధ్వర్యంలో గుడ్ ఫ్రైడే ను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్, రెవ.డామియన్ ఇశ్రాయేలు సమీరా మాట్లాడుతూ మానవాళి పాప విమోచన కోసం రక్షకుడైన ఏసుక్రీస్తు శిలువ మరణం ద్వారా పరిష్కరించారని పేర్కొన్నారు. క్రైస్తవులు శుభ శుక్రవారంగా భావించి చర్చిలలో ప్రత్యేక ప్రార్థనలు జరుపుతారన్నారు. 2000 ఏళ్ల క్రితం ఎరుషలేము నగరంలో జరిగిన సిలువ యాగాన్ని ఏసుక్రీస్తు పడిన శ్రమలను, చిందించిన రక్తాన్ని స్మరణ చేసుకోవాలన్నారు. కుటుంబ సమేతంగా పాల్గొని యేసు క్రీస్తు సిలువ మరణాన్ని ధ్యానం చేసుకున్నారు. సర్వ మానవ పాప విమోచన కోసం సిలువపై ఏసుక్రీస్తు ప్రాణ త్యాగం చేశారని, ప్రేమ క్షమ త్యాగం అనే మూడు సుగుణాలను ప్రపంచానికి అందించారని పేర్కొన్నారు. విశ్వాసులంతా ఏసు మార్గంలో నడుచుకుని సమాజంలో శాంతి సౌహార్థాలు నెలకొల్పాలని ఉపదేశించారు. ఉపవాస దీక్షలో ఉన్న విశ్వాసులు చర్చిలలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఏసుక్రీస్తు సిలువపై వేలాడుతున్న ఘట్టాన్ని హృదయ విదారకంగా మననం చేసుకుంటూ, పాప పరిహారానికి పశ్చాత్తాప హృదయంతో క్షమాపణ పొందాలని లిటిల్ ఫ్లాక్ లూథరన్ దేవాలయం చైర్మన్, రెవ.డామియన్ ఇశ్రాయేలు సమీరా విశ్వాసులను కోరారు.

# ఇందిరా కాలనీలో ఓల్టేజి సమస్య పరిష్కారం



**కొత్తపేట, విశ్వం వాయిస్ న్యూస్ :** రావులపాలెం అంబేద్కర్ కోనసీమ జిల్లా రావులపాలెంలోని స్థానిక ఇందిరా కాలనీ వాసులు ఏళ్లతర బడిలో ఓల్టేజి సమస్యను ఎదుర్కొంటున్న నేపథ్యంలో ఎలక్ట్రికల్ ఏఈ ఎన్.నరేష్ చొరవతో శనివారం పరిష్కారం లభించింది. ఇందిరా కాలనీలో అనేక ఏళ్ల నుండిలో ఓల్టేజి సమస్యతో సతమతమవుతున్నారు. నేడు ఆ కష్టాలు తీరాయి 100 కెవి కొత్త ట్రాన్స్ఫార్మర్ వేసి కష్టాలు తీర్చారు. ఈ సమస్య పరిష్కారంలో కృషి చేసిన ఎల్.ఐ.రాకేష్, లైన్ ఇన్స్పెక్టర్ సాకా రామారావు, లైన్మెన్ రాంబాబు, తాతాజీ, శేఖర్లను కాలనీ వాసులు ప్రత్యేకంగా అభినందించారు.

### మందేశ్వర స్వామి వారి దేవస్థానం నందు

# తైలాభిషేకములు ఇతర పూజల ద్వారా ఆదాయ వివరములు



**కొత్తపేట, విశ్వం వాయిస్ న్యూస్ :** డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా, కొత్తపేట మండలం, మందపల్లి గ్రామంలో వేంచేసియున్న శ్రీ మందేశ్వర స్వామి వారి దేవస్థానం నందు శనివారం శ్రీ స్వామి వారికి తైలాభిషేకములు మరియు ఇతర పూజల ద్వారా ఆదాయ వివరములు ముఖమండపం 28 × 700/- = 19,600/-, ఏకాదశ రుద్ర తైలాభిషేకం 207 × 250/-= 51,750/-, మహాన్యాస పూర్వక తైలాభిషేకం 275 × 175/- = 48,125 /- తైలం సమర్పించి దర్శనం165 × 80/- = 13,200/- తిలదానం7 × 50/- = 350/-మహాన్యాస పూర్వక తైలాభిషేకం(పరోక్షంగా), 1 × 400/- = 400/- మొత్తం రూ 1,33,425/- (ఫోన్ పే) ద్వారా ముఖమండపం 6 ×700/- = 4200/- ఏకాదశ రుద్ర తైలాభిషేకం 34 ×ఐ 250/- = 8500/-మహాన్యాస పూర్వక తైలాభిషేకం 50 × 175/- =8750/-, తైలం సమర్పించి దర్శనం 12 × 80/- = 960/- స్వయం హోమం 1 × 800/- = 800 మొత్తం రూ. 23,210/- పరోక్ష పూజలు ద్వారా రూ.1,33,600/- అన్నప్రసాదం విరాళాలు రూ.30,358/-మొత్తం రూ.3,20,593/-లు ఆదాయం వచ్చినది అని దారపురెడ్డి సురేష్ బాబు సహాయ కమీషనరు మరియు కార్యనిర్వహణాధికారి తెలియజేశారు.

### కోనసీమ సెంటర్ ఫర్ మైగ్రేషన్ను


# సందర్శించిన అనకాపల్లి జిల్లా అధికారులు



**విశ్వం వాయిస్ న్యూస్ జిల్లా ప్రతినిధి**

డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లాలోని కోనసీమ సెంటర్ ఫర్ మైగ్రేషన్ కార్యాలయాన్ని శనివారం అనకాపల్లి జిల్లా రెవెన్యూ అధికారి, జిల్లా పరిశ్రమల శాఖ అధికారి సందర్శించారు. ఇటీవల కాలంలో ఈ కేంద్రం చేస్తున్న వినూత్న సేవలను గమనించిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రతి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఇలాంటి సెంటర్ అవసరమని పేర్కొన్నారు. సమస్యలు వచ్చిన తర్వాత పరిష్కారం వెతకడం కాకుండా, ముందుగానే సమగ్రంగా నిర్వహించే విధంగా కోనసీమ సెంటర్ ఫర్ మైగ్రేషన్ మోడల్ను అన్ని జిల్లాల్లో అమలు చేయాలని పిలుపునిచ్చారు. ఈ నేపథ్యంలో అనకాపల్లి జిల్లా అధికారులు కేంద్రాన్ని సందర్శించి, జిల్లా కలెక్టర్ డాక్టర్ మహేష్ కుమార్ రావిరాల ద్వారా కేంద్రం పనితీరు మరియు జరుగుతున్న కార్యక్రమాలపై సమగ్ర వివరాలు తెలుసుకున్నారు. సందర్శన సందర్భంగా అధికారులు కేంద్రం స్థాపన ఉద్దేశ్యం, నిర్వహణ విధానం, సహాయక చర్యల అమలు, కేంద్రంలో నిర్వహిస్తున్న రికార్డులు మరియు సమావేశాలు, ఎదురయ్యే సమస్యలు, వాటి పరిష్కార విధానం, అవగాహన కార్యక్రమాలు, సిబ్బంది సంఖ్య, బాధ్యతలు, టోల్ ఫ్రీ, ల్యాండ్లైన్, మొబైల్ ద్వారా వచ్చే ఫిర్యాదుల పరిష్కార విధానం వంటి అంశాలపై సిబ్బందితో కలిసి విస్తృతంగా చర్చించారు. అదేవిధంగా అభ్యర్థుల కేసుల నిర్వహణ, మెయిల్స్, లెటర్స్ ద్వారా జరుగుతున్న కమ్యూనికేషన్ విధానం గురించి కూడా అధికారులకు వివరించారు. కేంద్రం పనితీరుపై అధికారుల సందేహాలకు సమగ్ర సమాధానాలు ఇచ్చినట్లు కేంద్ర సమన్వయ అధికారి గోళ్ళ రమేష్ తెలిపారు. ఈ సందర్శన ద్వారా కోనసీమ సెంటర్ ఫర్ మైగ్రేషన్ మోడల్ను ఇతర జిల్లాల్లో అమలు చేసే దిశగా ఒక ముఖ్యమైన అడుగు పడింది.

# నిశాంతి సేవలకు డీటీఓ దేవిశెట్టి శ్రీనివాసరావు ప్రశంసలు




**విశ్వం వాయిస్ న్యూస్ జిల్లా ప్రతినిధి**

డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లాలో జాయింట్ కలెక్టర్గా విధులు నిర్వహిస్తూ కలెక్టర్ పదోన్నతిపై అల్లూరి సీతారామరాజు జిల్లాకు బదిలీ అవుతున్న టి. నిశాంతికి జిల్లా రవాణాధికారి దేవిశెట్టి శ్రీనివాసరావు ఘనంగా అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన చేపట్టిన సత్కారం విశేషంగా ఆకట్టుకుంది. జిల్లా రవాణాధికారిగా బాధ్యతలు నిర్వర్తిస్తున్న దేవిశెట్టి శ్రీనివాసరావు, నిశాంతి పరిపాలనా ప్రతిభను కొనియాడుతూ, ఆమెకు ప్రత్యేకంగా బెజవాడ కనకదుర్గమ్మ వారి చిత్రపటాన్ని అందజేసి సత్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, నిశాంతి కోనసీమ జిల్లాలో పని చేసిన కాలంలో ప్రజల సమస్యలను అర్థం చేసుకుని వేగవంతంగా పరిష్కరించడంలో చూపిన చొరవ ప్రశంసనీయమని అన్నారు. అధికారిగా మాత్రమే కాకుండా, ఒక మంచి నాయకురాలిగా నిశాంతి జిల్లా అభివృద్ధికి చేసిన సేవలు చిరస్మరణీయమని దేవిశెట్టి శ్రీనివాసరావు పేర్కొన్నారు. పరిపాలనలో పారదర్శకత, ప్రజలకు అందుబాటు, సంక్షేమ కార్యక్రమాల సమర్థ అమలు వంటి అంశాలలో ఆమె చూపిన నిబద్ధత ఇతరులకు ఆదర్శంగా నిలిచిందన్నారు. అల్లూరి సీతారామరాజు జిల్లాలో కలెక్టర్గా బాధ్యతలు స్వీకరించిన తరువాత కూడా ఇదే ఉత్సాహంతో, సమర్థతతో పనిచేసి మరిన్ని అద్భుత విజయాలు సాధించాలని దేవిశెట్టి శ్రీనివాసరావు ఆకాంక్షించారు. ఆమె నాయకత్వంలో ఆ జిల్లా మరింత అభివృద్ధి సాధిస్తుందని విశ్వాసం వ్యక్తం చేశారు. ఈ సత్కార కార్యక్రమం ద్వారా జిల్లా రవాణాధికారి దేవిశెట్టి శ్రీనివాసరావు చూపిన గౌరవం, స్నేహపూర్వక వైఖరి ప్రత్యేకంగా నిలిచింది. అధికారుల మధ్య పరస్పర గౌరవం, ప్రోత్సాహం ఎంత ముఖ్యమో ఈ కార్యక్రమం స్పష్టంగా చూపించింది.

విశ్వం వాయిస్
అవినీతిపై- అక్షరసమరం...
తెలుగు దినపత్రిక VISWAMVOICE TELUGU DAILY

కాకినాడ
జిల్లా ఎడిషన్

ఆదివారం, 05 ఏప్రియల్ 2026
www.viswamvoice.com






### అక్రమ చర్చి నిర్మాణంపై

# అధికారులు చర్యలు.?



కాకినాడ రూరల్, విశ్వం వాయిస్ న్యూస్ : కాకినాడ రూరల్‌లో నిబంధనలను అతిక్రమించి చేపట్టిన చర్చి నిర్మాణంపై కాకినాడ జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు అందింది. వాకలపూడి పంచాయతీ పరిధిలోని చర్చి పేటలో జరిగిన ఈ నిర్మాణంపై రెడ్డి ఆశాజ్యోతి అనే మహిళ పిజిఆర్ఎస్‌లో గత సోమవారం ఫిర్యాదు చేయడంతో అధికారులు ఆమె ఇచ్చిన ఫిర్యాదును పరిశీలించారు. ఈ ఫిర్యాదుపై స్పందించిన కాకినాడ రూరల్ ఎంపిడిఓ సతీష్, వాకలపూడి గ్రామ పంచాయతీ కార్యదర్శి పాండురంగారావు శనివారం క్షేత్రస్థాయిలో పరిశీలన జరిపారు. పి.జి.ఆర్.ఎస్ ద్వారా అందిన ఫిర్యాదు మేరకు విచారణ చేపట్టామని అనుమతి పొందిన ప్లాన్‌కు విరుద్ధంగా నిర్మాణం జరిగినట్లు అధికారులు తెలిపారు. అక్రమంగా ప్లాన్ కి విరుద్ధంగా కట్టిన చర్చి యాజమాన్యానికి నోటీసులు జారీ చేసి, నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటామని ఫిర్యాదు చేసిన ఆమెకు తెలిపారు.

### జిల్లా కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా

# కలిసిన కడలి ఈశ్వరి



కాకినాడ రూరల్, విశ్వం వాయిస్ న్యూస్ : ఇటీవల కాకినాడ జిల్లాకు నూతనంగా పదవి బాధ్యతలు చేపట్టిన కలెక్టర్ ఎం.ఎన్.హరేంద్ర ప్రసాద్ (ఐఏఎస్)ను జనసేన పార్టీ సీనియర్ నాయకురాలు రాష్ట్ర పౌర సరఫరాల సంస్థ డైరెక్టర్ మరియు ఉభయ గోదావరి జిల్లాల కోఆర్డినేటర్ కడలి ఈశ్వరి మర్యాదపూర్వకంగా కలిశారు. ప్రజా సమస్యలపై చర్చించారు. ఆమె వెంట తనయుడు జనసేన నాయకులు కడలి శివ ఉన్నారు.

### పంచాయతీల ప్రత్యేక అధికారిగా


# బి.ఎల్.నరసింహం



కరప, విశ్వం వాయిస్ న్యూస్ : కరప మండల పరిపాలనాధికారి బి.ఎల్. నరసింహం, మండలంలోని జడ్ భావారం, సిరిపురం గ్రామ పంచాయతీలకు ప్రత్యేక అధికారిగా శనివారం బాధ్యతలు స్వీకరించారు. స్థానిక సంస్థల ఎన్నికలు జరిగి, కొత్త పాలకవర్గాలు వచ్చే వరకు పాలన సజావుగా సాగడానికి ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. ప్రభుత్వ పథకాల అమలు, పౌర సేవలు, అభివృద్ధి పనులు, పారిశుధ్యం, మంచినీటి సరఫరా వంటి మౌలిక సదుపాయాలను ఆయన పర్యవేక్షిస్తారు. ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పనిచేస్తానని, పెండింగ్‌లో ఉన్న పనులను వేగవంతం చేస్తానని నరసింహం ఈ సందర్భంగా హామీ ఇచ్చారు.

### మంత్రి వాసంశెట్టి సుభాష్ కుటుంబం

# కొరుపల్లి వారాహి అమ్మవారికి ప్రత్యేక పూజలు



కరప, విశ్వం వాయిస్ న్యూస్ : కాకినాడ జిల్లా కరప మండలం కొరుపల్లిలోని ప్రసిద్ధ కాశీ వారాహి అమ్మవారిని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ కుటుంబ సభ్యులు శనివారం దర్శించుకున్నారు. తాము సంకల్పించిన ఒక ముఖ్యమైన కార్యం దిగ్విజయంగా పూర్తి కావడంతో, గతంలో మొక్కుకున్న విధంగా అమ్మవారికి కృతజ్ఞతలు తెలుపుకోవడానికి మంత్రి సతీమణి, పిల్లలు, తల్లిదండ్రులు సకుటుంబంగా ఆలయానికి విచ్చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి తండ్రి వాసంశెట్టి సత్యం మాట్లాడుతూ, అమ్మవారి అపార కృప వల్లే తమ ఆశయం నెరవేరిందని, ఆ భక్తిభావంతోనే ఈ మొక్కు తీర్చుకుంటున్నట్లు ఆనందం వ్యక్తం చేశారు. రాజకీయ కార్యకలాపాల్లో నిరంతరం బిజీగా ఉండే మంత్రి కుటుంబం, ఇలా సమైక్యంగా ఆధ్యాత్మిక సేవలో గడపడం స్థానికులను విశేషంగా ఆకర్షించింది. ఆలయానికి చేరుకున్న వారికి ధర్మకర్త చిక్కాల దొరబాబు, ప్రధాన అర్చకులు చెరుకూరి సుబ్బన్న ఘనస్వాగతం పలికారు. శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించిన అనంతరం మంత్రి కుటుంబ సభ్యులకు అమ్మవారి శేష వస్త్రాలు, ప్రసాదాలను అందజేసి, పట్టుచీరతో గౌరవంగా సత్కరించారు. ఆలయ ప్రాంగణంలోని ప్రశాంతతకు ముగ్ధులైన కుటుంబ సభ్యులు, రాబోయే రోజుల్లో ఈ పుణ్యక్షేత్రం మరింత అభివృద్ధి చెందడానికి తమ వంతు పూర్తి సహకారాన్ని అందిస్తామని ఈ సందర్భంగా హామీ ఇచ్చారు.

# ఆరా తీశాకే అడ్మిషన్ తీసుకోండి

### ఉజ్బెకిస్థాన్‌లో వైద్య విద్యపై భారత్ హెచ్చరిక

మాస్కో, విశ్వం వాయిస్ న్యూస్ : ఉజ్బెకిస్థాన్‌లో వైద్య విద్యా కోర్సులో ప్రవేశం పొందాలనుకునే భారతీయ విద్యార్థులు ముందుగా తాము చేరదలుచుకున్న విశ్వవిద్యాలయ నేపథ్యం, ధ్రువపత్రాలను పరిశీలించుకోవాలని ప్రభుత్వం హెచ్చరించింది. ఫారిన్ మెడికల్ గ్రాడ్యుయేట్ లైసెన్షియేట్ (ఎఫ్ఎంజీఎల్) నిబంధనలను యూనివర్సిటీ పాటిస్తోందా? లేదా అన్నది కచ్చితంగా సరిచూసుకోవాలని సూచించింది. "భారత్, ఉజ్బెకిస్థాన్ మధ్య ద్వైపాక్షిక సంబంధాలు మరింతగా బలపడుతున్న నేపథ్యంలో అధిక సంఖ్యలో భారతీయ విద్యార్థులు ఆ దేశంలో ఎంబీబీఎస్ కోర్సులో ప్రవేశం పొందుతున్నారు. దీంతో ఉజ్బెకిస్థాన్‌లో కొత్త విశ్వవిద్యాలయాలు పుట్టుకొచ్చాయి. అందుకే విశ్వవిద్యాలయ నేపథ్యంపై ఆరా తీసి పూర్తిగా సంతృప్తి చెందాకే ప్రవేశం పొందాలి. ఏజెంట్ల మాయమాటలు నమ్మి మోసపోవద్దు" అని భారత ప్రభుత్వం హెచ్చరించింది.

### చంద్రబాబుకు దేవుడి ప్రతిష్ఠ కన్నా

# రాజకీయమే ముఖ్యం...!

**చంద్రబాబుకి మంచి బుద్ధిని ప్రసాదించాలి - బీఆర్.నాయుడుని వెంటనే తొలగించాలి**
**టీటీడీ, రాష్ట్ర ప్రతిష్ట దిగజారుస్తున్నారు - వైసీపీ ఇంచార్జి ముద్రగడ గిరిబాబు ఆరోపణ**



శంఖవరం, విశ్వం వాయిస్ న్యూస్ : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబుకు దేవునికన్నా రాజకీయమే ముఖ్యం... తిరుమల తిరుపతి దేవస్థాన పవిత్రతను దెబ్బతీస్తున్న చంద్రబాబుకు కలియుగ దైవమైన వెంకటేశ్వరస్వామి మంచి బుద్ధిని ప్రసాదించాలని ప్రత్తిపాడు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి ముద్రగడ గిరిబాబు మీడియాతో అన్నారు. ఈ మేరకు చంద్రబాబుకు మంచి బుద్ధిని ప్రసాదించాలని కోరుతూ కాకినాడ జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గం ప్రత్తిపాడు మండలం ఉత్తరకంచిలోని పద్మావతి అలివేలు మంగా సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి వారి ఆలయంలో గిరిబాబు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ శ్రేణులు శనివారం ప్రత్యేక పూజలను నిర్వహించారు. ముందుగా గిరిబాబుకి స్థానిక వైసీపీ నాయకుడు, నియోజకవర్గ గ్రీవెన్స్ సెల్ అధ్యక్షులు రామిశెట్టి దొరబాబు ఘన స్వాగతం పలికారు. ఆలయం బయట ప్లకార్డులను ప్రదర్శించి టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడుని ఆ పదవి నుంచి సస్పెండ్ చెయ్యాలని డిమాండ్ చేస్తూ నిరసన ప్రదర్శన చేపట్టారు. ఈ సందర్భంగా గిరిబాబు మాట్లాడుతూ ప్రపంచ స్థాయిలోనే అత్యంత పవిత్రమైన తిరుమల తిరుపతి దేవస్థాన పవిత్రతను కాపాడుకోవడమే లక్ష్యంగా వైసీపీ పార్టీ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు ఆయన తెలిపారు. బి.ఆర్.నాయుడు రాసలీలలు, అనైతిక కార్యక్రమాలు, ప్రవర్తన, ఆయన మాట్లాడుతూ ఉపయోగిస్తున్న భాష కారణంగా టీటీడీ అప్రతిష్ట పాలవు తోందని గిరిబాబు అన్నారు. ఫలితంగా కోట్లాది మంది భక్తుల మనోభావాలను దెబ్బతీస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం కూటమి పాలనలో చంద్రబాబు తన రాజకీయం లబ్ధికోసం హిందువుల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసి టీటీడీ పవిత్రతను దిగజార్చు తున్నారని పేర్కొన్నారు. చంద్రబాబుకు తన రాజకీయం కన్నా దేవుడేమీ ముఖ్యం కాదన్నారు. చంద్రబాబు తక్షణం చిత్తశుద్ధితో బీఆర్ నాయుడుని సస్పెండ్ చెయ్యాలని డిమాండ్ చేశారు. అనంతరం ఆలయంలో నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. వైసీపీ రాష్ట్ర అధిష్టానం పిలుపు మేరకు నియోజకవర్గ పార్టీ ఇన్చార్జి ముద్రగడ గిరిబాబు నేతృత్వంలో వైసీపీ శ్రేణులతో కలిసి నిర్వహించిన ఈ నిరసన కార్యక్రమంలో వైసీపీ రాష్ట్ర యూత్ కార్యదర్శి బదిరెడ్డి గోవింద్, మండల పార్టీ అధ్యక్షులు రామిశెట్టి నాని, జడ్పీటీసీలు బెహరా రాజ రాజేశ్వరి, గొల్లు చిన దివాణం, వైస్ ఎంపీపీ బంక్ శ్రీను, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ గొల్లపల్లి కాశీ విశ్వనాథ్, ఏలేశ్వరం మండల పార్టీ అధ్యక్షులు గొల్లపల్లి సురేష్, రాష్ట్ర వాణిజ్య విభాగ కార్యదర్శి అడపా సోమేశ్, జిల్లా కార్య నిర్వాహక కార్యదర్శి బీశెట్టి అప్పలరాజు, తుని నియోజకవర్గ పరిశీలకులు వాసిరెడ్డి జమీలు, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షులు శెట్టిబత్తుల కుమార్‌రాజా, జిల్లా ఆర్టిఐ అధ్యక్షులు గౌతు స్వామి, అన్నవరం దేవస్థానం ట్రస్ట్ బోర్డు మాజీ సభ్యుడు దళే చిట్టిబాబు, నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షులు గుడాల వెంకటరత్నం, నియోజకవర్గ యువజన విభాగం అధ్యక్షులు సకురు గుర్రాజు, నియోజకవర్గ సోషల్ మీడియా అధ్యక్షులు గొంతిరెడ్డి సతీష్, మండల మహిళా విభాగం అధ్యక్షురాలు బులిపే దేవి, దాడిశెట్టి చక్రధర్, పిల్లా కొండలరావు, నేదుళ్ల శ్రీను, నరాల శ్రీను, వీరంరెడ్డి రామకృష్ణ, జువ్విన వీర్రాజు, శెట్టి సత్తిబాబు, గుమ్ములూరి వెంకటరమణ, యువ నాయకులు రామకుర్తి సత్యరాజా, బుద్ధ గణేష్, భీశెట్టి స్వామి, గౌతు గంగాధర్, దేవ లక్ష్మణ్, చందక నాని తదితరులు పాల్గొన్నారు.

# వేళంగిలో వైభవంగా జరిగిన గుడ్ ఫ్రైడే వేడుకలు



### ఏసుక్రీస్తు జీవితమే గొప్ప సందేశం.. ఫాదర్ ప్రభాకర్...



కాకినాడ రూరల్, విశ్వం వాయిస్ న్యూస్ : లోక రక్షణ కోసం, తల్లి గర్భన జన్మించిన ఏసుక్రీస్తు, ప్రజలను చెడు నుంచి మంచి వైపు నడిపించడానికి శ్రమించారు. దైవ కుమారుడైన ఆయన సాధారణ మనిషిగా భూమి పైకి వచ్చి మనుషుల కష్టాలను అనుభవించి, పాపాలను చేస్తున్న వారిని సన్మార్గంలో నడిపించడానికి ప్రయత్నించారు. అటువంటి ఆయనను కొంతమంది దుర్మార్గులు కలవరి కొండపై సిలువ వేయడం జరిగింది. ఏసుక్రీస్తు శిలువ వేయబడిన, మరణించిన రోజున స్మరించుకుంటూ క్రైస్తవులు పవిత్రమైన శుక్రవారం రోజును గుడ్ ఫ్రైడేగా జరుపుకుంటారు. లోక రక్షణ కోసం తన ప్రాణాలను అర్పించినదైవ కుమారుడు, ఏసుక్రీస్తు శిలువ మరణాన్ని స్మరించుకుంటూ భక్తులు ప్రత్యేక ప్రార్థనలు చేస్తారు. పవిత్ర శుక్రవారం సందర్భంగా క్రైస్తవులు ఉపవాసాలు ఉంటారు. ఈ గుడ్ ఫ్రైడే వేడుకలను కరప మండలం, వేళంగి రోమన్ క్యాథలిక్ మిషన్ ఆర్.సి.యం చర్చిలో ఫాదర్ ప్రభాకర్ ఆధ్వర్యంలో వైభవంగా జరుపుకున్నారు. క్రీస్తు శిలువ దారిని ప్రదర్శించే ఊరేగింపు అందర్నీ ఆకట్టుకుంది. చర్చిలో ఉన్న క్రైస్తవులందరూ ఉపవాసంతో భక్తిశ్రద్ధలతో గుడ్ ఫ్రైడే వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ఫాదర్ ప్రభాకర్ ప్రసంగిస్తూ పాప విముక్తి కోసం తన ప్రాణాలను అర్పించిన ఏసుక్రీస్తు త్యాగాన్ని స్మరించుకుంటూ, అందరికీ పవిత్రమైన గుడ్ ఫ్రైడే శుభాకాంక్షలు తెలియజేశారు. తండ్రి వీరు ఏమి చేయుచున్నారు వీరికి తెలియదు కనుక వీరిని క్షమించు అన్న ఏసుక్రీస్తు మాటలు నేటి సమాజానికి ఆదర్శంగా ఉన్నాయని, ద్వేషాన్ని ప్రేమతో, హింసను క్షమతో గెలవాలని చాటి చెప్పిన రోజే ఈ గుడ్ ఫ్రైడే అని, ఏసుక్రీస్తు జీవితమే మనకు గొప్ప సందేశం అని, సిలువపై యేసు పలికిన ఏడు చివరి మాటలను క్రైస్తవ సోదరులకు అద్భుతంగా వివరించారు. గుడ్ ఫ్రైడే సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలను చేశారు. ఈ కార్యక్రమంలో చర్చి కమిటీ వారు, సంఘ సభ్యులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# ప్రతిభకు పట్టం కట్టిన కల్చరల్ అండ్ స్పోర్ట్స్ వీక్' పోటీలు

### విద్యార్థి విజేతలకు బహుమతుల ప్రదానం - విజయవంతంగా ముగిసిన పిఎంశ్రీ పోటీలు







శంఖవరం, విశ్వం వాయిస్ న్యూస్ : పాఠశాల విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకత, నాయకత్వ లక్షణాలు, జీవిత నైపుణ్యాలను పెంపొందించడం, ఆధునిక విద్యతో పాటు సంస్కృతిని ప్రోత్సహించడం, పాఠశాలల్లో విద్యార్థుల సమగ్ర వికాసం, నాయకత్వ లక్షణాలు, హాజరును పెంచే బహుళ లక్ష్యాలతో కాకినాడ జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గం మండల కేంద్రం శంఖవరంలోని పిఎంశ్రీ జిల్లా ప్రజా పరిషత్తు ఉన్నత పాఠశాలలో వారం రోజుల పాటు నిర్వహించిన ప్రత్యేక 'కల్చరల్ అండ్ స్పోర్ట్స్ వీక్' పోటీల సంబరాలు శనివారంతో విజయవంతంగా ముగిసాయి. ఈ కళా, సాంస్కృతిక కార్యక్రమాల్లో వివిధ విభాగాల పోటీల్లో విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా పాలు పంచుకుని తమ కళా నైపుణ్యాన్ని ప్రదర్శించారు. ఈ ?స్పోర్ట్స్ వీక్ సందర్భంగా విద్యార్థులకు వాలీబాల్, కబడ్డీ, అథ్లెటిక్స్ (పరుగు పందాలు, హై జంప్, లాంగ్ జంప్, డిస్కస్ త్రో, షాట్ పుట్) వంటి ఆటల పోటీలను నిర్వహించారు. విద్యార్థులు పూర్తి క్రీడా స్ఫూర్తితో, ఉత్సాహంగా ఈ పోటీల్లో పాల్గొన్నారు. ఈ క్రీడా పోటీలు విద్యార్థులను ఉర్రూతలూగించాయి. ఈ కార్యక్రమాలు కేవలం చదువుకే పరిమితం కాకుండా, విద్యార్థుల శారీరక, మానసిక ఉల్లాసానికి దోహదపడ్డాయి.

**సాంస్కృతిక ప్రదర్శనలతో అలరించిన విద్యార్థులు**

భారతదేశ కళా, సాంస్కృతిక వైభవ వైవిధ్యాన్ని పరిచయం చేస్తూ విద్యార్థులు ప్రదర్శించిన వివిధ రాష్ట్రాల నృత్య కళా ప్రదర్శనలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఆంధ్రప్రదేశ్ కూచిపూడి, తమిళనాడు భరతనాట్యం, మహారాష్ట్ర లావణి, పంజాబ్ భాంగ్రా, కేరళ కథాకళి, ఉత్తరప్రదేశ్ కథక్ వంటి నృత్యాలను ఆయా రాష్ట్రాల సంప్రదాయ ఆహార్యంతో అత్యద్భుతంగా విద్యార్థులు ప్రదర్శించారు. కళ, కళా నైపుణ్యం ప్రతిభ విభాగంలో విద్యార్థులు పెయింటింగ్, డ్రాయింగ్, క్లే మేకింగ్, కొల్లాజ్ మేకింగ్, స్కల్ప్చర్ మేకింగ్ వంటి వాటిలో తమ సృజనాత్మకతను ప్రదర్శించారు. తమ నైపుణ్యాన్ని వెలికి తీస్తూ విద్యార్థులు తయారు చేసిన వివిధ వస్తు ప్రదర్శనలు ఆహుతులను మనసును ఆకర్షించాయి. విద్యార్థుల నుంచి ఇంతటి ప్రతిభా నైపుణ్యాలను వెలికి తీయడానికి, తగు రీతిలో తర్ఫీదు ఇవ్వడానికి విద్యార్థుల విజయానికి సుబ్రహ్మణ్యం, సూర్యావతి, మంగాదేవి, హరికృష్ణ, కిషోర్, జగదాంబ, శ్రీదేవి, ఉపాధ్యాయ బృందం ఎంతగానో కృషి చేసింది. ముఖ్య అతిథిగా విచ్చేసిన మండల విద్యాశాఖాధికారి ఎస్.వీ.రమణ ప్రసంగిస్తూ విద్యార్థుల ప్రదర్శనను ప్రశంసించారు. భారతీయ సంస్కృతీ సంప్రదాయాల విశిష్టతను పాఠశాల ప్రధాన ఉపాధ్యాయులు బొమ్మిశెట్టి జగ్గారావు విద్యార్థులకు వివరించారు. ఈ కళా, సాంస్కృతిక ప్రదర్శనల ప్రతిభావంతులైన విజేతలకు బహుమతులను ముఖ్య అతిథి మండల విద్యాశాఖాధికారి సూరిశెట్టి వెంకట రమణ ప్రదానం చేశారు.

### రాజధాని అమరావతికి

# చట్టబద్ధత చారిత్రాత్మకం

### కత్తిపూడిలో వెన్నా శివ ఆధ్వర్యంలో సంబరాలు



శంఖవరం, విశ్వం వాయిస్ న్యూస్ : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రాజధాని అమరావతి భావి తరాల అభివృద్ధికి కేంద్రబిందువుగా మారబోతోంది... ఇది కేవలం రాజధాని మాత్రమే కాదు... ఆంధ్రప్రదేశ్ భవిష్యత్తుకు ప్రతీక... రాష్ట్ర ప్రజల ఆకాంక్షల ప్రకారం అమరావతినే శాశ్వత రాజధానిగా కొనసాగించాలనే సంకల్పానికి పార్లమెంట్ మద్దతు ఇవ్వడం చారిత్రాత్మకమని రాష్ట్ర రోడ్డు డెవలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ వెన్నా ఈశ్వరుడు (శివ) పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతికి చట్టబద్ధత కల్పించే బిల్లును ఉభయ సభల్లో ఆమోదించడంతో కాకినాడ జిల్లా శంఖవరం మండలం కత్తిపూడిలో శివ ఆధ్వర్యంలో తెలుగు దేశం పార్టీ శ్రేణులు శుక్రవారం రాత్రి దీపాలను వెలిగించి సంబరాలు చేసుకున్నారు. స్వీట్లను పంచుకుని తమ సంతోషాన్ని ప్రకటించుకున్నారు. ఈ సందర్భంగా వెన్నా శివ మాట్లాడుతూ రాష్ట్ర ప్రజల దీర్ఘకాలిక ఆశయానికి కేంద్ర ప్రభుత్వం న్యాయం చేసిందని పేర్కొన్నారు. అమరావతి రాజధాని బిల్లును ఉభయ సభల్లో ఆమోదించడంతో రాష్ట్ర ప్రజలంతా ఆనందోత్సాహాల్లో మునిగిపోయారు అన్నారు. ఈ బిల్లుకు మద్దతు తెలిపిన అన్ని రాజకీయ పార్టీలు, ఎంపీలకు హృదయపూర్వక ధన్యవాదాలు తెలుపు తున్నామని, అమరావతికి నిరంతర సహకారం అందిస్తున్న ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షాకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తున్నా మన్నారు. అమరావతికి చట్టబద్ధత కల్పించడాన్ని కొంత మంది జీర్ణించుకోలేక విమర్శలు చేస్తున్నారని, అలాంటి వారికి ప్రజలే తగిన సమాధానం ఇస్తారని అన్నారు. అమరావతి ఖ్యాతిని అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లే దిశగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అపార అనుభవంతో అభివృద్ధి పనులు వేగంగా కొనసాగిస్తున్నారని తెలిపారు. సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, యువనేత నారా లోకేష్ ల కృషి ఫలితంగానే దేశంలోని పలు పార్టీలు అమరావతికి మద్దతు తెలిపాయని వెన్నా శివ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# ఇరాన్‌కు గడువు 48 గంటలే..

**హర్మూజ్ జలసంధిని తెరవకపోతే విధ్వంసమే**
**ఇరాన్‌కు ట్రంప్ అల్టిమేటం**
**బుషెహర్ అణు విద్యుత్కేంద్రం సమీపంలో క్షిపణి దాడి**
**దుబాయ్‌లో ఒరాకిల్ హెడ్‌క్వార్టర్స్‌పైకి ఇరాన్ డ్రోన్**
**మరో అమెరికా విమానం, రెండు బ్లాక్‌హాక్ హెలికాప్టర్ల కూల్చివేత**
**కూలిన విమాన పైలట్ కోసం అమెరికా, ఇరాన్ జల్లెడ**

వాషింగ్టన్, టెల్ అవీవ్, విశ్వం వాయిస్ న్యూస్ : హర్మూజ్ జలసంధి విషయంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి హూంకరించారు. 48 గంటల్లోగా జలసంధిని తెరవడమో, ఒప్పందానికి రావడమో జరగకపోతే విధ్వంసకర పరిణామాలు ఎదుర్కొనేందుకు సిద్ధపడాలని శనివారం ఇరాన్‌ను హెచ్చరించారు. "సమయం మించిపోతోంది. మీరు స్పందించకపోతే ప్రత్యక్ష నరకాన్ని చూస్తారు. ఇక మిమ్మల్ని ఆ దేవుడే కాపాడాలి. నేను మొదట ఇచ్చిన 10 రోజుల గడువు వేగంగా ముగుస్తోంది. మీరు ప్రళయాన్ని, నరకాన్ని చూడటానికి మిగిలింది రెండ్రోజులే" అని 'ట్రూత్ సోషల్'లో తేల్చిచెప్పారు. తొలుత విధించిన గడువు సోమవారంతో ముగుస్తుండటంతో అల్టిమేటం జారీచేశారు. ఇరాన్‌లో తమ యుద్ధవిమానం కూల్చివేతకు గురికావడంపై ట్రంప్ అధికార యంత్రాంగం ఎలాంటి అధికారిక ప్రకటన చేయకపోయినా ఈ అంశంపై మాత్రం నేరుగా అధ్యక్షుడు స్పందించారు. ఇదిలాఉండగా అమెరికాకు చెందిన మరో విమానాన్ని(ఏ-10), రెండు బ్లాక్‌హాక్ హెలికాప్టర్లను శనివారం కూల్చివేశామని 'ఇరాన్ రివల్యూషనరీ గార్డ్' ప్రకటించింది.

**పర్వత ప్రాంతాల్లో వెతుకులాట**

తమ యుద్ధ విమానాన్ని (ఎఫ్-15ఈ స్ట్రైక్ ఈగల్‌ను) శుక్రవారం ఇరాన్ కూల్చివేయడంతో గల్లంతైన పైలట్ కోసం అమెరికా ముమ్మరంగా అన్వేషిస్తోంది. ఇరాన్ కూడా ఇదే అంశంపై దృష్టి సారించింది. 'శత్రుదేశ పైలట్' ఆచూకీ చెప్పినవారికి తగిన పారితోషికం ఇస్తామని ప్రకటించింది. నైరుతి ఇరాన్‌లోని పర్వత ప్రాంతాల్లో రెండు దేశాలూ గాలింపు చర్యలు చేపట్టాయి. కూలిన విమానాలపై శ్వేతసౌధం గానీ, రక్షణశాఖ ప్రధాన కార్యాలయం గానీ అధికారిక ప్రకటన చేయలేదు. ఒక విమానం కూల్చివేతకు గురైనట్లు సమాచారం అందిందని మాత్రం పెంటగాన్ తెలిపింది. సిబ్బందిలో ఒకరిని రక్షించగలిగామని, రెండోవారి ఆచూకీ తెలియడం లేదని 'చట్టసభ సాయుధ బలగాల కమిటీ'కి సమాచారం ఇచ్చింది. ఏం జరిగినా దాని ప్రభావం చర్చలపై పడబోదని ట్రంప్ స్పష్టంచేశారు. అమెరికాకు చెందిన ఏ-10 యుద్ధ విమానాన్ని శనివారం పర్షియన్ గల్ఫ్‌లో ఇరాన్ రక్షణ బలగాలు కూల్చివేసినట్లు ఇరాన్ అధికార టీవీ ఛానెల్ ప్రకటించింది.

**ఐఏఈఏ ఆందోళన**

మరోవైపు ఇరాన్‌లోని బుషెహర్ అణు విద్యుత్కేంద్రం లక్ష్యంగా శనివారం క్షిపణి దాడి చోటుచేసుకుంది. ఇటీవలి కాలంలో ఇది నాలుగో ఘటన అని 'అంతర్జాతీయ అణుశక్తి సంస్థ' (ఐఏఈఏ) ఆందోళన వ్యక్తంచేసింది. క్షిపణి శకలం తగిలి భద్రతా సిబ్బందిలో ఒకరు చనిపోయారని వెల్లడించింది. భవనం దెబ్బతిందని, రేడియో ధార్మికత మాత్రం వెలువడలేదని స్పష్టం చేసింది. ఇరాన్‌లో ప్రస్తుతం పనిచేస్తున్న ఏకైక విద్యుత్ ప్లాంటు ఇదే. అణు భద్రత, రక్షణకు కట్టుబడి ఉండటం అత్యంత ప్రాధాన్యాంశమని ఐఏఈఏ డైరెక్టర్ జనరల్ రాఫెల్ మరియానో గ్రాస్సీ పేర్కొన్నారు. అణుముప్పును నివారించేందుకు అత్యంత సంయమనం పాటించాలని పిలుపునిచ్చారు. బుషెహర్ లక్ష్యంగా జరిగిన దాడిని రష్యా తీవ్రంగా ఖండించింది.

**మండిపడ్డ ఇరాన్ అణుశక్తి సంస్థ**

ఐఏఈఏపై ఇరాన్ ఆరోపణలు చేసింది. దాడులను ఆ సంస్థ ఖండించకపోవడమంటే వాటిని చేస్తున్న దేశాలకు సహకారం అందించడమేనని విమర్శించింది. ఇది అంతర్జాతీయ సమాజంలో నమ్మకాన్ని దెబ్బతీస్తోందని వ్యాఖ్యానించింది. శాంతియుత ప్రయోజనాలకు ఉపయోగిస్తున్న అణుశక్తి కేంద్రాలపై దాడులను ఖండించాలని కోరింది. శనివారం పలుచోట్ల క్షిపణులు, డ్రోన్ల దాడులు కొనసాగాయి. దుబాయ్‌లోని ఒరాకిల్ ప్రధాన కార్యాలయానికి ఒక డ్రోన్ పాక్షికంగా నష్టం కలిగించింది. ఇరాన్‌లోని మెహ్రాన్‌లో పెట్రోరసాయనాల సముదాయంపైనా అమెరికా, ఇజ్రాయెల్ యుద్ధ విమానాలు బాంబులు కురిపించాయి.



# కష్టం అంటే అండగా నిలిచే నాయకుడు గణేష్

**కెఆర్‌జె రాజేష్ ఆధ్వర్యంలో జక్కంపూడి గణేష్ జన్మదిన వేడుకలు**
**హాజరైన మాజీమంత్రి చెల్లుబోయిన వేణు - భవిష్యత్తులో రాజకీయాల్లో ఉన్నత పదవి చేపడతారని ఆకాంక్ష**





**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** కార్యకర్తలకు గాని, అభిమానులకు గాని కష్టం వస్తే అండగా నిలబడే నాయకుడు జక్కంపూడి గణేష్ అని మాజీమంత్రి, తూర్పుగోదావరి జిల్లా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చెల్లుబోయిన వేణు గోపాలకృష్ణ అన్నారు.శనివారం సాయంత్రం వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు కేఆర్జే రాజేష్ వారి మిత్ర బృందం ఆధ్వర్యంలో జక్కంపూడి గణేష్ జన్మదినం వేడుకలు ఎ వి అప్పారావు రోడ్డులోని మహాలక్ష్మి అమ్మవారి ఆలయ సమీపంలో ఉన్న కురుక్షేత్ర అపార్ట్మెంట్ వద్ద అట్టహాసంగా జరిగాయి. తొలిత జక్కంపూడి గణేష్ అందుబాటులో లేకపోవడం తో ఆయన కటౌట్ కి భారీ గజమాలను వేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆయన ఫ్లెక్సీకి పాలాభిషేకం చేసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా వేణుగోపాలకృష్ణ మాట్లాడుతూ దివంగత నేత జక్కంపూడి రామ్మోహన్రావు నాయకత్వ లక్షణాలను పుణికి పుచ్చుకొని జక్కంపూడి రాజా, జక్కంపూడి గణేష్ ఇరువురు ప్రజా సమస్య ల కోసం ప్రతి క్షణం పనిచేస్తున్నారని అన్నారు. తండ్రి బాటలోనే పోరాటానికి మారుపేరుగా గణేష్ నిలిచారని తప్పనిసరిగా త్వరలోనే ఆయనకు మంచి రాజకీయ భవిష్యత్తు ఉంటుందని ఆయన ఆకాంక్షించారు. ఈ జన్మదిన వేడుకలకు యువకులు భారీగా చేరుకున్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, జక్కంపూడి గణేష్ అభిమానుల సమక్షంలో చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ మాజీ నగర అధ్యక్షులు నందెపు శ్రీనివాస్, చాంబర్ ఆఫ్ కామర్స్ మాజీ అధ్యక్షులు అశోక్ కుమార్ జైన్, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి గోండేశి శ్రీనివాసులు రెడ్డి, మాజీ కార్పొరేటర్లు మాజీ కార్పొరేటర్లు మింది నాగేంద్ర, బొంత శ్రీహరి, మానే దొరబాబు,పార్టీ నాయకులు నీలి ఆనంద్, తగరం సోము, కందకం శ్రీను, అడపా అనిల్, ముద్దాల అను, పిల్లా బాబీ, అడపా రాజు, మెండా రాజేష్,ముప్పన శ్రీనివాస్, కోడికోట సత్తిబాబు, డబ్బింగ్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# అంబరాన్నంటిన జక్కంపూడి గణేష్ జన్మదిన వేడుకలు

**తగరం సోము ఆధ్వర్యంలో భారీగా యువకుల రక్తదానం - సోదరుడి జన్మదిన వేడుకల్లో రక్తదానం చేసిన మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా**



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ యువజన విభాగం నాయకులు జక్కంపూడి గణేష్ జన్మదిన వేడుకలు నగరంలో అత్యంత ఘనంగా నిర్వహించారు. వైఎస్ఆర్సిపి యువజన విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తగరం సోము ఆధ్వర్యంలో సంబరాలు అంబరాన్నంటాయి. తమ అభిమాన నాయకుడి జన్మదిన వేడుకను పుర స్కరించుకొని సోము ఆధ్వర్యంలో యువకులు భారీగా రక్తదానం చేశారు. డాక్టర్ వైయస్సార్ జక్కంపూడి రామ్మోహన్‌రావు బ్లడ్ సెంటర్ సిబ్బంది రక్తాన్ని సేకరించారు. ఆనాల వెంకట అప్పారావు రోడ్‌లోని జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మాజీ ఎమ్మెల్యే యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షులు జక్కంపూడి రాజా హాజరయ్యారు. తన తమ్ముడి పుట్టినరోజు సందర్భంగా జక్కంపూడి రాజా రక్తదానం చేసి యువకులందరికి స్ఫూర్తిగా నిలిచారు. రక్తదానం చేసేందుకు వచ్చిన ప్రతి యువకునితో ఆయన మాట్లాడి అభినందనలు తెలియజేశారు.తన సోదరుడు జక్కంపూడి గణేష్ పుట్టినరోజు సందర్భంగా యువకులు భారీగా చేరుకుని రక్తదానం చేయడం చాలా సంతోషమని అన్నారు. ఇంత చక్కటి కార్యక్రమాన్ని నిర్వహించిన తగరం సోమును ఆయన అభినందించారు. రక్తదానంపై ఉన్న అపోహలు వీడిపోవాలని అన్నారు. రక్తదానం చేయడంవల్ల ఆపదలో ఉన్న ప్రతి ఒక్కరి ప్రాణాలు కాపాడవచ్చు అన్నారు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి కష్ట కాలంలో జక్కంపూడి గణేష్ విలువైన సేవలు అందించారని అన్నారు. నమ్ముకున్న కార్యకర్తలు,అభిమానుల కోసం ఎంతవరకైనా వెళ్లే నాయకత్వం గణేష్ సొంతమని అదే ఆయన ఎదుగుదలకు కారణమన్నారు. తగరం సోము మాట్లాడుతూ ఏప్రిల్ నెలలో భారత రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్, మాజీ ఉప ప్రధాని బాబు జగజ్జీవన్ రామ్ జన్మించారని అలాగే యువ నాయకులు జక్కంపూడి గణేష్ ఇదే నెలలో జన్మించారని అన్నారు. తప్పనిసరిగా ఆయన ఒక ఉన్నతమైన రాజకీయ స్థానంలో త్వరలోనే నిలబడతారని ఆయన అన్నారు.ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నగర మాజీ అధ్యక్షులు నందెపు శ్రీనివాస్,నల్లా అజయ్,అడపా అనిల్, కోడికోట సత్తిబాబు, బొంతా శ్రీహరి, ఇసుకపల్లి శ్రీనివాస్, ఎస్విజి మార్కెట్ కమిటీ నాయకులు మద్దాల రవిశంకర్ తదితరులు పాల్గొన్నారు.

**బిఆర్ నాయుడును వెంటనే**

# టీటీడీ చైర్మన్ పదవి నుండి తొలగించాలి

**- వైకాపా ఆధ్వర్యంలో కనకదుర్గ అమ్మవారి దేవాలయంలో ప్రత్యేక పూజలు**



**రాజమహేంద్రవరం రూరల్, విశ్వం వాయిస్ న్యూస్ :** తూర్పుగోదావరి జిల్లా రాజమండ్రి రూరల్ నియోజకవర్గం స్థానిక బాలాజీపేట సెంటర్ వద్ద తూర్పుగోదావరి జిల్లా వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చెల్లుబోయిన వేణు గోపాల కృష్ణ అధ్యక్షతన టీటీడీ చైర్మన్ బిఆర్ నాయుడు వ్యవహార శైలిపై ఆయన్ను వెంటనే టీటీడీ చైర్మన్ పదవి నుండి తొలగించాలని వైఎస్ఆర్సిపి ఆధ్వర్యంలో ప్రముఖ కనకదుర్గ అమ్మవారి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామంలోని కనకదుర్గమ్మ ఆలయంలో కొబ్బరికాయలు కొట్టి ప్రత్యేక పూజలు నిర్వహించారు. చెల్లుబోయిన వేణు గోపాల కృష్ణ మాట్లాడుతూ బిఆర్ నాయుడు అనైతిక కార్యకలాపాలు, ఆయన వ్యవహార శైలితో టీటీడీ పవిత్రతను దెబ్బ తీస్తున్నాడని ఆయనకు మంచి బుద్ధి ప్రసాదించాలని ప్రత్యేక పూజలు నిర్వహించారు. బిఆర్ నాయుడు టీటీడీ చైర్మన్ పదవి నుంచి వెంటనే తొలగించి టిటిడి పవిత్రతను కాపాడాలని వైఎస్ఆర్సిపి నాయకుల డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శిలు గోందేశీ శ్రీనివాసరెడ్డి, నక్క రాజబాబు, గిరిజాల బాబు, మింది నాగేంద్ర, డబ్బింగ్ రమేష్,బొప్పన సుబ్బారావు, చెరుకూరి సత్యనారాయణ,పెయ్యల రాజేష్, చాప రాజా, చింతపర్తి రాంబాబు, పుచ్చ గోవింద్ రెడ్డి, బొమ్మ శీను, పగడం లక్ష్మణరావు, దేవులపల్లి సరిత రాణి, సయ్యద్ రుఖియా, వెలగల కళ్యాణి రెడ్డి, పట్టపగలు వెంకట లక్ష్మి, పసుపులేటి దేవి, కోమిరిశెట్టి ధనమ్మ, పుచ్చ ప్రసన్న,సద్గుణ రామారెడ్డి,చోల్లంగి సత్యగిరి, దాసరి ధర్మ,ఓడూరి రామకృష్ణ, అయినవిల్లి వెంకటేశ్వర రావు,మోత పావన మూర్తి,చిలుకూరి రామకృష్ణ,పున్నమ్మరాజు వీరాజు,కంభం సుబ్బారెడ్డి, దాకే శ్రీను,పరిమళ నాని, పరిమళ బాబీ, కోటిపల్లి రవి,బీధం రాజు, చీరా రాజు, నాగిరెడ్డి మోహన్, తోడేటి రాజా, తోడేటి రాహుల్, సర్కార్ బాషా, కోల్లి వెంకటరత్నం, మరదాపు శేఖర్, శిరసపల్లి శంకరరావు, దారపు రామకృష్ణ రెడ్డి,కడలి రాంబాబు, కోల్లి నానీబాబు, తదితరులు పాల్గొన్నారు.

## బిజెపి కార్యాలయంలో 'ప్రజావారధి'

**- పలు అంశాలపై వచ్చిన విజ్ఞాపనలు**



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** 'మీ సమస్య...మా బాధ్యత' అనే నినాదంతో ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధిగా నిలుస్తూ ప్రజా సమస్యల పరిష్కారం దిశగా భారతీయ జనతా పార్టీ రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న 'జనతా వారధి' కార్యక్ర మాన్ని స్థానిక క్వారీ ఏరియాలోని పార్టీ జిల్లా కార్యాలయంలో శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నర్సపల్లి హారిక పాల్గొని ప్రజల నుండి వినతులను స్వీకరించారు. గ్రామాల్లో మంచి నీటి సమస్యలు, పాలమూరులో డ్రైనేజీ, రోడ్లు, సిటీఆర్ రోడ్‌లో పెరిగిన దొంగ తనాలు, వికలాంగులు పింఛన్ల తదితర సమస్యలపై పలు వినపత్రాలు వచ్చాయి. ప్రజా సమస్యల పరిష్కా రమే లక్ష్యంగా ఈ కార్యక్రమం కొనసాగు తోందని అడబాలరామకృష్ణ తెలిపారు. ప్రజాసేవే పరమావధిగా, ప్రతి సమస్యకు పరిష్కారం చూపే దిశగా నిరంతరం భారతీయ జనతా పార్టీ కృషి చేస్తుందని తెలిపారు.ప్రజా వారధిలో వచ్చిన సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం చేస్తామన్నారు. కార్యక్రమ జోనల్ ఇన్చార్జ్ బొమ్మల దత్తు, రాష్ట్ర నాయకులు, జనతా వారధి జిల్లా కన్వీనర్ శివరామ కృష్ణంరాజు, యానాపు ఏసు, పడాల హత్తి రామ్, డాక్టర్ అనురాధ అడబాల రామకృష్ణ, కాలేపు సత్య సాయిరాం,వీరా వీరాంజనేయులు జిల్లా నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# భర్తతో గొడవపడి ఆత్మహత్యాయత్నం చేసిన మహిళ

**ప్రాణాలు కాపాడిన జిల్లా శక్తి టీం**



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** భర్తతో గొడవపడి ఆత్మహత్యాయత్నం చేసిన ఒక మహిళ ప్రాణాలను తూర్పుగోదావరి జిల్లా శక్తి టీం కాపాడి ప్లజల ప్రశంసలు అందుకుంది. ఈ ఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి.పుష్కర్ ఘాట్ వద్ద శుక్రవారం సాయంత్రం శక్తి టీంలు పెట్రోలింగ్ చేస్తూ శక్తి యాప్స్ డౌన్లోడ్ చేయిస్తూ ఉండగా, కొంతమంది వ్యక్తులు పుష్కర్ ఘాట్ లో ఒక స్త్రీ ఆత్మహత్య ప్రయత్నం చేస్తున్నట్లు తెలిపారు. వెంటనే స్పందించిన శక్తి టీం సభ్యులు ఆ ప్రాంతానికి వెళ్లి ఆమెను కాపాడి పైకి తీసుకుని వచ్చారు.ఆమె గురించి అడగగా వివరాలు తెలిపేందుకు నిరాకరించింది, ఆమెను కొంతసేపు స్థిమితంగా ఉండనిచ్చి వివరాలను అడుగగా తనది కోనసీమ జిల్లా అయినవిల్లి మండలం కాప చింతలపూడి గ్రామమని,తన భర్తతో గొడవలు,విభేదాలు వల్ల చనిపోవడానికి వచ్చినట్లు తెలిపింది. వెంటనే ఆమెను మహిళా పోలీస్ స్టేషన్ కు తీసుకుని వచ్చి తూర్పుగోదావరి జిల్లా ఎస్పీ డి. నరసింహ కిషోర్ ఆదేశాల మేరకు మహిళా పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ ఆమెకు కౌన్సిలింగ్ ఇచ్చి, ఆమె బంధువులకు అప్పగించారు.

# ప్రాథమిక పాఠశాలలో చేరిన అంగన్‌వాడీ పిల్లలు



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** స్థానిక 43వ వార్డు పరిధిలోని అంగన్వాడీ కేంద్రంలోని ఐదు సంవత్సరాల వయసు నిండిన పిల్లలను నగరపాలకసంస్థ ప్రాథమిక పాఠశాలలో చేర్పించారు. మాజీ కార్పొరేటర్ కంటిపూడి పద్మావతి, 43వ వార్డు టీడీపీ ఇన్చార్జి కంటిపూడి శ్రీనివాస్ చొరవతో వారందరిని చేర్పించారు.ఐదేళ్ళు నిండి ఆరో ఏటా అడుగిడే పిల్లలను ప్రాథమిక పాఠశాలల్లో చేర్పించాల్సి ఉంది.దీని కోసం ఆ పిల్లల తలిదండ్రులను కంటిపూడి శ్రీనివాస్ కంటిపూడి పద్మావతి ఒప్పించారు. శనివారం జరిగిన ఈ కార్యక్రమంలో ఎలిమెంటరీ స్కూల్ ప్రధాన ఉపాధ్యాయులు, 43వ వార్డు ఇన్చార్జి, వార్డుకమిటీ సభ్యులు, తలిదండ్రులు పాల్గొన్నారు.

**కమ్యూనిటీ హాల్ మరమ్మతు పనులను**

# పర్యవేక్షించిన కమిషనర్ రాహుల్ మీనా



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** పేద, మధ్య తరగతి ప్రజల అవసరాలను దృష్టిలో పెట్టుకుని కమ్యూనిటీ హాలులో వసతులను కల్పించాలని కమిషనర్ రాహుల్ మీనా సూచించారు. శనివారం ఉదయం ఇంజనీరింగ్ విభాగం అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో ఆయన పర్యటించారు. 18వ వార్డు కొండా వారి వీధిలో రూ. 10 లక్షలతో చేపట్టిన కమ్యూనిటీ హాల్ మరమ్మతు పనులను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా పనుల పురోగతిని అధికారులను అడిగి తెలుసుకున్నారు. అత్యంత నాణ్యతతో పనులను చేపట్టాలని సూచించారు. వీలైనంత త్వరగా భవనాన్ని వినియోగంలోకి తీసుకురావలసిందిగా ఆదేశించారు. ఆయన వెంట ఈఈ మాధవి, ఎంహెచ్ఓ వినూత్న, ఇతర సిబ్బంది ఉన్నారు.

**నక్కా శ్రీనగేష్ పరామర్శించిన**

# టికే విశ్వేశ్వరరెడ్డి, బలరాం నాయుడు




**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** ఇటీవల బొల్లినేని హాస్పిటల్‌లో బైపాస్ సర్జరీ చేయించుకుని రాజేందర్‌నగర్‌లో ఇంటి వద్ద రెస్టు తీసుకుంటున్నటువంటి వైఎస్ఆర్సిపి అధికార ప్రతినిధి నక్కా శ్రీనగేష్‌ని అఖిలపక్ష కన్వీనర్ దేశిరెడ్డి బలరాం నాయుడు, జిల్లా కాంగ్రెస్ పార్లమెంటరీ కోఆర్డినేటర్ డాక్టర్ టి.కే విశ్వేశ్వర్ రెడ్డి ఆయన యొక్క ఆరోగ్యశ్రీ పూర్తి స్థాయి నయం కావాలని ఆ భగవంతుడి ప్రార్థిస్తూ ఆయన యొక్క యోగక్షేమాలు అడిగి తెలుసుకోవడం జరిగినది.

# వేడుకగా నారాయణ విద్యార్థుల గ్రాడ్యుయేషన్



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** నారాయణ ఆర్జెడి-ఎన్ సి ఎస్ అయ్యప్ప నగర్ బ్రాంచ్ లో ఈ -కిడ్జ్, ఈ-ఛాంప్స్ విద్యార్థుల గ్రాడ్యుయేషన్ వేడుకగా జరిగింది.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా క్లస్టర్ ప్రిన్సిపాల్ నీరజ హాజరయ్యారు. అలాగే ఆర్ & డి విభాగాధిపతులు సుస్మిత, మోహిని, బ్రాంచ్ ప్రిన్సిపాల్ సునీత సాగర్ కార్యక్రమాన్ని రూపొందిచారు. ఈ సందర్భంగా తల్లిదండ్రులు, విద్యార్థులను ఉద్దేశించి అతిథులు ప్రసంగించారు. విద్యలో మార్పు, ఆధునిక బోధనా పద్ధతులు, జ్ఞాన ప్రాముఖ్యతపై తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు.కో ఆర్డినేటర్ హరిత, మాధురి విద్యా కార్యక్రమంపై వివరించి, విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి పాఠశాల కట్టుబాటును వివరించారు.కార్యక్రమం విజయవంతంలో వైస్ ప్రిన్సిపాల్స్, ఉపాధ్యాయులు సంపూర్ణ సహకారం అందించారు.తల్లిదండ్రులు, విద్యార్థులు ఈ వేడుకలో ఉత్సాహంగా పాల్గొని కార్యక్రమానికి మరింత ఉత్సాహాన్ని తీసుకువచ్చారు. ఈ కార్యక్రమం విజయవంతంగా నిర్వహించడం పట్ల తల్లిదండ్రులు తమ ఆనందాన్ని అభినందనలను వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా బ్రాంచ్ ప్రిన్సిపాల్ తల్లిదండ్రుల నిరంతర, సంపూర్ణ సహకారానికి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.

# నల్లగా ఉన్నావ్ అంటూ అవమానించారు..

## ఇప్పుడు సీరియల్స్‌లో మంచి గుర్తింపు



సినిమా సెలబ్రెటీల కంటే సీరియల్స్ లో నటించే నటీమణులు చాలా మంది మంచి క్రేజ్ సొంతం చేసుకున్నారు. కొంతమంది సీరియల్స్ ద్వారా సినిమాల్లోనూ అవకాశాలు అందుకుంటున్నారు. ఇక సీరియల్స్‌లో విలన్స్‌గా నటించిన చాలా మంది బయట ఎంతో సెన్సిటివ్‌గా ఉంటారు. సీరియల్స్‌లో తమ నటనతో ఎంతో మంది నటీమణులు ఎదురుచూస్తున్నారు. చాలా మంది ముద్దుగుమ్మలు సీరియల్స్‌తో మంది క్రేజ్ తెచ్చుకొని సినిమాల్లోనూ అవకాశాలు అందుకున్నారు.. అంతే కాదు సినిమాలకు మించిన క్రేజ్ సొంతం చేసుకున్న వారు కూడా ఉన్నారు. ఇక ఇప్పుడు వస్తున్న సీరియల్స్ ప్రేక్షకులను విపరీతంగా ఆకట్టుకుంటున్న ఇల్లు ఇల్లాలు పిల్లలు ఒకటి. ఈ సీరియల్స్ కు మంచి క్రేజ్ ఉంది.. సాయంత్రం ఐతే చాలు ఆడవాళ్లు టీవీలకు అతుక్కుపోయి సీరియల్స్ ను తెగ చూస్తున్నారు. ఇక ఇల్లు ఇల్లాలు పిల్లలు సీరియల్స్ నటించిన చాలా మందికి మంచి గుర్తింపు తెచ్చిపెట్టింది. ఇదే సీరియల్ తో పాపులర్ అయినా వారిలో శ్రీవల్లి ఒకరు. ఆమె సీరియల్‌లో నెగిటివ్ పాత్రలో మెప్పించింది ఆమె.. సీరియల్‌లో తన పాత్రతో ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంది శ్రీవల్లి. ఆమె అసలు పేరు. ఏకే త్రివేణి.. ఈ చిన్నది సీరియల్ లో నెగిటివ్ పాత్రలో అద్భుతంగా నటించి మెప్పించింది. సీరియల్ లో విలన్ గా నటించిన ఆమె బయటం మాత్రం చాలా సెన్సిటివ్. ఆమె ఎన్నో కష్టాలు పడింది. సీరియల్స్ లో నటిగా గుర్తింపు తెచ్చుకోవడం కోసం ఆమె ఎన్నో కష్టాలు పడింది. చిన్నతనం నుంచి ఎన్నో కష్టాలు చూసింది ఆమె.. ఆమె కథ వింటే కన్నీళ్లు ఆగవు.. తండ్రి చనిపోయాడు! పట్టించుకోని మద్దతు ఇచ్చే బంధువులు లేరు.. పిల్లలను పెంచడానికి తల్లి ఎన్నో కష్టాలు పడింది. ఇక తల్లి కష్టాలు చూస్తూ పెరిగిన ఈ త్రివేణి చదువు కూడా డిగ్రీ మధ్యలోనే ఆపేసింది.. తల్లికి మద్దతు ఇవ్వడానికి ఆమెకు నచ్చిన యాక్టింగ్ రంగంలోకి అడుగుపెట్టింది.. ఎన్నో సినిమాల్లో బ్యాగ్రౌండ్ ఆర్టిస్ట్ గా యాక్ట్ చేసిన త్రివేణి.. తమిళ్ సుందరి సీరియల్ లో హీరోయిన్‌గా అవకాశం అందుకుంది. ఆ తర్వాత ఎన్నో సీరియల్స్, సినిమాలు చేసింది. ఇక ఇప్పుడు ఇల్లాలు పిల్లలు సీరియల్ లో విలన్ గా నటిస్తుంది. సీరియల్స్ లోకి వచ్చిన సమయంలో చాలా మంది నెగిటివ్ కామెంట్స్ చేశారట. నల్లగా ఉన్నావ్ అంటూ అవమానించారట.. మొదట్లో అవకాశాలు కూడా సరిగా వచ్చేవి కాదని ఇప్పుడు మెల్లగా అదృష్టం బాగుండి అవకాశాలు వస్తున్నాయి.. తన తల్లి ఎంతో సపోర్ట్ చేస్తుందని అని ఏకే త్రివేణి తెలిపింది.

### రష్మిక ఖాతాలో

# మరో అరుదైన ఘనత..

## అంతర్జాతీయ వేదికపై మెరవనున్న తెలుగింటి కోడలు..



నేషనల్ క్రష్ రష్మిక మందన్న గురించి ప్రత్యేకంగా పరిచయం అక్కర్లేదు. ఎలాంటి బ్యాగ్రౌండ్ లేని ఓ సాధారణ అమ్మాయి ఇప్పుడు పాన్ ఇండియా అగ్ర కథానాయికగా బ్యాక్ టూ బ్యాక్ చిత్రాలతో దూసుకుపోతుంది. తెలుగు, తమిళం, హిందీ భాషలలో వరుస సినిమాలతో అలరిస్తుంది. ప్రస్తుతం ఈ అమ్మడు ఖాతాలో ఓ అరుదైన ఘనత వచ్చి చేరింది. పాన్ ఇండియా అగ్ర కథానాయికగా తనకంటూ ప్రత్యేక ఇమేజ్ క్రియేట్ చేసుకుంది రష్మిక మందన్నా. అభిమానులు ముద్దుగా నేషనల్ క్రష్ అంటూ పిలుచుకునే ఈ అమ్మడు ఇటీవలే వైవాహిక జీవితంలోకి అడుగుపెట్టింది. చాలా కాలంగా విజయ్ దేవరకొండతో ప్రేమలో ఉన్న రష్మిక.. ఈ ఏడాది ఇరు కుటుంబ సమక్షంలో పెళ్లి చేసుకుంది. ఇప్పుడు రష్మిక తెలుగింటి కోడలు. మరోవైపు ఇటీవలే ఉత్తమ నటిగా గద్దర్ ఫిల్మ్ అవార్డు అందుకుంది రష్మిక. తాజాగా మరో అంతర్జాతీయ ఘనత సొంతం చేసుకున్నారు. జపాన్ వేదికగా అత్యంత ప్రతిష్టాత్మకమైన క్రంచీరోల్ యానిమే అవార్డుల వేడుకలో వరుసగా రెండోసారి ప్రెజంటర్ గా వ్యవహరించే అరుదైన అవకాశం దక్కించుకుంది. గతంలో 2024లో ఈ వేదికపై మెరిసింది రష్మిక. ఇప్పుడు మరోసారి సందడి చేయనుంది. రెండుసార్లు ఈ గౌరవం పొందిన తొలి భారతీయ సినీ సెలబ్రెటీగా రికార్డు క్రియేట్ చేసింది రష్మిక. యానిమేటెడ్ చిత్రాలు, వెబ్ సిరీస్ లలో ప్రతిభ కనబరిచిన వారికి ఇచ్చే ఈ పురస్కారాల 10వ ఎడిషన్ వేడుక మే 23న టోక్యోలో ఘనంగా జరగనుంది. ఈ సందర్భంగా హాలీవుడ్ ప్రముఖులతో కలిసి ఆమె విజేతలకు అవార్డులను అందజేయనున్నారు. పుష్ప సినిమాలోని శ్రీవల్లి పాత్రతో రష్మికకు జపాన్ లో భారీ క్రేజ్ ఏర్పడింది. ఇంటర్నేషనల్ లెవల్లో రష్మికకు భారీగా ఫ్యాన్ ఫాలోయింగ్ ఉందన్న సంగతి తెలిసిందే. ఇటీవలే యానిమల్, పుష్ప 2, కుబేర, గర్ల్ ఫ్రెండ్, థామా వంటి చిత్రాలతో వరుస హిట్స్ అందుకున్న ఆమె.. ప్రస్తుతం మైసా, రణబాలి చిత్రాల్లో నటిస్తున్నారు. రణబాలి చిత్రంలో మరోసారి విజయ్ దేవరకొండ, రష్మిక జంటగా నటిస్తున్నారు. గతంలో వీరిద్దరి కాంబోలో వచ్చిన గీతా గోవిందం, డియర్ కామ్రేడ్ చిత్రాలు సూపర్ హిట్ అయిన సంగతి తెలిసిందే. ఇప్పుడు మరోసారి వీరిద్దరి కాంబో రిపీట్ కాబోతుండడంతో రణబాలి చిత్రంపై మరింత ఆసక్తి నెలకొంది. మైసా, రణబాలి సినిమాలు త్వరలోనే ప్రేక్షకుల ముందుకు రానున్నాయి.

# కొద్ది గంటల్లోనే మారిన సీన్..

## ఢిల్లీకి షాకిచ్చి నెంబర్ 1 పీఠం ఎక్కిన రాజస్థాన్ రాయల్స్

క్రీడా వాయిస్



ఐపీఎల్ 2026 డబుల్ హెడర్ తర్వాత రాజస్థాన్ రాయల్స్ పాయింట్ల పట్టికలో అగ్రస్థానానికి చేరుకుంది. ఢిల్లీ క్యాపిటల్స్ రెండో స్థానానికి పడిపోగా, చెన్నై సూపర్ కింగ్స్ ఆఖరి స్థానంలో ఉంది.గుజరాత్ టైటాన్స్ ఓడిపోయినప్పటికీ రన్ రేట్ పరంగా 7వ స్థానంలోనే స్థిరంగా ఉంది. ఐపీఎల్ 19వ సీజన్ రసవత్తరంగా సాగుతోంది. మైదానంలో ఆటగాళ్లు సిక్సర్లు, ఫోర్లతో విరుచుకుపడుతుంటే, పాయింట్ల పట్టికలో ఈక్వేషన్స్ క్షణక్షణానికి మారిపోతున్నాయి. ఏప్రిల్ 4న జరిగిన ఈ సీజన్ తొలి డబుల్ హెడర్ (ఒకేరోజు రెండు మ్యాచ్‌లు) తర్వాత పాయింట్ల టేబుల్ పూర్తిగా తలకిందులైంది. ఢిల్లీ క్యాపిటల్స్ కొద్ది గంటల పాటు అనుభవించిన అగ్రస్థానాన్ని రాజస్థాన్ రాయల్స్ లాగేసుకుంది. గుజరాత్ టైటాన్స్ ఓటమి ఢిల్లీ కొంపముంచగా, రాజస్థాన్ కు పట్టం కట్టింది. శనివారం జరిగిన తొలి మ్యాచ్‌లో ముంబై ఇండియన్స్‌పై 6 వికెట్ల తేడాతో ఘనవిజయం సాధించిన ఢిల్లీ క్యాపిటల్స్, అప్పటివరకు నాలుగో స్థానంలో ఉన్న తన ర్యాంకును నేరుగా మొదటి స్థానానికి తీసుకెళ్లింది. దీనివల్ల పంజాబ్ కింగ్స్ రెండో స్థానానికి, రాజస్థాన్ రాయల్స్ మూడో స్థానానికి పడిపోయాయి. అయితే ఢిల్లీ అనుభవించిన ఈ బాద్‌షా గిరి కేవలం కొన్ని గంటలకే పరిమితమైంది. రెండో మ్యాచ్‌లో గుజరాత్ టైటాన్స్‌ను రాజస్థాన్ రాయల్స్ ఓడించడంతో పాయింట్ల లెక్కలు మళ్లీ మారిపోయాయి. గుజరాత్ ఓటమి వల్ల ఢిల్లీ తన అగ్రస్థానాన్ని కోల్పోయి రెండో స్థానానికి పడిపోవాల్సి వచ్చింది.

**నెంబర్ వన్ సీటులో రాజస్థాన్ రాయల్స్**

ప్రస్తుతం పాయింట్ల పట్టికలో రాజస్థాన్ రాయల్స్, ఢిల్లీ క్యాపిటల్స్, పంజాబ్ కింగ్స్ తలో 4 పాయింట్లతో సమానంగా ఉన్నాయి. ఈ మూడు జట్లు ఇప్పటివరకు ఆడిన రెండు మ్యాచ్‌ల్లోనూ విజయం సాధించి అజేయంగా నిలిచాయి. అయితే రన్ రేట్ విషయంలో రాజస్థాన్ అందరికంటే ముందుంది. రాజస్థాన్ నెట్ రన్ రేట్ ౦2.233 గా ఉండటంతో అది నెంబర్ వన్ స్థానాన్ని కైవసం చేసుకుంది. ఢిల్లీ క్యాపిటల్స్ (౦1.170) రెండో స్థానంలో, పంజాబ్ కింగ్స్ (౦0.637) మూడో స్థానంలో ఉన్నాయి. ఇక రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (=జదీ) ఒకే మ్యాచ్ ఆడి విజయం సాధించినప్పటికీ, మెరుగైన రన్ రేట్ (౦2.907) తో నాలుగో స్థానంలో కొనసాగుతోంది.

**అట్టడుగున చెన్నై సూపర్ కింగ్స్**

ఒకప్పుడు ఐపీఎల్‌ను శాసించిన చెన్నై సూపర్ కింగ్స్ ఈ సీజన్ ఆరంభంలో తీవ్రంగా ఇబ్బంది పడుతోంది. ప్రస్తుతం పాయింట్ల పట్టికలో సిఎస్కే అందరికంటే ఆఖరి స్థానంలో (10వ స్థానం) ఉంది. కోల్‌కతా నైట్ రైడర్స్ 9వ స్థానంలో నిలిచింది. డబుల్ హెడర్‌లో ఓడిన జట్ల విషయానికి వస్తే.. ముంబై ఇండియన్స్ ఒక స్థానాన్ని కోల్పోయి 5 నుంచి 6వ స్థానానికి పడిపోయింది. గుజరాత్ టైటాన్స్ ఓడిపోయినప్పటికీ రన్ రేట్ పరంగా 7వ స్థానంలోనే స్థిరంగా ఉంది. లక్నో సూపర్ జెయింట్స్ 8వ స్థానంలో కొనసాగుతోంది.

**రానున్న మ్యాచ్‌లతో మరిన్ని మార్పులు**

ఐపీఎల్ 19వ సీజన్ ఇప్పుడిప్పుడే ఊపందుకుంటోంది. 10 జట్ల మధ్య జరుగుతున్న ఈ పోరులో ప్రతి మ్యాచ్ ఒక యుద్ధంలా మారుతోంది. రన్ రేట్ అనేది ప్లే ఆఫ్స్ రేసులో కీలక పాత్ర పోషించనుంది కాబట్టి, జట్లు కేవలం గెలవడమే కాకుండా భారీ తేడాతో విజయం సాధించడానికి ప్రయత్నిస్తున్నాయి. ముఖ్యంగా అట్టడుగున ఉన్న చెన్నై, కోల్‌కతా వంటి జట్లు తర్వాతి మ్యాచ్‌ల్లో పుంజుకుంటే టాప్-4 రేసు మరింత ఆసక్తికరంగా మారుతుంది. రాజస్థాన్ తన జోరును ఇలాగే కొనసాగిస్తుందా లేదా మరేదైనా జట్టు అగ్రస్థానాన్ని లాగేసుకుంటుందా అన్నది చూడాలి.




VISWAM VOICE Telugu Daily: Edited, Printed, Published and Owned by KHANDAVELLI SUNIL KUMAR, H.No:3-168, Pedda Brahmamgariveedi, Rayavaram, Rayavaram (M), East Godavari District, Andhra Pradesh. Pin:533346. Ph:092460 33999, 9238823333, 8099966647, Printed at Kumar Publication, H.No.9-125, Indiramma Colony, Rayavaram, Rayavaram(M), East Godavari District, Andhra Pradesh. Pin:533346, Editor: KHANDAVELLI SUNIL KUMAR. RNI No: APTEL 2017/73603(146158), viswamvoice@gmail.com